డిసెంబర్ 1974


63

సృజన

నీ బాటనే మేము నరుడో భాస్కరుడా
బందూకు పట్టాము నరుడో భాస్కరుడా
బందూకు సేతబట్టి నరుడో భాస్కరుడా
బంధాలు తెంచాము నరుడో భాస్కరుడా







సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాస పత్రిక

63

డిసెంబర్ 1974

మనవి

ప్రచురణార్థం పంపే వార్తలు, ఖండనలు వీలైనంత సంక్షిప్తంగా పంపించవలసిందిగా కోరుతున్నాం— కాగితం కొరతమూలంగా వచ్చిన వార్తలనే క్లుప్తీకరించవలసివస్తున్నది. ముద్రణకు స్వీకరించని రచనలు తిప్పిపంపడానికి వీలుపడదు. రచయితలు తాముపంపే రచన ప్రతి వొకదాన్ని తమవద్దవుంచుకొని పంపగలరు.

నిర్వహణ

"సాహితీ మిత్రులు"

150 పైసలు

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu'
Printed at Venkataramana Mudranalayam,
J.P.N. Road, Warangal-506002 (A.P.)

కొత్త పుస్తకాలు

కొండగాలి

(శ్రీకాకుళ పోరాట జీవితాన్ని కన్నులకు కట్టిన నవల)

వెల : రూ. 3.00 రచన – భూషణం

ప్రచురణ :
శ్రీకాకుళ ప్రచురణలు,
పార్వతీపురం

ప్రతులకు :
భూషణం, మేరంగి (పోస్టు)
పార్వతీపురం తాలూకా, శ్రీకాకుళం

☆

ఏరువాక

(జనం గుండెల్లో మండుతున్న పోరాటపాటలు)

వెల : రూ. 1-25 రచన : ప్రసాదరావు

ప్రచురణ :
విరసం, విశాఖ యూనిట్

ప్రతులకు :
కన్వీనర్, విరసం యూనిట్
ఆంధ్రా యూనివర్సిటీ,
విశాఖపట్నం-530 003

పై రెండు పుస్తకాలు
సృజనవద్ద కూడా
దొరుకుతాయి.

విప్లవ రచయితలపై ప్రభుత్వం చార్జ్‌షీట్

(కామ్రేడ్స్ త్రిపురనేని మధుసూదనరావు, కె.వి. రమణారెడ్డి సమాధానాలు)

ప్రచురణ : విప్లవ రచయితల సంఘం వెల : 70 పైసలు

ప్రజలు విప్లవాన్ని కోరుతున్నారు – విప్లవం కుట్రకాదు

(సికిందరాబాద్ 10వ మెజిస్ట్రేట్ కోర్టులో విప్లవ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ త్రిపురనేని మధుసూదనరావు ప్రకటన.)

ప్రచురణ : విప్లవ రచయితల సంఘం వెల: 30 పైసలు

ప్రతులకు : సృజన, హనుమకొండ, వరంగల్-506 001.

త్యాగాల వెలుగుబాటలో

డాక్టర్ ద్వారకనాథ్ కోట్నీస్ 32వ వర్థంతి సందర్భంగా యీ సంచిక ఆయన అమరస్మృతికి అంకితం.

జపాన్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా చైనా ప్రజలు జరిపిన ప్రతిఘటనా పోరాటకాలంలో 1938 లో డా. కోట్నీస్ భారతదేశం నుండి చైనాకు వెళ్ళి అక్కడ డా. బెతూన్ స్థాపించిపోయిన ఒక అంతర్జాతీయ శాంతి చికిత్సాలయం మరియు వైద్య పాఠశాలకు మొదటి డైరెక్టర్‌గా పనిచేశారు. డా. బెతూన్ విడిచివెళ్ళిన బాధ్యతల్ని ఎంతో గౌరవతో, సాహసోపేతంగా నెరవేరుస్తూ ప్రజాసేవలోనే డిసెంబర్ 9, 1942 లో కన్నుమూశారు. డా. కోట్నీస్ అత్యంత ప్రతిభాశాలియైన డాక్టర్. ప్రజలంటే అపారమైన ప్రేమ రోజులతరబడి విశ్రాంతిలేకుండా వారికోసం పనిచేసేవారు. ఇట్లా పనిచేసి ఒక పర్యాయం ఆయన 13 రోజుల్లో 800 క్షతగాత్రులను రక్షించారు. డా. కోట్నీస్ చనిపోయి 30 సం.లకు పైగా అయింది. కాని ఆయన చైనా ప్రజల్లో నెల కొల్పిన స్నేహమూ, బాంధవ్యమూ శాశ్వతమైనవి. రెండు గొప్ప దేశాల ప్రజలమధ్య ఐక్యతా వారధి నిర్మించిన అంతర్జాతీయ మానవుడు ఆయన "డా. కోట్నీస్ అంతర్జాతీయ చైతన్యాన్ని మనం మరవకూడదు"అని చెయిర్మన్ మావో ఆయనసేవకు గొప్ప నివాళులు అర్పించారు చైనా ప్రజలు ఆయన శాశ్వత జ్ఞాపకార్థం షిచియా చువాంగ్ అనే చోట ఆయన స్మారకాన్ని నెలకొల్పారు. వారి గుండెల్లో ఆయనకు గొప్ప స్థానముంది. డా. కోట్నీస్, డా. బెతూన్‌ల అంతర్జాతీయ చైతన్యంబోధించే పాఠాలుకూడా అక్కడి విద్యార్థుల పాఠ్యపుస్తకాల్లో చోటుచేసుకున్నాయి.

ఇటీవల 'డా. కోట్నీస్ అఖిలభారత స్మారక సంఘం' చైనాలో 6 వారాలు పర్యటనచేసిన సందర్భంలో అక్కడి ప్రజలు భారతీయులయెడ వ్యక్తంచేసిన స్నేహసౌహార్దాలు మరపురానివి. భారత ప్రజలతో మైత్రిని చైనీయులు ఎంతో గాఢంగా వాంఛిస్తున్నారు. కాని మన బూర్జువా ప్రభుత్వం తాను స్నేహహస్తాన్ని అందిస్తున్నా, చైనా ప్రభుత్వమే ఉదాసీనవైఖరి ప్రదర్శిస్తున్నదనే అసత్య ప్రచారంతో మనల్ని మోసగిస్తున్నది. మన తరువాత రెండేళ్ళకు స్వాతంత్ర్యంపొంది శ్రామికజన నియంతృత్వంలో, సాంస్కృతిక మహావిప్లవంద్వారా సోషలిస్టు నిర్మాణదశలో సాధించిన ఘనవిజయాలను మనకు తెలియనీయకుండా చేస్తున్నది. అన్నిరంగాలలో తన ఘోరవైఫల్యాలను కప్పిపుచ్చుకొని నేడు ప్రపంచ విప్లవ కేంద్రంగాఉన్న జనచైనాను మనకు దూరం చేయాలనే మనల్ని విప్లవోన్ముఖంగా ఆలోచింపకుండా చేయాలనే నీచపు ఎత్తుగడలలో భాగమే యిది. సోషల్ సామ్రాజ్యవాద రష్యా చేతిలో కీలుబొమ్మై 'పంచశీల'ను మట్టిలోకలిపి

చైనాతో మైత్రికి ఆటంకమైన అన్ని విధానాలనూ అవలంబిస్తోంది- కాని ప్రజలు విప్లవాలు కోరుతున్న, విప్లవమే ప్రపంచ ప్రధాన ధోరణిగా ఉన్న నేటి తరుణంలో భారత-చైనా ప్రజల మైత్రిని ఎవరూ ఆటంకపరచలేరు.

వర్గసమాజంలో వ్యాధులన్నిటికీ దోపిడీవ్యవస్థయే మూలమని శ్రీకాకుళ సాయుధ రైతాంగ విముక్తి పోరాటంలో ప్రముఖపాత్ర నిర్వహించి ప్రజలకోసం ప్రాణాలర్పించిన విప్లవ మేధావి డాక్టర్ చాగంటి భాస్కరరావును స్మరించుకోవడం యీ తరుణంలో మనకర్తవ్యం. ఆయన శ్రీకాకుళం ఏజెన్సీ ప్రాంతంలో గ్రామగ్రామమూ తిరిగి అక్కడి రైతాంగంతో కలిసిపోయి తన గొప్ప బోధనాశక్తితో యింటింటా వర్గరాజకీయాలు నేర్పాడు- ఆయన నిరాడంబర జీవితం, కష్టసహిష్ణుత, పోరాటంలో చొరవ, ధైర్యసాహసాలు, ఉక్కు క్రమశిక్షణ, తోటి కామ్రేడ్లకు ఆదర్శప్రాయమైనవి- పోరాటమే ఊపిరిగా జీవిస్తూ 1969 నవంబర్‌లో మత్తైపేటవద్ద కా. గణపతి మరి ఇద్దరు కామ్రేడ్లతో పాటు శత్రువుచేతచిక్కి తరువాత కాల్చివేయబడ్డారు- కాని ఆయన త్యాగం వృధాపోదు. 'ఆయన చూపిన బాట మహా దొడ్డబాట'- డా. భాస్కరరావు విప్లవ బంధువూ, స్వార్థమెరుగని విప్లవ మేధావీ డా. దేవినేని మల్లికార్జునుడు సైతం శ్రీకాకుళ రైతాంగ విముక్తి పోరాటంలో ప్రముఖమైనపాత్ర నిర్వహించి 1970 జులైలో శత్రువు తుపాకీ గుండ్లకు ఎర అయిపోయాడు. ఇట్లా యీ దోపిడీ సమాజ వ్యాధికే శస్త్రచికిత్సచేయబూనుకున్న యీ డాక్టర్ల నెత్తురు త్యాగాలు ఈ దేశచరిత్రలో గొప్పఫలితాలు సాధిస్తవి.

ఇక యివాళ మన డాక్టర్లు-వాళ్ళది ఒక ప్రత్యేకమైనతెగ. వీరిలో అధికసంఖ్యాకులు తమను తాము 'ఉన్నతులు'గా భావించుకొంటూ పేదల అసహ్యించుకుంటారు- డబ్బుదాహం తప్ప వారికి పేదలపట్ల, వారి రోగాలపట్ల యెలాటి సానుభూతీ ఉండదు- ఎంత ప్రమాదకరమైనస్థితిలోవున్నా డబ్బులేనిపేషెంటును ముట్టుకోని డాక్టర్లూ ఉన్నారు. అది వారి వైద్యనీతికి (medical ethics) వ్యతిరేకం. రోగులకు రోగకారణాలూ, రోగనిరోధక పద్ధతులూ చెప్పరు- అర్ధరాత్రి అవసరమైపోతే 'డాక్టర్‌బాబు' తన మెత్తని పాన్పునుండి లేవరు. ఈ దేశంలో సరియైన తిండిలేక చుట్టూ ఆరోగ్యపరిస్థితులులేక అనేక రోగాలకు గురై, డాక్టర్లను 'అందుకోనూ'లేక రోజూ ఎందరో పేదలు చస్తున్నారు. డాక్టర్లు మాత్రం రోగుల సమాధులమీద తమ మేడల పునాదులులేపుతున్నారు. ఎక్కడో ఒకచోట మినహాయింపులు లేవనికాదు- ఈ దోపిడీ వ్యవస్థ ఉత్పత్తి చేసిన డాక్టర్లే వీరంతా. అందుకే రోగగ్రస్తమైన వ్యవస్థ మారనిదే వైద్యులూ, వైద్యవిధానమూ మారదు- డా. బెతూన్, డా. కోట్నీస్, డా. మల్లికార్జునుడు, డా. భాస్కరరావుల వారసుల కోసం యీ దేశం యెదిరిచూస్తోంది. డాక్టర్లూ, స్వార్థం విడనాడి ప్రజాసేవ చేయండి.

మా 'బేర్‌ఫూట్ డాక్టర్'

నేను ముసలి 'ఘుసు'[1]ను, ఎంతోకాలంగా గుడ్డిదాన్ని
ఇపుడు మళ్ళీ ఒకసారి వెలుగును చూడగలిగాను.
ఎన్నేళ్ళయిందో నా చూపు పోగొట్టుకొని
ఇపుడు నా కళ్ళను ఆనందాశ్రువులు నింపినవి.
ఎన్నేళ్ళుగానో నేను తడుముకుంటున్న చీకట్లు
తుడిచివేయబడ్డాయి.
నాకు చూపు మళ్ళీ రాగానే మొట్టమొదట అడిగాను
"నాకీమేలు చేసిందే డాక్టర్?"

ఓహో, నువ్వేనా బేర్‌ఫూట్ డాక్టర్
మా 'యీ'[2]జాతికి సాయం చేయడానికి వచ్చిన కొత్త డాక్టర్!
ఇప్పుడే మొదటిసారి నిన్ను చూస్తున్నప్పటికీ
ఎంతో కాలంగా నా హృదయం నీ కరుణను అనుభవిస్తున్నది
నీ చూపులు నాకు కొత్త
నీ గొంతు నేను గుర్తించాను, అది నాకు తెలుసు.
కాని నా దృష్టి నాకు నువ్వు తిరిగి యిచ్చిందాకా
నా మనసులో నీ స్పష్టమైన రూపం లేదు.

బిడ్డా నిన్ను చూస్తుంటే
నా బిడ్డ క్రూరమైన చావు గుర్తొస్తున్నది.
ఒకసారి దొరగారి[3]కొడుక్కు జబ్బుచేసింది
అతనికి దయ్యంపట్టిందని, దాన్ని తృప్తిపరచడానికి
ఇంకో శిశువును బలిఇవ్వాలని 'బిమొ'[4] చెప్పాడు
దొర నా బిడ్డను బలి ఇవ్వడానికి ఎంచుకున్నాడు
దిక్కులేని నా బిడ్డ హత్యకు ప్రతీకారం తీర్చుకునే శక్తి లేక
కోపంతో బాధతో మండి మండి నా చూపు పోయింది.

గతాన్ని ఖండించే మా సమావేశాల్లో
నువ్వు మాతోపాటు దుఃఖించావు;
మన కష్టాలన్నిటికీ మూలకారణమేదో మనంకలిసే తెలుసుకున్నాం
మా బానిసల కష్టాలు నీ హృదయంపై వేసిన చెరగని ముద్రవల్ల
పిలవనక్కర్లేకుండానే నువ్వు రోగుల్ని చికిత్సచేయడానికిపోతావు.
నయంచేసే మూలికల్ని వెతుకుతూ మా పర్వతాలు కొలుస్తావు
తుఫానులను ఎదిరిస్తూ, మంచులో తడుస్తూ
దట్టమైన చీకట్లను చీలుస్తూ
నీ అవసరం ఎక్కడవుంటే అక్కడికి ఎల్లప్పుడు పోతావు
అంతటికీ నీ మందులపెట్టె మోసుకపోతావు
నీ దీపం ఎప్పటికీ చమురుపోసి సిద్ధంగా వుంటుంది.
మా 'యీ'జాతి ప్రజలంతా నిన్ను ప్రశంసిస్తున్నారు
నువ్వు మా రక్తమాంసాల్లో కలిసి పోయావు.

మెరుస్తున్న కళ్ళతో, వెలుగుతున్న హృదయంతో
ముసలి ము ఆదరంగా ఆ యువతిని చూసింది.
"నిజంగా నువ్వు మా'యీ' జాతిలో కలిసిపోయావు
పార్టీ మాకు మంచి డాక్టర్‌ను పంపించింది."

— లియాంగ్ షాంగ్-చువాన్

---

1. ముసలవ్వ పేరు.
2. చైనాలో కొండప్రాంతాల్లో నివసించే అల్పసంఖ్యాక జాతి. (మనదగ్గర గిరిజనులవంటివారు)
3. బానిస-యజమాని (Slave-Owner)
4. స్థానిక భూతవైద్యుణ్ణి 'యీ' జాతి ప్రజలు పిలిచే పేరు.

వైద్యులారా, మీరే రోగులవద్దకు వెళ్ళండి

డా॥ బెతూన్

బీహార్ !

యాత్రికో

బీహార్. ఇవ్వాళ నా మనసంతా నీ చుట్టూ తిరుగుతున్నది.
మిల్ట్రీ చక్రబంధంలో చిక్కుకొని పగులుతున్న
బీహార్ అగ్ని పర్వతం నాడీ స్పందన
పాట్నా-పత్రికల ధర్మామీటర్లు కొలవలేక పోతున్నాయి.

సి ఆర్పీ, బి ఎస్ ఎఫ్, మిల్ట్రీ, గుండాల ముళ్ళతీగెల
ముక్కుకిందనుంచే దూరిపోతున్న జన ప్రవాహం
నా నరాల్లో నును వెచ్చని విద్యుత్తులు సృష్టిస్తున్నది-

ఏ ప్రజాస్వామ్య పరిరక్షణా పదజాలమూ,
అసెంబ్లీ చూర్లకు వేళ్ళాడుతున్న రివిజనిస్టు గబ్బిలాల
ఊదరగొట్టే నినాదాల గందరగోళమూ
ఇందిరా కేంద్రజాలమూ
ఇంతెందుకు సర్వోదయ సహన సరిహద్దులుకూడ
జనంగాలేచిన నీ ప్రతిఘటనను పట్టలేక పోతున్నాయి

తుడిచెయ్ బీహార్ తుడిచెయ్ అవినీతిని. దోపిడీని
యీ వ్యవస్థను అంటి పెట్టుకున్న కల్మషాన్నంతా తుడిచెయ్
వరదవై పొంగిన బీహార్,

వసంత మేఘం నక్సల్ బరీలో కురిసిన
తొలకరిజల్లులను కడుపులో దాచుకొని సాగి
భారత రైతాంగ సాయుధ పోరాట ప్రవాహంలో కలవాలి నువ్వు

గఫూర్‌ల. బహూన్‌ల గల్లంతు మాత్రమేకాదు,
అసెంబ్లీ రద్దు ఆశయం కాదు-
అంతిమ లక్ష్యందాకా ఆగకూడదీ పోరాటం.

ఈ వేషాన్ని రాజీనామాతో తుడిచేసుకొని
ఇద్దరు ముసుగు తీసేసి త్యాగం తొడుగు వేసుకుంటే
పాపాలన్నీ గంగలో కడిగేసుకున్న పవిత్రుడవుతాడా?
ప్రజా అసెంబ్లీలో పునర్జన్మలు ఎత్తుతాడా!

పాట్నా అసెంబ్లీ సీట్లకింద మంటలు పుట్టగానే
గాంధీ మైదానంలోకే దూకే గాడిద ఊళ
అమాంతం ప్రజా శాసన సంగీతం కాజాలదు.

పోటీ శాసనసభలుకాదు ప్రత్యామ్నాయం
ప్రజలు బూటకపు ప్రజాస్వామ్యాన్ని ప్రశ్నిస్తున్నారు
గాంధీ మైదానంలో ప్రభవిస్తానని పలుకుతున్న
శాసనసభల్లో పుట్టబోయే పాపకు రూపంలేదు
ప్రసవ వేదన పడుతున్న దేశాన్ని శస్త్ర చికిత్స
చేయడానికి జంకే వాజమ్మలు
గర్భస్రావాలో, చచ్చిన పిండాలో పట్టే
మంత్రసానులుగా మాత్రమే మిగులుతారు—
అపూర్వమైన నూతన సృష్టిని మోస్తున్న బీహార్
ఆపరేషన్‌చేసే డాక్టర్‌ని అతి జాగ్రత్తగా ఎంచుకో

నీ గమ్యం ముషాహరీలో వుంది. పాట్నాలో కాదు.
నీ వేళ్ళు వూళ్ళల్లో వున్నాయి, పట్నంలో కాదు.
పల్లెల్ని పలికించి ఢిల్లీని వణికించు బీహార్.

ప్రజలందరినీ సమస్యల్నిచేసి కదిలించావు నువ్వు
ప్రజలందరినీ ప్రశ్నలుగామార్చి నడిపిస్తున్నావు నువ్వు
ప్రజల్ని చైతన్య గాలులుగా వీస్తున్నావు నువ్వు
నిశ్చయంగా నువ్వు వర్తమానాన్ని స్పష్టంగా చూస్తున్నావు
అందుకే ప్రజల భవిష్యత్తుపట్ల నీ బాధ్యత మరీ గొప్పదిబీహార్—

ఇంత జనసందోహాన్నీ, ఉద్యమాన్నీ తూటాలకు గురిచేసే
అసహాయ అహింసా వలయంనుంచి ఆదుకో

ప్రజలు అగ్నులై జ్వలిస్తున్నారు, ప్రభంజనం సోకనియ్
ప్రజలు పిడికిళ్ళు బిగించారు, చెకుముకులు రగలనీ
ప్రజలు విసురుతున్న చేతులకు ఆయుధాలు అందనియ్
ప్రజల నెత్తుర్లు నీ వొంటి మీద మాయని మచ్చలుగా కాదు
నూతన ప్రసవాలుగా చిగురించనీ

ప్రజా వెల్లువలో హోరుపెడుతున్న నీ ఆకాంక్షలు
విప్లవ విద్యున్మాలలుగా వికసించనీ. బీహార్ ఉదయించనీ.
ఇటు అసెంబ్లీ దారికాదు, అటు గాంధీమైదానమూ కాదు

ఇవ్వాళ పాట్నా జెయిల్‌నుంచి తప్పించుకొని పోయిన
నక్సలైట్ ఖైదీల లక్ష్యంలో వుంది నీ పరిష్కారం.

లోక్‌పాల్ మంత్రదండంనుంచీ, గ్రామరాజ్య గాంధీ నామ జపం నుంచీకాదు
ప్రజాయుద్ధ విజయంలో వికసిస్తుంది నూతన ప్రజాస్వామ్యం.

> "విప్లవ సిద్ధాంతం లేనిదే
> విప్లవోద్యమ మనేదేలేదు— లెనిన్

నెత్తుటి పాట

చెరబండరాజు

అపలేరు అపలేరు ఇంక మీరు అపలేరు

ఈ మట్టిని తొలుచుకొనీ విప్లవాలు లేస్తున్నయ్
ఎరుపెక్కిన యీ మట్టికి మా నెత్తుటి స్వాగతాలు ॥అపలేరు॥

మీ చీకటి కొట్టానికి నిప్పులంటుకుంటున్నై
మా ఊపిరి తిత్తులతో ఊది ఊది మండిస్తాం ॥అపలేరు॥

పాడెకట్లు తెంచుకొనీ పల్లెలు వడిలేస్తున్నై
మేలుకున్న నిరుపేదకు మా నెత్తుటి అభివాదం ॥అపలేరు॥

విముక్తికై శ్రమశక్తులు రక్తార్పణ చేస్తున్నై
పోరాడే వీరులకు మా నెత్తుటి జేజేలు ॥అపలేరు॥

భూమిమీద సామ్యవాద బావుటాలు లేస్తున్నై
ఎదురు తిరుగు మానవుడికి మా నెత్తుటి లాల్‌సలామ్

అపలేరు -అపలేరు ఇంక మీరు అపలేరు.

(కోర్టులో పాడగా రాసుకొన్నది)

కాంతి పరిమళాలు

ఎం. టి. ఖాన్

నాలుగు మూలల చీకటి రాత్రి
ఊపిరిపై కూర్చున్నది
దూరాకాశాన్ని జెయిల్ కటకటాలు
ముక్కలు చేస్తున్నవి
దీర్ఘ చతురస్ర గవాక్షాలు
నిశ్చలంగా నిలిచిపోయినవి.
కాని చూపులదారి ఎడతెగనిది;
నిర్బంధాలను అధిగమించి
ఆవలి తీరాలకు సాగుతూ వుంటుంది—
పొలాల్లో యువశక్తి పొంగులు వారుతూ
ఇంకా ఆవల అడవుల్లో వేసిన నెగళ్ళలో,
పేదల మండుతున్న ఆకలితో
పోరాట యోధుల ఉన్నత చైతన్యంతో
ప్రకాశమానమైన దీపంలా
చుట్టూ కాంతి పరిమళాలను వెదజల్లుతూ.

నీవెవరివి ?

కిరణ్

భూస్వామ్యానికీ—
దోపిడీవర్గానికీ,
స్వార్థానికీ—
పులిజాతి మనస్తత్వానికీ,
ప్రతీకవైన నీవు
'నేనూ కమ్యూనిస్టు'నేనంటూ
నాతో చెలిమిచేశావ్
చిరునవ్వుల పువ్వుల్ని
పెదాలపై అతికించుకొని
మాటల్ని కోటలుదాటిస్తూ

నన్ను దగాచేశావ్
జీవితంలో
నిన్ను నీవే వంచించుకున్నావ్.

భవిష్యత్తుపై ఆశతో
విప్లవ విజయంపై విశ్వాసంతో
కష్టాలకూ, నష్టాలకూ కలవరపడ
కుండా
ముళ్ళమధ్య నిలిచిన ఎర్రని రోజా
పూవులా
అన్నిటినీ సహిస్తానన్నావ్
అంతిమ విజయం సాధించేదాకా
కలిసిమెలిసి నాతో వుంటానన్నావ్.

తుదివరకూ పోరాటంలో
భుజ భుజం కలిపి నిలుస్తాననీ
వాడిపోయిన ప్రజల బ్రతుకులు చిగు
రించేదాకా
నెత్తురు కాల్వలు పారిస్తాననీ ప్రతిజ్ఞ
చేశావ్.

నీ వాక్చాతుర్యానికీ
నీవు చూపే ఆరాటానికీ
మోసపోయిన నేను
ప్రజాసేవలో పాలుపంచుకొనే
త్యాగశీలి సహవాసం దొరికిందనీ
నేను చేసే దీర్ఘకాలిక విప్లవయాత్రలో
ఎర్రసైనికబలం పెరిగిందనీ
నాలో నేనే పొంగిపోయాను
నా స్నేహ హస్తం నీకందించాను.

కాలం గడుస్తుంటే
కష్టాలు కౌగలిస్తుంటే
గాలి తాకిడికి గలగలలాడే
ఆకుల కదలికకే
పారిపోతూ,
చీకటిని చూసి
దిక్కుతోచక
నీవు వేసిన కేకలను విని
నిన్నసహ్యించుకున్నాను.
కంగారెత్తిన నీ గుండెల్లోని
పిరికితనాన్నీ
స్వార్థాన్నీ
నగ్నంగా చూశాను.

నువ్వు భీరువులా
పారిపోయి
దోపిడీవర్గం మేడల్లో
కారుల్లో కులుకుతూ
నయవంచనతో
నన్ను వెన్నుపోటు పొడవాలని
చూశావ్
తూర్పుపవనాన్ని కటకటాలవెనక
బంధించాలని కలలు కన్నావ్.

విప్లవగానం చేస్తూ
దోపిడీవర్గం గుండెలు చీల్చి
రక్తం పారిస్తున్న
విప్లవ ప్రజా కంఠాన్ని
నీ రాక్షసహస్తాలతో
నొక్కివేయాలని
వ్యర్థప్రయత్నం చేస్తున్నావ్.
నీ ఆస్తుల్నీ, ప్రాణాన్నీ
దక్కించుకోవాలని-
సాయుధ విప్లవాన్ని
రూపుమాపాలని-
పోలీసు కుక్కల్ని
వెంటేసుక తిరుగుతూ
చెట్టూ- పుట్టా గాలిస్తున్నావ్
అడుగడుగునా శోధిస్తున్నావ్.

కాని-

పిచ్చివాడా!
నీకు నేను దొరకను
నా కర్తవ్యం మరువను-
ప్రతి శ్రామికుడి గుండెలోనూ
విప్లవగీతినై వెలుగుతాను,
నీపై ఎత్తిన ప్రతి ఆయుధంలోనూ
వర్గకసినై(తో) నిలుస్తాను.

నేను విప్లవజ్వాలనై
నీవు నిర్మించుకున్న
అశల్మహర్మ్యాల్ని కాల్చివేస్తాను
సమతా సుందరలోకం సృష్టిస్తాను.
నీ ద్రోహం సాగదు.
సాయుధ విప్లవం ఆగదు.

దోపిడీవర్గం నుండి వచ్చి
సాయుధ రైతాంగ విప్లవంలో
భాగస్వామివై
కష్టాలకు భయపడి పారిపోయి
విప్లవ ప్రతీఘాతకులతో
చేతులు కలిపిన విప్లవ ద్రోహీ !
నువ్వు దోపిడీ వర్గాలు సరికొత్త
ఎత్తుగడలతో నిర్మించుకున్న
రిజర్వు ఫోర్సువి.

గొల్ల కుర్మ గోత్రం

భూపాల్

గొల్ల కుర్మ గోత్ర మింటివా
ఓరబ్బిగా
గొల్లోని బాధ లింటివా

తాత ముత్తాత గూడ
గొర్లగానె సచ్చింద్రు
గొర్రె జివాలనెగాస్తే
కడుపూ కరిబొగ్గాయె... అనియక్కా
పచ్చి మిరపకాయగూడ
పిరమంటె పిరమాయె... ॥గొల్ల॥

బుడ్డంచుకు గట్కమాడు
కుత్కెదాక గంజినీళ్ళు
తైదంబలి తైదరొట్టె
నిర్పకాయ ఉల్లిగడ్డ... ఓర్నియాలి
బతుకంతా గిదేతిండి
బువ్వదింటె ఒట్టురో... ॥గొల్ల॥

ఎండవాన కోడ్పి ఈపు
గొంగడి బొంతై పాయె
కాయలు గాసిన చేతులు
గొడ్డలి శిప్పాలాయె... హర్నియక్క
చెప్పుల్లేనీ కాళ్ళూ
రాళ్ళవోలె గట్టిగాయె... ॥గొల్ల॥

పిల్లమేక దొంకదాటి
కంచెలడుగు పెట్టె పాలు
గొంగడి గొడ్డలి గుంజి
తిప్పలవెట్టే దొరోడు... అనియక్కా
కాళ్ళు యేళ్ళు మొక్కినాను
కనికారమె నూపడయ్యె... ॥గొల్ల॥

తుకమడుగున గట్టుకాడ
తుమ్మకింద గొర్లుంటె
తుకమంతా మేసెననీ
తల్లియాల్ని తిడ్తడాడు... అనియమ్మ
తుకం మేయవనిజెప్తే
తుప్పలాడ గొడతాడు... ॥గొల్ల॥

మసుర్లుపడుతుంటె సాలు
కంచెలన్ని గట్టేస్తరు
కంచడుగున గొర్లుంటే
కసిరిచ్చి పెడతారు... హనియ్యాలి
గొర్లకు సీడుంచకుంట
గోసవుచ్చుకుంటారు... ॥గొల్ల॥

పొయిల కొర్లులేక రామి
ఎండిన పుల్లిరుసు కుంచె
ఎట్ల జూసెనో పటేలు
ఆ నక్కని కుక్కలడుగ
సెట్టుగ్గట్టేసి కొడుకు
సీరిడిసీ గొట్టెనంట...॥ గొల్ల॥

ఆర్నెల్లా గొర్రెగ్రి బొచ్చు
ఆశపడీ పేనుకొనీ
పనిజెడి ఆరం రోజులు
పట్టెల గొంగడినేస్తే... నీతల్లి
గొర్రెశేల వద్దదనీ
గొంగడెత్త పాయె దొర... ॥గొల్ల॥

ఓరబ్బో: ఒతన్దార్ల
దొక్కతీసు దోపిడార!
ఏశేటా దస్రకైతె
కట్టడి గొర్రేదింటరు...తస్సదియ్యా
పెండ్లీ పెడాకులైన
పీక్క తినేదేమిద్వారు... ॥గొల్ల॥

భూమిపుత్రి లేదంటూ
పోరంబోకు గొట్టబోతె
పోలీసులొచ్చి పట్టి
టేషన్కు పట్టపోయిరి..ఓర్నియాలి
రజాకార్లకన్న గీళ్ళు
కవిగాష్టంగున్నరయ్యో... ॥గొల్ల॥

అయ్యో! ఓట్లకు నిలవద్దోడు
ఒగలవడీ గుడిసెకొచ్చి
పోరని మీ దొట్టుపెట్టి
సేతుల సెయ్యేసుకొని...హనియమ్మ
ఓటుపడేసోక్కని కొడుక్క
ఒట్టలు జూపెట్టిపాయె... ॥గొల్ల॥

గిజండా రాక ముందు
జిరాతడివి మాదుండె
యాడ మేసినా గొర్లు
గొత్కెబాగ పడ్తుండె...అర్నియక్క
రాజ్యమొచ్చెనని దొరలా
రంకులంజె బొంకులాయె
గొల్లకుర్మ గోత్రమింటవా
ఓరబ్బిగా
గొల్లోని శాస్త్రమింటివా!
కుక్కల బతుకొద్దుమాకు
మోసేతీ నీశొద్దు
రజాకార్ల జమానేదొ
రాజుకొనీ మల్లొచ్చే...ధుత్నియక్క
మన రాజ్యం ఒచ్చేదాక
మర్ని నిద్రపోవొద్దు... ॥గొల్ల॥

సోర సోర దుడ్డెగాళ్ళు
శాన పికరు జేస్తుంద్రు
ఈ బత్కులు మారనీకె
ఎత్తులెన్నొ యేస్తుంద్రు...నాయ్యాల
కొడవలి, కత్తులు, బరిశెలు
గొడలందుకుంటుంద్రు... ॥గొల్ల॥

గొర్ల నమ్మపొయిన గూడ
దళారీల దోపిడాయె
ఓట్లకొడుకు, పోలీసులు

భూస్వాములందరొకటై... శిగదరగా
ఊళ్లను తరిగేసెదాక
ఈ బతుకులు మారవురో.. ॥గొల్ల॥

పోలీసులమీదపడీ
తుపాకులే గుంజుకొనీ
తుపాకెట్ల కొట్లాలో
ఆడనె తర్ఫీదు పొంది...ఇంగేంది
రాజ్యమేలె రక్కసులా
కార్జాలే పీకుతాం... ॥గొల్ల॥

గొల్లోల్లా గోత్రిమింక
గొడ్డలికే శాస్త్రమాయె
పోజల దోచెటోన్ని పట్టి
సుట్టి రెండుగా సరికి
ఎర్రిరాజ్యమొచ్చెదాక
ఎత్తిన గొడ్డలిదించం!

గొల్ల కుర్మ గోత్రమింటవా
ఓరబ్బిగా
గొల్లోని శాస్త్రమింటవా!

పోతామయా పోరులోకి

రాజు

పోతామయా మేము పోతామయా
ఊరి ఊరికి మేము పోతామయా ॥ పోతామయా ॥

ఖద్దరు బట్టల కరుకుదోపిడి తెల్పి
దోపిడీ రాజ్యాన్ని తోసి వేయంగ ,,

ఎర్రినీ రాజ్యాన్ని కోరినిలుపంగ
ఆయుధాలనుబట్టి- అర్థివీరులమై మేము ,,

కనికరములేనట్టి- కరకు భూస్వాముల
కరకర తెగవేయ కత్తుల పట్టుకొని ,,

ప్రజలను సమకూర్చి ప్రాణాలు తెగియించి
గ్రామ గ్రామము మొదట విముక్తి గావించి
అంతిమాన మేము బస్తీలు పట్టంగ ,,

కార్మికకర్షక రాజ్యమే నిలుపంగ
మావో చెప్పినమాట- చారుచూపినబాట

పోతామయా మేము పోతామయా
ఊరి ఊరికి మేము పోతామయా.

ఎన్నాళ్ళు ఎగిరేవమ్మా

పరిటాల

ఏమమ్మా గిరజాల యిందిరమ్మా
ఎగిరెగిరి పడతావు యాలమ్మా.

సన్నకారు వారలాకు
సంగటీకి కరువయినాను
సంజయునికి కావాలంటివి
సన్నకారు ఫ్యాక్టరీని ॥ఏమమ్మా॥

రాజాల భరణాలన్నీ
రద్దుజేతు నంటివితల్లీ
ఆలవెన్నుల పేరుతోనూ
అందిస్తూ వున్నావమ్మా ॥ఎమమ్మా॥

బ్యాంకులు జాతీయంచేసి
బడుగులకే సహాయమంటివి
బలిసినోళ్ళ జేబులన్నీ
బాగానే నింపావమ్మా ॥ఏమమ్మా॥

భూమి పంచి తీరుతానని
సొల్లు కబుర్లెన్నో చెప్పి
పై చట్టం తీసినువ్వా
పైటకింద దాచావమ్మా॥ ఏమమ్మా॥

నీ చల్లని ఏలుబడిలో
కొరతకు కొరతేముందమ్మా
నీ మంత్రుల పదవులు అన్నీ
కొరతయ్యే తీరునతల్లీ ॥ఏమమ్మా॥

ఆకసాన మండేధరలలొ
మండిమాడి చస్తున్నామూ
నీ ప్రధాని పదవినికూడా
దాంట్లోనే వేస్తామమ్మా ॥ఏమమ్మా॥

నువ్వేసిన మంటల్లోన
కొర్రులయ్యి మిగిలామమ్మా
నిన్ను కూల్చి కాల్చుటాకూ
మేము రగిలి వున్నామమ్మా
॥ఏమమ్మా॥

మళ్లా ఎన్నికలొస్తున్నాయి
మాసిన చీరిడిసేయమ్మా
కొత్త రంగు చీరగట్టి
కొత్తెత్తులు వేయవమ్మా ॥ఏమమ్మా॥

నువ్వుకూసె కూతలన్నీ
నీటిమూట లయినాయమ్మా
నీకు ఓటు వేసినవారూ
నిజం తెలుసుకొన్నారమ్మా
॥ఏమమ్మా॥

కళ్ళు తెరిసినోళ్ళంతాను
కమ్యూనిస్టులవుతున్నారూ
సాయుధులై వస్తారమ్మా
చావుదెబ్బ తీస్తారమ్మా ॥ఏమమ్మా॥

చారుమజుం'దారి'లోనా
సాగివస్తు వున్నారమ్మా
తూరుపునుండొస్తున్నారు
తుళ్ళితుళ్ళి పడబోకమ్మా॥ఏమమ్మా॥

చారుబాబు పేరంటేనే
చిర్రుబుర్రు లాడకు తల్లీ
మొత్తంగా-దేశమంతా
మజుందారులవుతారమ్మా । ఏమమ్మా॥

శ్రీకాకుళ మంటనే
చికాకు పడబోకే తల్లీ
శ్రీనగరు సేతువుదాకా
శ్రీకాకుళమవుతుందమ్మా ॥ఏమమ్మా॥

వెంగళప్ప గారలువిన్నా
వెనకేసుక రాలేరమ్మా
నక్సలైట్లు తప్పక విన్నా
నరకానికి పంపెదరమ్మా॥ఏమమ్మా॥

భళా భళి పాట

అరికె సోములు

॥అయ్యలార ఓ గిరిజన సోదర అమ్మలార వినుడీ॥ ॥నాయన॥
గుప్పున కొండలు నిప్పులు గక్కుచు కుప్పించుచునుండె
శత్రువు గుండెలు మెండుగాను చవి చూచె కొండలన్ని ..
వీరయోధులౌ గిరిజన వీరుల విజయభేరి మ్రోగే ..
మేకలతిన్న తోడేళ్ళకు నూరేళ్ళు నిండెనండి ..
ఎండుకొన్న సింగాలు కదిలి చెలరేగె కొండలన్నీ ..
మదం బలిసిన మదపుటేనుగల మరుగు తెలుసుకొనియే ..
దక్షిణ కొండలో క్యాంపు వేసిన రక్కసి మూకలను ..
రెప్పపాటులో నిప్పులెగిరె కార్చిచ్చులు కమ్మించే ..
ఘోరధ్వని గుణ ఆయుధాలు మన వీరులు పేల్చారు ..
గుండెచాచి యుద్దండ వీరులై గుండె చూచికొట్టె ..
కొండలన్ని దద్దరిల్లి శత్రువుల గుండె చీల్చెనండీ ..
అమ్మోయనుచు శతృలిద్దరు తన్నుక చచ్చారు ..
చావగ మిగిలిన శతృమూకలకు చావుదెబ్బతగిలె ..
దారితెలియక శతృమూకలకు ధైర్యం చెడిపాయె ..
కోళ్ళను తిన్నా కొంకి నక్కలకు దెంకలుండుచుండె ..
త్రోవ తెలియక శతృమూకల తుంట విరుగుచుండె ..

[ఈ పాట రచయిత శ్రీకాకుళ రైతాంగ సాయుధ పోరాటంలో
అమరుడైన గిరిజన వీరుడు కామ్రేడ్ అరికె సోములు]

కామ్రేడ్ గణేశ్ కోసం

శివ. కె.

అర్థ రాత్రిళ్లు దాటింతర్వాత
చీకటి మనిషిలా నువ్వింటికొస్తే
"ఇంత దాకా ఏం మావులా చేయబోయావురా ? అంటూ
నిన్ను ప్రశ్నించేదాన్నిరా' అన్న నీ తల్లి కలబోత
శోకంలో నీతల్లి వొర్లబోసుకున్నమాట
నిజంగా యీ లోకం మీదికి ఓ ప్రశ్న గుర్తు
"ఏం మావులా కోసం మీరంతా యిలా ?!'—

కామ్రేడ్ :
మతం మందును తాగిన మత్తుకళ్ళకు
మనుషుల్ని పీక్కుతినే దోపిడీ యినుప గోళ్ళకూ
నోళ్ళకూ
మాటలేదు మనసులేదు చూపులేదు కాని
నిద్రను మరిచి ఆకల్ని తుడిచి
చీకట్లో వెన్నెట్లో
నువు వీధుల్లో మోసిన విప్లవ ఆకాంక్షలకు
అయినోళ్ళు ప్రజలన్న గొంతున్నది
అయనోళ్ళు ప్రజలన్న చూపున్నది
ఒక్క నిజమైన కమ్యూనిస్టుదే నిజమైన మనసు —

రాళ్ళు రప్పలు, ముళ్ళు గుండ్లు —
మనం నెత్తురుగా పోసుకున్న దారుల్లోనే
మనకు చావు - మనకు బతుకు-
మన చావు మనకు బతుకు...

విప్లవం నినాదంగా
నువు అంటించిన కాగితం
ఎండకు ఎండి వానకు తడిసి
గాలికి అరి చిరిగి పోవచ్చు కాని
అదే పనిగా అది

ప్రజల్లో మీటిన విప్లవ ఆకాంక్షలకు మాత్రం చిరుగులేదు
పోరాటం వూపిరిగా బతికే మనిషికి చావులేదు—

ఓ! నా! కామ్రేడ్ ఓ! గణేశ్!
పగలూ రేయీ లేని యానం మనది
బీదా బిక్కీ బతికే మార్గం మనది
వర్గ దృక్పథంతో దూసుక పోతున్న బాణాలం మనం
వర్గకసిని శత్రునిర్మూలనగా దట్టించిన బంధూకులం మనం
చావో రేవో మన జీవితం —

ఓ కామ్రేడ్!
ఏదో కొరత ఏదో కోత ఏదో వెలితి
అయినా యీ కళ్ళమీద దుఃఖపు తెరదించుకోను
యీ కోతను కత్తిలా వాడుకుంటాను
యీ కోతను కవచంలా తొడుక్కుంటాను
గుండెమీద కన్నీటి అంచు పెడుతున్న కపిపదును—

నాకు తెలుసు
చావు లేని వ్వాడే కామ్రేడ్
కామ్రేడ్ అమరుడు.

[విప్లవ నినాదాలు రాయడం మొదలుకొని పోస్టర్లు గోడలమీద అంటించేదాకా విప్లవానికి సంబంధించి ఏ చిన్న పనైనా చొరవతో చేసుక పోయిన యువకామ్రేడ్ గణేశ్ వరంగల్ నివాసి— మనసులో ఎర్రని ఆశయాలతో విప్లవపు బాటలో దూసుకొనిపోయే యీ యువశక్తిహఠాత్తుగా 74 ఆగస్టు 25 న ఆగిపోయింది. గణేశ్ ధనుర్వాతానికి గురై కన్ను మూశాడు. కాని ఆయన ఆశయం ముందుకు పోతుంది— కామ్రేడ్ గణేశ్ స్మృతికి యీ కవిత]

> అమరవీరుల మరణానికి చలించిపోకండి
> నెత్తురు మాత్రమే చరిత్రను కొత్తరంగుల్లో రాస్తుంది.
>
> — గోర్కీ

అభ్యుదయ కవీ!

దీప్తి

మా దక్కావి
అభ్యుదయ కవీ!
పాలకవర్గం
పెంపుడు బిడ్డా!
లోకంలో
శోకాలశాతం పెరుగుతున్నా
'రాగజ్యోతు'లలో
ప్రణయరాగ మాలపించినవాడా!
'జీవనరాగం'లో
గాంధీగానం చేసిన ఘనుడా!

తూర్పు దెసను మేలుకొన్న
అరుణకాంతుల్ని చూడలేక
శిథిల గృహంలో
చీకటితో
చేతులు కలిపినవాడా!

ఏ దారిని నడవాలో
ఏ కవితల రాయాలో
అకటితో మాడుతున్న
అశేష ప్రజావాహిని నడుగు

అడుగడుగునా విప్లవ
చైతన్యంతో ఎదురు తిరుగుతున్న
విప్లవ భారతి పుత్రిల నడుగు

ఈ ఖ్యా తలేజాపంటే
మార్పే నీ తీర్పయితే
సాగుతున్న సాయుధ పోరాటంలో
నిర్ణయించుకోవోయ్ నీ స్థానం
కాలిబూదిని
కాల్పనిక జగతిని
కఠిన పదమాలా గీతికలో
వర్ణిస్తే కాదోయ్ నవ్యకవిత్వం-

కీర్తికోసం
వృత్తికోసం
కాదోయ్ కవితారచన
అన్నార్తుల విముక్తికోసం
దోపిడినాశన హేతువుకోసం
రాయాలోయ్ అగ్ని కవిత్వం.

ప్రపంచ ధనికుల్లారా ఏకంకండి

టి. లింగారెడ్డి

ప్రపంచ ధనికుల్లారా ఏకంకండి
జెనీవా సభకు హాజరుకండి
ఎవరో నక్సలైట్లట, విప్లవకారులట-
మన తలల కొరకు, తాళాల కొరకు
వస్తున్నారట- వచ్చేస్తున్నారట-
తుప్పుపట్టిన తుపాకులను తుడవండి
అప్పులన్నీ కక్కించండి- నోట్లన్నీ
బీరువాల్లోకి ఎక్కించండి

కథ :

"రిక్షావాలా"

వేణు

(ఇది వరంగల్ పట్టణంలో జరిగిన యదార్థగాథ)

ఏంరా ఖాసీంగా పైసలు యాదికున్నాయిరా ? ఉన్నాయి సేటూ. కాని శానా యిబ్బందిలున్న నాల్గురోజులాగాలె. దివానా ! నాల్గు నాల్గు అని ఏన్నిరోజులయిందిరా ? అయ్యింది సేటూ నా బిడ్డకు మొన్న పెయ్యి బాగలేకుంటే మీకిస్తామనుకున్న రూపాయలు దవాఖానాకు ఖర్చయినవి సేటూ. వచ్చేనెలలో తప్పకిస్తా. వచ్చేనెల. గిచ్చేనెల హమ్ నహీ జాన్‌తా ! సోమవారం రూపాయలు గట్టకుంటె నువ్వు రిక్ష ఎట్లా తొక్కుతావో నేను జూస్త గద.

ఏరా భాయి సేటు గరం అయితాండు. ఆఁ, ఆ కాంగ్రేసోల్ల మీటింగు నాడు యిరుగలేదుర ఆ పాతరిక్షా, అది వానిదేరా. జనం సందడిలో పోతుంటే ఓకబ్బున్న బాడుకావు కారు టక్కరుపెడితె యిరుగలేదురా ! దానికి 30 రూ.లు ఒరాయ లింగ య్యిందట. 20 రూ.లు ఇచ్చిన ఇంక 10/- ఇయ్యాలెరా- అనాడెన్నడో రాజిగాన్ని గూడ ఇట్లనె తిప్పలపెట్టిండురా, వాని పంచాయితీ ఒడగొట్టుకోరా. వచ్చేనెలలో ఇత్తానన్నరా వాడు మనిషా రాక్షసుడురా ! దొంగవెధవకు నష్టమయింది 15/- రూ లు లెక్కచెప్పింది 30

రెండవ ఆట సినిమా వదిలారు. సవారీ. సవారీ... హన్మకొండ... నయీం నగర్. సార్. సార్ వస్తారా సార్. ఎంత హన్మకొండకి. 75 పైసలు సార్. ఒక్కరే వస్తారా ! ఇంకోసవారీ... లేదులేదు 50 పైసలు ఇస్తా ఒక్కన్నే. బాబ్బాబు నాకు గిట్టదు. సవారీ... సవారీ... తిండిలేని లంజ... ఇంతకంటె ఎక్కువెవడిస్తాడురా ? సార్ ! మర్యాదగా మాట్లాడండి గిట్టితే వస్తాం. లేకుంటే లేదు. మేము ఎంతమంచోళ్ల మో, అంత చెడ్డోల్లంసార్. ఈసారి వదిలేస్తున్నానుగాని. మా'ఖాదర్' గాడుంటె వళ్ళు చింతపండు ..

సవారీ దొరకలేదు. ఖాసిం రిక్షా అడ్డాదగ్గరి కొచ్చాడు చలి...... చలి... శరీరానికి సరీగా బట్టలుకూడాలేవు. ఆరోజు మధ్యాహ్నం తిన్న గడుక. రెండుసార్లు సింగల్ టీ తాగాడంతే.

అందరూ రిక్షావాళ్ళు పట్టీ పట్టని నిదురితో కుస్తీ పడుతున్నారు. కాని ఖాసీంకు నిదురిరావడంలేదు. కడుపులో ఆకలి... ఇంట్లో భార్య. పిల్లలు, ముసల్దానికి తిండి లేదు. సోమవారం సేటు బాకి, శరీరాన్ని కొరుక్కుతినే చలి... జేబులు వెదుక్కు

న్నాడు. చిల్లర 40 పైసలు. అసలు చిల్లర డబ్బులు పేదోళ్ళకోసమే కావచ్చు అనుకొని "అల్ఫా" హోటల్ వైపు నడిచాడు ఖాసీం. తర్వాత టీ త్రాగి నిరాశగా ఇంటి వైపు రిక్షా తిప్పాడు.

అది సోమవారం రోజు ఖాసీం రాత్రి రిక్షా లాగడం మూలాన 6 గం॥ వరకు నిద్ర లేవలేదు. లేచేవరకూ సేటూ, ఇద్దరు లావుపాటి మనుష్యులు ప్రత్యక్ష్యం. ఖాసీం సాబ్! 10 రూపాయలు ఇస్తారా? (వ్యంగ్యంగా) ఏట్లా సేటూ, నే జెప్పితిగద వచ్చేనెల లిత్తానని. సాలే! నేను చెప్పలేదురా సోమవారం ఇయ్యాలనీ దొంగ బాడు కావ్! ఇజ్జత్ లేదూ! ఎన్ని దినాలయ్యిందిరా! అసలిచ్చేదాక ఈన్నుంచి కదలం. సేటూ, రాత్రికూడా పోరగాల్లు ఉపాసమే సేటూ, చిన్నపోరికి జెరం సేటూ ఈతక్లీఫ్ లో పైసలెల్లయి సేటూ. నహీఁ నహీఁ ఈ నకరాల్ నాదగ్గర పనికిరావు. నాదగ్గర చిల్లి గవ్వ లేదు సేటూ (అని కాళ్ళపై బడతాడు) ఒక్క తన్ను గట్టిగా తన్నాడు సేటు. అంతవరకు చూస్తున్న లచ్చి... ఏంది సావుకారి, అయినె మనిషా? గొడ్డా! గట్ల తంతిరి. రూపాయలు ఇయ్యాల్లగాకుంటే రేపిత్తంగాని ఇదేం పొయ్యేకాలం మీకు– లంజే! నీ మొగడు రిక్షా ఇరుగగొట్టి ఇస్తే పట్టిగనే ఊకోనా? నీకన్నా సిగ్గులేదు. ఏందో మాట్లాడొస్తానవు, అంత ఇజ్జద్దారివైతే పైసలు కిందపారెయ్ తీసుకుంట... ఒరేయ్– చూస్తారేందిరా? ఇంతలో– ఇద్దరు లావుపాటి మనుషులు ఖాసీం రెండు చేతులు విరిచి కట్టి నడురా మీ వూల్లె పటేలు దగ్గరికి... పటేలు లేడు, గిటేలు లేడు నన్ను చంపినా పైసలెల్లయి. లంజకొడుకా ఎల్లయా. ఇరుగ్గొట్టంగ యాదికిలేదీ సంగతి. వెంటనే– ఒకడు ఖాసీంను గట్టిగా పట్టుకొనగా, ఇంకొకడు కట్టెతో దారు ణంగా బాదుతున్నాడు 'సేటూ... సేటూ. నీబాంచను సేటూ...నీకాల్మొక్కుత సేటూ– అయ్యో... అయ్యో... వచ్చేనెలలిత్త సేటూ. పోరగాల్లు ఏడుపు అయ్యా... అయ్యా... అవి, లచ్చి .. థూఁ– మీరు, మనుషులా...రాచ్చసులా గొడ్డును గొట్టి నట్లు కొడుతాంద్రు' అని అంటూండగానే– ఒక కట్టెదెబ్బ లచ్చి తలకు బలంగా తాకింది. తల పగిలి రక్తం జిల జిల కారసాగింది. ఖాసీంను వదిలి ముగ్గురు రోడ్డెంబడి పరుగులకించుకున్నారు. ఖాసీం వెంబడించ ప్రయత్నించాడు. కాని అలసి పోయాడు. పిల్లలు "అవ్వా! అవ్వా!" ముసల్ది ఏడుపులు, తిట్లూ. లచ్చివంక చూశాడు ఖాసీం. పక్కింటి ఎల్లన్న సహాయంతో ఊళ్ళోని డాక్టరు దగ్గరికి తీసుక పోయాడు "ఏంది ఖాసిం నీభార్యకు! జ్వరమా?" సార్! సార్! తల పగిలింది సార్! మీరే కాపాడాలి సార్! మీరే దిక్కు సార్! స్టెతస్కోపుతో పరీక్షించి– ఖాసీం– ఇది చాలా సీరియస్ కేసు, దీనికి ఇంజక్షన్లు నాదగ్గర లేవు, వరంగల్ నుండి తెప్పించాలె, 16 రూ.లు అయితవి. అంతా ఆ దేవుని దయ, ఇదిగో యీ చీటి

తీసుకపొయ్యేతేపో... లచ్చి తలకట్టునుండి ఇంకా రక్తం కారుతూనేఉంది ఎర్రగా... ఖాసీం ఆలోచించాడు— చేతిలో ఒక్కపైసలేదు— ఒంట్లో సత్తువ లేదు— రూపాయలు పదహారు, పదహారు. పదహారు— ఎలా ? ఈ సంఘటనకు కారణం... సేటు .. సైకిల్ స్టోరు సేటు . సేటూ... వాడి రౌడీలు— నా లచ్చి తలనుండి వచ్చిన ఎర్రని రక్తం సేటునుండి కారాలి. వాడూ నా లచ్చిలాగే...కాదు. ఇంకా ఎక్కువ—గాయపడాలె. లచ్చివంకచూసి. ఎల్లన్నతో సంజ్ఞచేసి వరంగల్ దారిపట్టాడు రోడువంకచూశాడు— కాళ్ళు వద్దంటున్నాయి— హృదయం ప్రతీకారం తీసుకోవాలంటున్నది— ఏమీ తోచడం లేదు. ముఖంపై ముచ్చెమటలు పోశాయి, నిన్నటినుండి అన్నం లేదు లోతుకు పోయాయి కళ్లు. దారిలోనే ఉన్న తన గుడిశెలోకిపోయి ఏదో పట్టుకొని బయల్దేరాడు. శక్తిని పుంజుకొంటూ— కసిగా మండిబజారువరకొచ్చాడు అతికష్టంగా - సేటు... వాడే సేటు... ఖాసీం కళ్ళు ఎర్రగా చింతనిప్పుల్లా— లచ్చి రక్తం ఎరుపు. ఖాసీంకు ప్రతిదీ ఎర్రగానే కనబడుతున్నది— మధ్యాహ్నంభోజనానికి దుకాణం బందుచేసి సైకిల్ పై సేటు ఇంటివైపు బయలుదేరాడు. వెంబడించాడు ఖాసీం— రోడ్డు దాటారుఇద్దరూ— ఓ చిన్న సందు— అది ముస్లింల సందు— ఎంతగొడవైనా జనం బయటికిరారు ఇదే అదను— ఖాసీం నరాలు పట్టుతప్పుతున్నాయి— కాళ్ళు తడబడుతూ నడుస్తున్నాయి— సేటు సైకిలుకు దగ్గరగా వచ్చాడు— బొడ్లోని కత్తి తీశాడు— ఒరేయ్ సేటూ— ఆగురా— ఆగు— ఆ(ఆ(ఖాసీం— నన్ను— నన్ను— రేయ్ .. సేటు బెదిరి పోయాడు. భయంతో వణుకుతూ పక్కమోరీలో పడ్డాడు బురద అంటుకుంది— చూశాడు ఖాసిం— సేటు గుండెపై కసుక్కున పొడిశాడు— రక్తం అదే— ఎర్రగా. లచ్చి రక్తంలాగే— కాదు ఇంకా ఎర్రగా. ఎందరో రిక్షావాళ్ళ చెమట. కసితీరా పొడి చాడు ఖాసిం. పారిపోయాడు ఇంటివైపు. మరుక్షణమే— పోలీసులు— ఇన్ స్పెక్టర్లు, కార్లు, వ్యాన్లు, ఎవరూ, సైకిల్ స్టోరు సేటూ ? "అరే ఎంతగతి అయ్యిందిరా?" అని రకరకాల మనుషులు. రిక్షావాళ్ళంతా సంతోషపడ్డారానాడు. కాని ? ఖాసీం— సర్రాసరి ఇంటివైపొచ్చాడు. లచ్చి చచ్చిపోయిందని ఊరుబయటే విన్నాడు ఊళ్లోకి పోబుద్ధికాలేదు. ఖాసీం సరాసరి అటే— తూర్పువైపు. అదే ఎరుపుకోసం— ఎర్రగా— వెళ్ళిపోయాడు—

"పార్టీయొక్క నాయకులమైన మనం
కార్మికులకు బోధించడమొక్కటే కాదు—
వారివద్దనుండి నేర్చుకోవాలి."

— స్టాలిన్

మార్గం

'సృజన్'

'ఎక్కడికెళ్తున్నారు ?'

ఆగాడు...

'ఏమిటి అలా ఉన్నారు ?'

మౌనం.

'మీరేదో విషయంతో బాధపడ్తున్నట్లున్నారు ?'

నిర్లక్ష్యం...

'మీరా సేట్‌కు అప్పుపడ్డారట !?... మరి, విపరీతమైన అధిక ధరలు మనల్ని అలా చేస్తున్నాయి. 'వడ్డీకి' మన బతుకు 'సరి' అంటాడు కదూ ?'

ఏవో చూపులు.

'మీ యింటికి సేట్ రావడం పోతూ పోతూ నేను చూశానులెండి. కాని మీరా సమయంలో ఇంట్లో ఉన్నారా ?'

తల అడ్డంగా ఊగింది— 'నే వెళ్ళేసరికి పగిలిన గాజులకింద మా అమ్మాయి..'

'ఆఁ ! అలాగా !' పలకరించాను... 'అరే! ఏమిటి మీ చేతిలో ఏదో ఉందే ?'

జీవంలేని నవ్వు

'అదేంటి ఎర్రగా రక్తం అంటినట్టూ ?'

ముఖంలో తృప్తి...

'...పోలీసులున్నట్టున్నారు... మనవైపే వస్తున్నట్టున్నారు. పదండి పోదాం.'

నిర్ణయం...

'మీరు వెళ్లాల్సింది కటకటాలకు కాదు. అలాంటి ఎంతో మంది సేట్లకు బుద్ధి చెప్పాలి. పదండి పోదాం తూర్పుదిక్కు..

అనుసరించాడు.

హింస

టి. మాన్

చేతి మీద దోమ వాలింది. విదిలించా. వెంటనే ఎగిరిపోయింది (అహింసా పరమో ధర్మః) రెండోసారి రెండో చేతిని కుట్టినప్పుడూ విదిలించి చూసా. మళ్ళీ ఎగిరిపోయింది. పుస్తకం చదవటాన్ని కొనసాగిస్తూండగా కాలిమీద ఏదో కుడుతున్నట్లనిపిస్తే చూసా. ఆ దోమే దీక్షగా నా రక్తాన్ని పీల్చుకొంటోంది. పుస్తకాన్ని అవతల పడేసి ఒక్కసారి ఆ దోమని రెండు చేతులమధ్యకి వచ్చేటట్లుచూసి నలిపేసా. నేనూ ఒక ప్రాణిని చంపేసా. నేనో హంతకుణ్ణి అని ఇంకో దోమ అంది. "అహింసయే పరమో ధర్మః"— అంది నా కాలిమీద దద్దురు.

పాశ్చాత్య సంగీతంపై ఒక చర్చ

అనువాదం : గండయ్య

['ఏతత్ సంగీతశాస్త్రం తు సర్వకామ ఫలదాం రాజ్యప్రదాయకం'– అంటే సంగీతం అన్ని కోరికలను నెరవేరుస్తుంది. రాజ్యాన్నికూడా ఇస్తుంది. అని మన ఫ్యూడల్ సంస్కృత పండితులు సంగీత కళలో తమ వర్గదృక్పధాన్ని ప్రతిబింబించారు. కృతులు, కీర్తనలు, యివన్నీ కూడా ఫ్యూడల్ రాజకీయాల ప్రతిబింబాలే. అలాగే ఈనాడు అందరూ పాడుకునే సినిమా సంగీతంలో పాలకవర్గ దృక్పథం కొట్టొచ్చినట్లు కనపడుతుంది. సంగీతకళగానీ మరే కళాకూడా అధికారంలోఉన్న వర్గ రాజకీయాలకు అధీనమైనదే. ప్రస్తుత వ్యాసం "చైనా రికన్‌స్ట్రక్ట్స్ (China Reconstructs) పత్రికలోని వ్యాసానికి స్వేచ్ఛానువాదం– అనువాదకుడు.]

శాస్త్రీయ సంగీతాన్ని గురించి, ఆధునిక సంగీతాన్ని గురించి ఈనాడు జరుగుతున్న చర్చ సంగీతరంగంలో శ్రామికవర్గానికీ, బూర్జువావర్గానికీ, మార్క్సిజానికీ, రివిజనిజానికీ జరుగుతున్న నిశితమయిన పోరాటాన్ని ప్రతిబింబిస్తుంది. రివిజనిస్టు బూర్జువా సంగీతశాస్త్రాల మూలమైన 'మానవస్వభావ' సిద్ధాంతాన్ని విమర్శించటంపై ఈ చర్చ కేంద్రీకృతమవుతుంది.

బూర్జువా సంగీత రచనల వర్గ దృక్పథాన్ని సమగ్రంగా పరిశీలించడంద్వారానే మనం రివిజనిజాన్ని, 'మానవస్వభావ' సిద్ధాంతాన్ని ప్రచారంలో పెట్టటంలోని అంతరార్థాన్ని గ్రహించగలుగుతాము. అప్పుడే మనం ఆ సిద్ధాంతంలోని మోసాన్ని, దానివల్లకలిగే ప్రమాదాన్ని పూర్తిగా బయటపెట్ట గలుగుతాం. 'మానవస్వభావ' సిద్ధాంతం దోపిడీవర్గాలకు సిద్ధాంతరంగంలో ఆయుధంగా ఉపయోగపడుతుంది. వీరు ఈ సిద్ధాంతానికి మొండిగా అంటిపెట్టుకుని ఉంటూ దాన్ని తమ వర్గాల పునరుద్ధరణ కోసం చేసే పిచ్చి ప్రయత్నాలకు, సుముఖంగా ప్రజాభిప్రాయాన్ని తయారుచేయకలిగే ఒక పనిముట్టుగా భావిస్తారు.

బానిస విధానాన్ని పునరుద్ధరించ ప్రయత్నించిన కన్‌ఫ్యూషియస్, ఈ 'మానవస్వభావ' సిద్ధాంత ప్రచారానికి నడుంకట్టిన 'పెద్దమనిషి'. 'పరోపకారం' 'సామరస్యం' మొదలయిన విషయాల్ని బోధించడంలో ఆయన, ఆయన శిష్యులు, సాధ్యమైనంతదాకా ప్రయత్నించారు. ఈ బోధలు ఆచరణలో వైరుధ్యాలను కప్పిపెట్టడానికి, విప్లవపోరాటాన్ని వ్యతిరేకించి చరిత్ర రథచక్రాలను వెనుకకు తిప్పడానికి ఉద్దేశింపబడినవే. రాజకీయంగా అతడు బానిసత్వ పునరుద్ధరణకోసం ప్రచారం చేశాడు. అందువల్ల సాహిత్య సాంస్కృతికరంగాలలోకూడా ఆయన బోధలు పాతను పొగిడి కొత్తను లక్ష్య

పెట్టని పురాతన భావాలపైనే సాగినట్టు సంగీతకళపై కన్‌ఫ్యూషియస్ దృక్పథంతో రాయబడ్డ 'నోట్స్ ఆన్ మ్యూజిక్' అన్న పుస్తకంలో ఈవిధంగా ఉంది– 'సంగీతం యొక్క పాత్ర ప్రజలమధ్య సంబంధాలను సన్నిహితం చేయడం, వారిని దగ్గరకు తీసికొచ్చి పరస్పరం ద్వేషించకుండా చేయడం. అన్నివర్గాలవారూ సంగీతాన్ని ఆనందించినప్పుడే ప్రజలందరిమధ్య సన్నిహిత సంబంధాలు ఉంటవి'– దీని అర్థం, బానిస యజమానుల వర్గం యొక్క భావాలను సిద్ధాంతాలను ప్రతిబింబించే సంగీతాన్ని ప్రచారంలోపెట్టి దోపిడీని, వర్గ వైరుధ్యాలను కప్పిపెట్టి, కార్మికవర్గ పోరాటచేవను భూస్థాపితం చెయ్యడంద్వారా వారిని దోపిడీకి, పీడనకూ ఆమోదింప చేయడమే!

పెట్టుబడిదారీ విధానం పునరుద్ధరణకూ, అక్కడినుండి సోషల్ సామ్రాజ్యవాదానికి దిగజారే క్రమంలో సోవియట్ రివిజనిస్టుద్రోహుల ముఠాకూడా దాని అధికారంలో సాధ్యమైనంతవరకు 'మానవస్వభావ' సిద్ధాంతాన్ని ప్రచారంలో పెట్టడానికి చేయగలిగినంతా చేస్తున్నది. ఒకపక్క 'మార్క్సిస్టు' జండా నెగరేస్తూ, బూర్జువా సంగీతాన్ని ప్రజలందరి సంగీతంగా వర్ణిస్తూ, దాని వర్గదృక్పథాన్ని కప్పిపెట్టడానికి చాలా కష్టపడుతున్నది. అంతేకాకుండా 'బూర్జువా సంప్రదాయ సంగీతం కాలానికీ, ప్రాంతానికీ కట్టుబడదని, మానవుల మనస్సులను కదిలించడంలో దానికి అనంతమైన శక్తి వుందని, విభిన్న రాజకీయాభిప్రాయాలు కలిగివుండే ప్రజలందరికీకూడా మధురమైన కళానుభవాన్నివ్వగలదనీ' ఈ రివిజనిస్టు విద్రోహులు ప్రకటిస్తున్నారు. ఈ ప్రచారంలో వీరు బూర్జువా, భూస్వామ్యవర్గాలకంటే, పాతరివిజనిస్టులకంటేగూడా ముందంజవేస్తున్నారు. ఈ ప్రచారంద్వారా సోవియట్ ప్రజల విప్లవచేవను నాశనంచేసి తమ ఫాసిస్టు నిరంకుశత్వాన్ని బలపరుచుకోవడమే ఈ ద్రోహుల లక్ష్యం. ఇక మనదేశంలో సంప్రదాయబద్ధ సంగీతాన్నిగూర్చి "దానికి లౌకికమైన సామాజిక దృక్పథం లేదు," (రాజకీయాలతో సంబంధంలేదు–అను) "దేనికీ సంబంధంలేని 'సంగీతస్థాయిల మార్పు'లకు, 'పోలికలకు' మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తుంది" అన్న రివిజనిస్టు భావాలు చెదలుపట్టిపోయిన బూర్జువా భూస్వామ్యవర్గాల పాతకొత్త రివిజనిస్టుల భావాలే.

బూర్జువాలు ప్రదర్శించే 'స్వచ్ఛమయిన కళ' (రాజకీయాలతో సంబంధంలేనికళ–అను) 'రసాత్మకత' మొదలైనవన్నీ కూడా మోసపూరితమైన అబద్ధాలు, సంగీతము, కళలయొక్క వర్గదృక్పథాన్ని వాళ్లు నిరాకరిస్తారు. "ఒక సమాజానికిచెందిన జీవితం, మెదడులో ప్రతిబింబించిన ఫలితంగా ఉత్పన్నమయ్యే భావ చిత్రాలే రచనలూ, కళా వస్తువులూనూ"అని మావో మనకు చెప్పారు. ఒక చారిత్రక పరిస్థితిలోని వర్గసమాజంలో సాహిత్యం, కళల్లో ప్రతిబింబించే సమాజ దృక్పథాన్ని ఆనాటి వర్గాల నుండి, వర్గపోరాటాలనుండి ఎన్నడూ వేరుచేసి చూడలేం. అదేవిధంగా సంగీతరచనల్లో ప్రతి

బింబించే సామాజిక దృక్పథంకూడా నిర్దిష్టమైన వర్గ స్వభావాన్ని కలిగి ఉంటుంది. వర్గాలకు అతీతమైన సామాజిక దృక్పథాన్ని ఆ రచనలు కలిగి వుంటాయని అనుకోవడం అసాధ్యం. ఉదాహరణకు పెట్టుబడిదారీ విధానం తలఎత్తుతున్న దశలో సంప్రదాయ సంగీత రచనలుచేసిన బూర్జువాసంగీతకారులు బేక్, మొజార్ట్‌ల రచనలు అంతో ఇంతో బూర్జువా విప్లవదశయొక్క సామాజిక దృక్పథాన్నే ప్రతిబింబించినయ్. భూస్వామ్య వర్గాల సిద్ధాంతాలకు వ్యతిరేకమైన, బూర్జువాల రాజకీయకోర్కెలు, భావాలు వారి సంగీత రచనల్లో ప్రతిబింబించినై. ఫ్యూడల్ నియంతృత్వం బూర్జువా నియంతృత్వంగా మారే ఒక చారిత్రకదశలో అవి కొంతవరకు ప్రగతిశీలమైనవి.

ఎంగెల్స్ తన 'నోట్స్ ఆన్ జర్మనీ' అన్న పుస్తకంలో "జర్మనీ చరిత్రలో 18 వ శతాబ్దపు ఆఖరిభాగానికి, 19 వ శతాబ్దపు మొదటిభాగానికి మధ్యగల దశ విదేశీ సహాయంపై ఆధారపడవలసి వచ్చిన అతి అవమానకరమైన దశ. ఈ దశ బెథోవన్ సంగీతంలో ప్రతిబింబిస్తుంది." అని రాశాడు. జర్మన్ బూర్జువా విప్లవ ఆదర్శాలను నిర్దిష్టంగా తన సంగీతంలో ప్రతిబింబింవచేయడం ద్వారా బెథోవన్ జర్మనీ సంగీత విద్వాంసుల్లో అగ్రగామి అయినాడు. కాని బెథోవన్, మరి ఇతర సంప్రదాయసంగీత విద్వాంసులు తమ రచనల్లో సామాజిక దృక్పథాన్ని ప్రవేశపెట్టినాకూడా అది బూర్జువా వర్గ దృక్పథంతో చేసిన సమాజ పరిశీలన అవడంచేత వారు వ్యాప్తితో పెట్టిన 'మానవత్వ' భావాలు మోసపూరితమైన అంశాలతో కూడి వున్నవి. ఉదాహరణకు: బెథోవన్ యొక్క ప్రసిద్ధిచెందిన ఒక సంగీత రచనను (సింఫొనీ నెం. 9 డి మైనర్) తీసుకుందాం. అందులో చరణాలు ఇలా వుంటవి- "మానవాళి అంతా సోదరుల్లా వ్యవహరిస్తారు" "మానవులందరిని ప్రేమించు"- ఇది బూర్జువా 'మానవత్వ' భావాలను ప్రచారంచేయడమే! బెథోవన్ జీవించిన 19వ శతాబ్దపు మొదటిభాగపు చారిత్రక పరిస్థితులలో యీ భావాలు ఫ్యూడల్ రాజరికానికి వ్యతిరేకంగా బూర్జువాల విప్లవాత్మకమైన కోరికలను ప్రతిబింబిస్తాయి. ఆయన సంగీత రచనలు బాహాటంగా ప్రకటించుకున్న 'వర్గాతీతమైన మానవప్రేమ' అన్నది వర్గసమాజంలో ఎన్నడూ నిజంకాదు. ఈ నకిలీ 'మానవప్రేమ' ముసుగులో బూర్జువాలు కార్మికవర్గాన్ని యితర శ్రామికులను అతిదారుణంగా దోపిడీచేస్తారు. బూర్జువా సాంప్రదాయ సంగీత రచనలను మనం మార్క్సిస్టు దృక్పథంతో పరిశీలించినపుడే వాటి వర్గస్వభావాన్ని గుర్తుపట్టగలం. అప్పుడే ఆనాటి చారిత్రక పరిస్థితులలో వాటి యొక్క ప్రగతిశీలత, అభివృద్ధి నిరోధకత్వం మనకు అర్థమవుతాయి. వర్గ పరిశీలనను కొట్టివేయడం, సంప్రదాయ సంగీత రచనలు కూడా సామాజిక దృక్పథాన్ని కలిగి ఉంటాయన్న సత్యాన్ని నిరాకరించడం, వాటిని వర్గాలకూ, కాలానికీ అతీతమైనవిగా భావించడం, మొదలైనవి నిజంగా ఆ రచనల వర్గదృక్పథాన్ని కప్పిపెట్టడమే.

వర్గసమాజంలో మినహాయింపులేకుండా ప్రతి మనిషి ఆలోచనపై ఆ మనిషి వర్గం యొక్క ముద్ర ఉంటుంది. సంగీత రచనలన్నీకూడా వ్యక్తిగత భావాలను వ్యక్తం చేయడంకంటే ఒక వర్గపు ఆలోచనలను, కోరికలను వ్యక్తం చేస్తాయి. బూర్జువా సంగీత రచనలు, అవి శాస్త్రీయమైనవైనా ఆధునికమైనవైనా, 'భావావేశం లోవి మార్పులను' ఎంత అస్పష్టంగా, డొంకతిరుగుడుగా వ్యక్తంచేసినా అవి బూర్జువాలకు గులామ్‌గిరీచేస్తూ వారి రాజకీయాలను ప్రతిబింబిస్తాయి. ఉదాహరణకు: బూర్జువా 'వ్యక్తిత్వ' సిద్ధాంతాన్ని చాటిచెప్పే బెథోవన్ సంగీత రచన సింఫొనీ నెం. 5, సి. మైనర్, ను మనం తీసుకోవచ్చు. 'అదృష్టం', లేక 'కర్మసిద్ధాంతం'తో మనిషి పోరాటాన్ని ఈ రచన సూచిస్తుంది. 18వ శతాబ్దపు చివరిభాగంలో, భూస్వామ్య బంధనాల్ని చిన్నా భిన్నంచేయ సంకల్పించిన జర్మన్ బూర్జువా తీవ్రవాదుల ధృఢనిశ్చయాన్ని యీ రచన ప్రతిబింబిస్తుంది. (అయితే బూర్జువా వర్గం తాను అధికారంలోకి వచ్చింతర్వాత మళ్ళీ ఆ కర్మసిద్ధాంతాన్నే తన ఉనికికోసం పట్టుకొని వేలాడాల్సి వచ్చింది)

19 వ శతాబ్దపు చివరిభాగంలో పెట్టుబడిదారీ ప్రపంచమంతా పారిస్ కమ్యూన్ సృష్టించిన విప్లవ పెనుతుఫానుకు లోనయింది. 1888 లో పియరీ డిజైటర్ రాసిన, అత్యంత శక్తివంతమైన, పోరాట ఉత్తేజంతో నిండిన, అంతర్జాతీయ శ్రామిక గీతం (International) లో ఈ శ్రామికవర్గ విప్లవ ఝంఝ ప్రతిబింబిస్తుంది. పాత వ్యవస్థను నిర్మూలించి, నూతన వ్యవస్థను సృష్టించడానికి నడుంకట్టిన శ్రామికవర్గంయొక్క దీక్షను అది ప్రతిబింబిస్తుంది. ఇందుకు భిన్నంగా అదేకాలంలో సంగీతరచనలు చేసిన బూర్జువా భావవాది డి బస్సీ సంగీత రచనలు హీనభావంతో నిరుత్సాహంతో నిండి వుంటాయి. అతని 'ఇన్‌సేన్ పియానోస్' (insane Pianos) (పిచ్చి పియానోలు) అవే సంగీతం కల్పించే భావచిత్రాలు క్షీణదశలో వినాశనాన్ని ఎదుర్కొంటూన్న వర్గపు వికృత మనస్తత్వానికి ప్రతిబింబాలుగా ఉంటాయి. మొదటిది శ్రామికవర్గ విప్లవ సంగీతం తల ఎత్తుతున్నదశను సూచిస్తే, రెండవది బూర్జువా సంగీత క్షీణదశను, నాశనాన్ని సూచిస్తుంది. స్వేచ్ఛావ్యాపార పెట్టుబడిదారీ విధానము, సామ్రాజ్యవాద గుత్త పెట్టుబడిదారీ విధానంలోకి మారిన చరిత్రాత్మకదశ తప్పకుండా సంగీత రచనల్లో ప్రతిబింబిస్తుంది. సంగీతరంగంలో శ్రామికునికి, బూర్జువాకు మధ్యగల ఘర్షణ రాజకీయ రంగంలో ఈ వర్గాలమధ్య నిశితమైన పోరాటానికి ప్రతిబింబం.

మేము 'మానవస్వభావ' సిద్ధాంతాన్ని విమర్శించినపుడు, పాశ్చాత్యసాంప్రదాయ సంగీత పరిశీలనకూ, వర్గదృక్పథానికీ, ఎల్లప్పుడూ అంటిపెట్టుకొన్నపుడూ, కొంతమంది, 'విదేశీయమైన ప్రతిదానిని మేము నిరాకరిస్తున్నట్లు' మమ్మల్ని నిందిస్తున్నారు. వారు దురుద్దేశంతో, కుట్రతో మాపై యీ దాడిచేస్తున్నారు. విదేశీ సంగీత రీతులను మేళవించుకొనడంపై కొందరు కుతర్కం లేవదీశారు– విమర్శవుంటే మేళవింపుఉండ

కూడదనీ, మేళవింపులో విమర్శకు తావులేదనీ వీరి వాదన. ఇది ఒక యాంత్రిక భౌతికవాద దృక్పథం. శ్రామికవర్గం ఎప్పుడూకూడా విచక్షణారహితంగా పాశ్చాత్య సాంప్రదాయ సంగీతాన్ని అంగీకరించడంకాని, నిరాకరించడంకాని చేయలేదు. కొన్ని ఉపయోగకరమైన కళారూపాల దాని నుండి పరివర్తించుకొని మేళవించుకొనేప్పుడు "గతాన్ని వర్తమానానికి ఉపయోగపడేటట్లు చేయడం, విదేశీయమైనవాటిని చైనాకు ఉపయోగపడేటట్లు చేయడం" అన్న సూత్రాన్ని అంటిపెట్టుకుని శ్రామికవర్గం, పాశ్చాత్య సాంప్రదాయ సంగీతంలో బూర్జువా దృక్పథాన్ని విమర్శించడం జరుగుతున్నది.

అతిజాగ్రత్తతో చేయవలసిన యీ పనికి మనం క్లిష్టమైన పోరాటం చేయవలసివుంది. ఒక సంగీత రచనయొక్క రూపము ఎప్పుడూ దాని సారాంశాన్ని ప్రతిబింబిస్తుంది. గతితార్కికంగా రూపము, సారాంశముల కలయిక వైరుధ్యాల కలయిక.

మనం ఒక పాశ్చాత్య శాస్త్రీయ సంగీత కళా రూపాన్ని మన కనుగుణంగా మార్చుకునేప్పుడు అప్రియత్నంగా దాని బూర్జువా సిద్ధాంత విషయాన్ని అంటించుకునే ప్రమాదం ఉంటుంది. ఎవరు ఎవరిని మారుస్తున్నారు అన్న ప్రశ్న యిక్కడతలెత్తుతుంది. విభిన్న అవగాహనలు, దృక్పథాలు, పద్ధతులు, పరస్పర వ్యతిరేకఫలితాల్ని స్తాయి. పాశ్చాత్య సాంప్రదాయ సంగీతాన్ని మనం శ్రామికవర్గ దృక్పథంతో పరిశీలించ ప్రారంభించాలి. సిద్ధాంత విషయాలకు సంబంధించి మనం మొదట స్పష్టమైన వర్గవిచక్షణ చెయ్యాలి. అదే సమయంలో మనం ఒకటిని రెండుగా విభజించే పద్ధతినుపయోగించాలి. శాస్త్రీయమైన పరిశీలనద్వారా కళారూపంయొక్క ఉపయోగమైన, నిరుపయోగమైన విషయాలను పరిశీలించాలి. ఇలా చేయటంద్వారా మాత్రమే మేళవింపు (assimilation) అన్నది ఉపయోగకరంగా ఉంటుంది. మన కామ్రేడ్స్ వర్గవిభేదాలను గందరగోళపరిచే 'మానవస్వభావ' సిద్ధాంతానికి లొంగిపోతే, మార్క్సిస్టు విమర్శనా ఆయుధాన్ని వదిలిపెట్టి, బూర్జువా సాహిత్యాన్ని, కళలను విమర్శించలేకపోతే వాళ్ళు మళ్ళీ బూర్జువా సాహిత్యాన్ని, కళలను అనుసరించే వారిగా తయారవుతారు. అప్పుడు మేళవింపు (assimilation) కు ఆస్కారమెక్కడ? కాబట్టి "గతాన్ని వర్తమానానికి ఉపయోగపడేటట్లు చేయడం", "విదేశీయమైనవాటిని చైనాకు ఉపయోగపడేటట్లు చేయటం" "పాతని నిర్మూలించి కొత్తను తీసుకురావడం" అన్న పార్టీ సరియైన సూత్రాలను ఆచరణలో పెట్టడానికి 'మనం మానవస్వభావ' సిద్ధాంతాన్ని విమర్శించాల్సివుంది.

'మానవ స్వభావ' సిద్ధాంతాన్ని సిద్ధాంత రంగంలోను, ఆచరణలోను సమగ్రంగా విమర్శించడంద్వారా, కమ్యూనిస్టు పార్టీ యొక్క సరియైన మార్గదర్శక సూత్రాలను ఆచరణలో పెట్టడంద్వారానే శ్రామికవర్గంచేత రచింపబడ్డ దాదాపు పన్నెండు సంగీత రచనలు వెలువడ్డాయి. అవి మనకు చక్కని ఉదాహరణలు,

నార్మన్ బెతూన్ స్మృతికి

మావో

కామ్రేడ్ నార్మన్ బెతూన్ కెనడా కమ్యూనిస్టుపార్టీ సభ్యుడు కెనడా అమెరికా కమ్యూనిస్టు పార్టీల తరపున ఆయన చైనా వచ్చినప్పుడు ఆయన వయస్సు రమారమి యాభై సంవత్సరాలు జపాన్ వ్యతిరేక ప్రతిఘటనా పోరాటంలో మనకు అండగా వేల కొలది మైళ్ళు సునాయాసంగా దాటివచ్చాడు. గడచిన సంవత్సరం వసంతకాలంలో ఆయన యానాన్ వచ్చాడు అక్కడ నుండి వుతాయ్ పర్వతాలలో పనిచేయడానికి వెళ్ళాడు అక్కడే వీరమరణంపొంది మనల్ని శోకసంతుప్తుల్నిచేశాడు చైనా ప్రజల విమోచన లక్ష్యాన్ని నిస్వార్థంగా తనదిగా భావింపజేసిన ఆ చైతన్యం ఎటువంటిది? అది అంతర్జాతీయతా చైతన్యం. అది కమ్యూనిజం అనే చైతన్యం. దాన్నుంచి ప్రతి చైనా కమ్యూనిస్టు నేర్చుకోవాలి. పెట్టుబడిదారీ దేశాల శ్రమజీవులు వలస, అర్థవలస. దేశాల ప్రజల విముక్తి పోరాటాలనూ. వలస. అర్థవలస దేశాల శ్రమజీవులు పెట్టుబడి దారీ దేశాలలోని పోరాటాలనూ పరస్పరం బలపరచినప్పుడే ప్రపంచ విప్లవం జయ ప్రదం కాగలదని లెనినిజం బోధిస్తూంది.

కామ్రేడ్ బెతూన్ యీ లెనినిస్టుపంథాను ఆచరణలో పెట్టాడు చైనా కమ్యూనిస్టులమైన మనంకూడ యీ పంథాను మన ఆచరణలో అనుసరించాలి. జపాన్. ఇంగ్లండ్. అమెరికా. జర్మనీ. ఇటలీ యింకా తదితర సమస్త పెట్టుబడిదారీ దేశాల శ్రమజీవుల్తో మనం ఐక్యంకావాలి. ఎంచేతనంటే. సామ్రాజ్యవాదాన్ని కూలదోయటానికి. మన దేశాన్ని. ప్రజల్ని విముక్తి కావించటానికి. ప్రపంచంలో యింకా యితర దేశాల్ని. ప్రజల్ని విముక్తిచేయటానికి యిదొక్కటేమార్గం. ఇదే మన అంతర్జాతీయత. మనం సంకుచిత జాతీయవాదాన్ని. సంకుచిత దేశభక్తినీ యీ అంతర్జాతీయచైతన్యంతో వ్యతిరేకిస్తాం.

కామ్రేడ్ బెతూన్ చైతన్యం. పరిపూర్ణ నిస్వార్థ కార్యదీక్షాపరత. ఆయన తన పనిలో ప్రదర్శించిన మహత్తర బాధ్యతా దృష్టిద్వారా. తన కామ్రేడ్ల పట్ల. ప్రజలపట్ల చూపిన ఆప్యాయానురాగాలద్వారా వ్యక్తమయ్యాయి. ప్రతి కమ్యూనిస్టూ ఆయననుండి నేర్చుకోవాలి. తమ పనిలో బాధ్యతారహితంగా వుండేవాళ్ళు తక్కువగాలేరు. వాళ్ళు తేలికగావుండే పనుల్ని తమకోసం వుంచుకొని. బరువైన పనులు. బాధ్యతలు యితరులపైన నెట్టివేస్తారు. యేదొచ్చినా. అందరికంటే ముందు తమని గురించి ఆలోచించుకుంటారు. వాళ్ళు యేకొద్దిపాటి సేవచేసినా. గర్వంతో ఉబ్బిపోయి ఇతర్లకు అదెక్కడ తెలియకుండా పోతుందో అని డబ్బావాయించుకుంటారు. సోదర కామ్రేడ్స్‌పట్ల

ప్రజలపట్ల వాళ్ళకెలాంటి ఆప్యాయత ఉండదు; నిరాదరంగా, ఉదాసీనంగా, నిర్లిప్తంగా వ్యవహరిస్తారు. నిజానికి అటువంటి వ్యక్తులు కమ్యూనిస్టులుకారు; దీక్షాబద్ధులైన కమ్యూనిస్టులుగా పరిగణింపబడలేరు. యుద్ధరంగమునుంచి తిరిగివచ్చిన వాళ్ళలో బెథూన్ ప్రస్తావన వచ్చినప్పుడు ప్రశంసించకుండా వుండనివాళ్ళులేరు. ఆయన సేవా దీక్షకు చలించకుండా వున్నవాళ్ళు లేరు. షాన్సీ, చహార్, హోపే సరిహద్దు మండలంలో ఆయన చేతిమీదుగా చికిత్సపొందినటువంటి, ఆయన ఎలా పనిచేశాడో స్వయంగాచూసినటువంటి సైనికుల్లో, పౌరుల్లో ఒక్కరైనా చలించకుండా వున్నవాళ్ళు మచ్చుకైనా కనిపించరు. కామ్రేడ్ బెథూన్ నుండి ప్రతి కమ్యూనిస్టూ యీ నిజమైన కమ్యూనిస్టు చైతన్యాన్ని అలవరచుకోవాలి.

కామ్రేడ్ బెథూన్ ఒక డాక్టర్. చికిత్స చేయటం ఆయన వృత్తి. ఆయన తన నైపుణ్యాన్ని అనుక్షణం మెరుగుపరుచుకున్నాడు. 8వ రూట్ సేనకు సంబంధించిన వైద్యసేవా విభాగంలో అది అద్వితీయమై నిలిచింది. తాము చేసే పనికి యేదో కొంత భిన్నంగా వుండే మరేపని కనిపించినా అందులోకి మరుక్షణం ఎగిరి గంతేసే వాళ్ళకు, సాంకేతిక కృషి నిరుపయోగమైందిగా పరిగణిస్తూ అందులో మున్ముందు పైకివచ్చే అవకాశాలులేవని భావించేవాళ్లకు ఆయన ఆదర్శం అద్భుతంగా మార్గదర్శకం.

కామ్రేడ్ బెథూన్, నేను ఒకసారే కలుసుకున్నాం. తర్వాత ఆయన నాకు చాలా ఉత్తరాలు రాశాడు. నాకు తీరుబడిలేక ఆయనకు ఒక్కసారి మాత్రమే జవాబిచ్చాను. అదికూడా ఆయనకు చేరిందో లేదో నాకైతే తెలీదు.

ఆయన మరణం నాకు ప్రగాఢమైన దుఃఖం కలిగిస్తోంది. ఇప్పుడు ఆయనని మనం స్మరించుకుంటున్నామంటే, ఆయన సేవా దీక్ష ప్రతొక్కర్నీ ఎంత గాఢంగా ఉత్తేజితం చేస్తూందో మనకు గోచరిస్తుంది. ఆయన నుండి మనమంతా ఆ సంపూర్ణ నిస్వార్థ సేవా చైతన్యాన్ని అలవర్చుకోవాలి. ఈ చైతన్యంతో ప్రతిఒక్కరూ ప్రజలకు ప్రయోజనకరమైన మనిషి కాగలరు. ఒక మనిషియొక్క సామర్థ్యం అల్పమైంది కావచ్చు, అనల్పమైందికావచ్చు. కానీ అతనికీ చైతన్యం వున్నట్లయితే, అతను ఉదాత్తమైన మనస్సుతో, స్వచ్ఛంగా, నైతిక ధృతితోకూడి, తుచ్ఛప్రయోజనాలకు అతీతంగా ప్రజలకు ప్రయోజనకారివైన వ్యక్తిగా ఎదిగినట్లే.

(‘రక్తాశ్రువులు’ నుండి)

"యుద్ధంలో ఆయుధాలు కావు
మనుషులే నిర్ణాయక శక్తులు" — మావో

వైద్యులారా! స్వార్థం విడనాడి ప్రజాసేవ చేయండి

సాంఘిక వ్యవస్థలో వైద్యం ఒక భాగం. ప్రతి సాంఘిక వ్యవస్థకూ ఒక ఆర్థిక ప్రాతిపదిక వుంటుంది. కెనడాలో ఆ ఆర్థిక ప్రాతిపదిక పెట్టుబడిదారీ విధానం. వ్యక్తిగత తత్వం. వ్యాపారపోటీ. ప్రైవేటు లాభార్జన. అనేవాటిమీద యీ పెట్టుబడిదారీ విధానం బ్రతికి బట్ట కట్టింది. ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ యీనాడు ఒక ఆర్థిక సంక్షోభ దశలోపడి కొట్టుకుంటూంది. ఈ భయంకర వ్యాధికి ఒక క్రమబద్ధమైన చికిత్స జరపాలి. ఇదేదో తాత్కాలిక రుగ్మత అనుకొని దీనికి మామూలు చికిత్స చేయటానికి ఎవరైనా పూనుకున్నట్లయితే వాళ్ళు తమ ప్రయత్నంలో విఫలంకాక మానరు.

" చిక్కినమేరకు చేజిక్కించుకో " అనే సూత్రంమీద నడిచే పెట్టుబడిదారీ వ్యవస్థలో వైద్యం. ప్రైవేటు లాభార్జన ప్రాతిపదికమీద గుత్తపరిశ్రమలాగా నడుస్తూంది. మిగతా పెట్టుబడిదారీ ప్రపంచం యే సంక్షోభానికి గురైందో. ఆ గతే వైద్య వృత్తికి పట్టడం అనివార్యం. దేశంలోని జనాభా అవసరాలకి మించిన ఆహారోత్పత్తి జరిగే దేశంలో వేలాది ప్రజలు ఆకలితో మలమల మాడిపోతున్నట్లే. మిల్లు యజమానులు తాము అమ్మగలిగిన దానికంటే అనేక రెట్లు వస్త్రోత్పత్తి చేస్తున్నా వేలాది ప్రజలు చాలీచాలని గుడ్డల్లో ముడుచుకు పోతున్నట్లే. వైద్య సదుపాయాలున్నా వాటికి డబ్బుపెట్టలేక లక్షలమంది జనం రోగం, బాధతో మూలుగుతున్నారు. వేనవేల మంది అకాలమరణం పొందుతున్నారు. "రోగార్త దేశంలో శాస్త్రీయ సంపన్నతమధ్య ఆరోగ్య దారిద్ర్యం" అని దీన్ని అభివర్ణించవచ్చు. ప్రపంచ ఆర్థిక సమస్యలో వైద్య సంబంధమైన ఆర్థిక లెఖ్ఖల సమస్య దాన్నుంచి విడదీయరాని ఒక అవిభాజ్య భాగమే. మనం ప్రాక్టీసు చేస్తున్న వైద్యం ఒక విలాస వ్యాపారం. రత్నాల వెలగట్టి రొట్టె విక్రయిస్తున్నాం మనం. మన జనాభాలో సగం మంది పేద ప్రజలు. వాళ్ళు డబ్బు చెల్లించుకోలేరు గనక పొట్టకట్టుకుంటారు. ప్రజలకి ఆరోగ్యరక్షణలేదు మనకు ఆర్థిక రక్షణలేదు. ఇక్కడ యీ సమస్యయొక్క రెండు వేపులూ మనకు ప్రత్యక్షమౌతాయి.

ఆరోగ్య రక్షణ కల్పించడానికి అత్యుత్తమ మార్గం అనారోగ్యాన్ని సృష్టించే ఆర్థిక వ్యవస్థను మార్చటం. అజ్ఞానాన్ని. దారిద్ర్యాన్ని. నిరుద్యోగాన్ని నిర్మూలించ టానికి యీ ఆర్థిక వ్యవస్థని మార్చాలి ప్రతివ్యక్తి తన వైద్య సౌకర్యాలని తానే కొనుక్కునే యీ పద్ధతి నడవదు. ఈ పద్ధతి అన్యాయం, అసమర్థవంతం, నిరర్థకం. దీనికి కాలదోషం పట్టింది, ఈ పద్ధతి ఎప్పుడో వంద సంవత్సరాల కిందటి 19వ శతాబ్ది

ప్రారంభకాలంలోనే పారిశ్రామిక విప్లవాగమనం నాడు చచ్చిపోయివుండాల్సింది. ఈ ఆధునిక పారిశ్రామిక సమాజంలో ప్రైవేటు ఆరోగ్యం అంటూ యేమీలేదు. ఆరోగ్యం అంతా సార్వత్రికం. ప్రజల్లో ఒకభాగంలో అనారోగ్యం యితర ప్రజానీకాన్నంతటినీ దెబ్బకొడుతుంది. కాబట్టి, ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించటం అనేది ప్రభుత్వం యొక్క ప్రాథమిక విధిగా, తన పౌరులపట్ల పాటించవలసిన ధర్మంగా గుర్తించాల్సిఉంది.

వైద్యవృత్తిలో సొంతలాభార్జనను తుదముట్టించివేసి మన వృత్తిని పచ్చిదోపిడీదారి వ్యక్తిగత తత్వంనుంచి తప్పించి పునీతం చేదాం. మన తోటి మానవుల దుఃఖాల్ని దౌర్భాగ్యాన్ని కొల్లగొట్టి మనం మేడలు కట్టుకునే పద్ధతిని అపఖ్యాతిపాలు చేద్దాం.

మన యేకాకితనాన్ని విడనాడుకుని వర్తమాన ఆర్థిక సంక్షోభవాస్తవాల్ని ఆకళింపు చేసుకుందాం. మన కళ్ళముందు ప్రపంచం మారిపోతోంది- మన దృష్టికి గోచరించే పాత ప్రదేశాల్ని, పాత దృశ్యాల్ని ప్రూడ్చివేస్తూ, ఊడ్చివేస్తూ ఒక ప్రపంచపు పెనుపొంగు మహా ఉరవడితో విజృంభిస్తూంది. దాంతోపాటు మనమూపోవాలి. లేకపోతే మనం చితికి ముక్కలైపోతాం.

[ప్రజారోగ్య రక్షణకు సంబంధించి మాంట్రియల్ వైద్య శిబిరంలో జరిగిన ఒక చర్చా గోష్ఠిలో డాక్టర్ బెతూన్ ఉపన్యాసం.]

('రక్తాశ్రువులు' నుండి)

గదర్ పార్టీ ప్రకటన

(1914 ఆగస్టు 18న శాన్‌ఫ్రాన్సిస్కోలో గదర్ పార్టీ దిగువ ప్రకటన చేసింది.)

కావాలి

హిందూదేశానికి వెళ్ళి విప్లవంకోసం పనిచేసే వీరసైనికులు

జీతము : మృత్యువు
బహుమానము : బలిదానము
పెన్షన్ : స్వాతంత్ర్యము
సేవారంగము : హిందూస్థాన్

జనచైనాలో ప్రజా వైద్యులు :

నార్మన్ బెతూన్ నిజమైన వారసులు....

అది పెకింగు నగరం. రాత్రి 11 గంటల సమయం. నగర ఇనుము, ఉక్కు కంపెనీలో పని జోరుగా జరిగిపోతోంది. ఇంతలో కెంగు-హూ-పావో అనే కార్మికునికి కడుపులో తీవ్రమైన నొప్పి వచ్చింది మనిషి బాధతో మెలికలుతిరిగిపోతున్నాడు. సరిగ్గా నిలబడలేకపోతున్నాడు కెంగు తోటి కార్మికులంతా ఆదుర్దాతో అతని చుట్టూ మూగారు. హాస్పిటలుకు చేర్చాలని అనుకొంటున్నారు. ఇంతలో ఆ ఫ్యాక్టరీలోనే పనిచేసే యు-టుంగు-చే అనే కార్మికుడు రొప్పుకొంటూ రోజుకుంటూ వచ్చాడు. కెంగును విశ్రాంతి గృహంలో పడుకోబెట్టి. నెమ్మదిగా పొట్టనుతడిమి పరిశీలించాడు. "24 గంటల కడుపునొప్పి" (appendicitis) లాంటి ప్రమాదకరమైన వ్యాధి కాదని మామూలు కడుపు నొప్పేనని నిర్ణయానికివచ్చి, భుజానికివున్న మందుల సంచి నుండి కొన్ని టాబ్లెట్లు తీసి ఇచ్చాడు. వెంటనే రెండు మందుబిళ్లలు వేసుకోమని, అరగంట తర్వాత మరోటి వేసుకోమని కెంగుకుచెప్పి, పొట్టనిండా వేడినీళ్లుతాగి కొంచెంసేపు కదలకుండా పడుకోమని సలహా యిచ్చాడు. రోగిపక్కనే తానుకూడ సేవచేస్తూ కూర్చున్నాడు. ఒక గంట తర్వాత కెంగు కళ్లు తెరచాడు. కడుపునొప్పి సద్దుకుపోయి, కులాసాగానే లేచి నుంచున్నాడు.

అది బొగ్గుగని. బొగ్గు తవ్వుతూవుండగా వాంగ్-చింగ్-చువాన్ అనే వయసు మళ్ళిన కార్మికుడు ఆకస్మాత్తుగా ఉదరకోశవ్యాధితో బాధపడుతూ, పనిచేయలేక, దగ్గరలోఉన్న బల్లపై కూలబడ్డాడు. కడుపులో తీవ్రమైన బాధ. నీరుతాగినా, ఏమైనా తిన్నా కడుపు తిప్పివేస్తోంది. ఇది తెలియంగానే అదే గనిలో పనిచేస్తున్న లీ-చాంగ్ అనే మెకానిక్కు పరిగెత్తుకొంటూ వచ్చాడు. రోగిని విశ్రాంతి ప్రదేశంలో పడుకోబెట్టి, జబ్బును పరిశీలించి, *'ఆక్యుపంక్చరు' పద్ధతిననుసరించి రోగి శరీరంపై 5 కేంద్రాలలో సూదులు గుచ్చాడు. కాసేపటికి వాంగ్ వ్యాధి కుదటబడింది. తర్వాత క్రమంగా కోలుకొన్నాడు.

అది టిబెట్టు ప్రాంతం. యాంగ్సీనది పుట్టిన పర్వతశ్రేణులతో నిండిన యీ ప్రాంతంలో ఎక్కువగా గొర్రెల కాపరులు నివసిస్తూవుంటారు. ఒకసారి సామో అనే గొర్రెలకాపరి భార్య రెండు వారాలవరకు జ్వరంతో మూలుగుతూ పడుకొంది. దాదాపు ఈ రెండు వారాలు రీనో అనే పాతికేళ్ళయువతి రోగికి సపర్యలుచేస్తూవుండేది. రోజూ వచ్చి చూసి వెళ్తూండేది. కావాల్సిన మందులన్నీ ఇచ్చేది. సామో గొఱ్ఱెలపాలుపితికేది. పొయ్యిలోకివాడే పిడకలనుచేసి ఎండబెట్టేది.

అలాగే మరోసారి చలికాలంలో జూచీ అనే మరో గొర్రెలకాపరి భార్యకు జబ్బు చేసింది. ఆమె తన యిద్దరు చిన్నపిల్లలను తీసుకొని రీసో దగ్గరకు మందుల కోసం వచ్చింది. రీసో ఆమెకు సపర్యలుచేస్తూనే, మందులు యిస్తూనే ఆ పిల్లలనిద్దరిని తన యింటిలో వుంచుకొని సాకింది. ఆ పిల్లలకున్న పలుచటి దుస్తులను తీసివేసి, చలికి తట్టుకొనే మంచి బట్టలను వారికిచ్చింది.

1972 ఏప్రిల్‌లో ఒకసారి రీసో కొడుకు, రీసో యిద్దరూ జబ్బుపడ్డారు అదే సమయంలో బీడింగు అనే గొర్రెల కాపరి, అతని భార్య, జబ్బుపడిన తమ కొడుకును రీసోవద్దకు తీసుకువచ్చారు ఆ పిల్లవాడు న్యుమోనియా, విరోచనాలతో బాధ పడుతున్నాడని గ్రహించింది రీసో. తనదగ్గర మాత్రం కొద్దిగానే మందు వుంది కాని ఆ మందు తన కొడుక్కు అవసరం. మరోవైపు బాధపడుతున్న బీడింగు కుమారునికి కూడ అదే మందు కావాలి. సంకోచించకుండా ఆ మందుతో బీడింగు కుమారునికి ఇంజక్షను ఇచ్చింది వారు వెళ్ళిపోయిన కాసేపటికి మరల ఆలోచించింది—"ఆబీడింగు దంపతులకు ఒక్కడే కుమారుడు. అతనికేమైనా అయిందంటే, వారెంతబాధపడతారు? ఇటువంటి సమయంలో రోగి దగ్గరలేకుండా నేనెలా పడుకోగల్గాను?" ఈ ఆలోచన రాగానే వెంటనేలేచి తన మందుల సంచి భుజానికి తగిలించుకొని, తన కొడుకువంక ఒకసారి చూసి, బీడింగు యింటికి పరుగెత్తింది. జబ్బుతోవున్నప్పటికీ తన యింటికి అకస్మాత్తుగా వచ్చిన రీసోను చూసి వాళ్ళు ఆశ్చర్యపోయారు "నీవు, నీ కొడుకు ఇద్దరూ జబ్బుతో వుండికూడ, నీవు ఇప్పుడు ఎందుకువచ్చినట్లు? అవసరమైతే మేము వస్తాముగా"అని అనేకవిధాల నచ్చచెప్పితేగాని చివరకు రీసో తన కొడుకుదగ్గరకు తిరిగి వెళ్ళలేదు.

ప్రజల ప్రాణాలకోసం వారి ఆరోగ్యం భద్రతకోసం చూపబడే ఈ త్యాగశీలత, ఆతురత, నిస్వార్థత నేడు చైనాలో ఏమూలచూసినా కనపడుతూనే వుంటాయి. ఇవి అన్నీ చైనాలోని ప్రజావైద్యుల (వట్టికాళ్ళవైద్యుల) ప్రజాసేవకు నిదర్శనాలే.

సాంస్కృతిక మహావిప్లవానికి ముందురోజుల్లో, లీ-షా-చీ రివిజనిస్టు పంథా మూలంగా వైద్యసదుపాయాలన్నీ నగరాలకే పరిమితంచేశారు. పరిశోధన అంటే ఎవరో కొద్దిమంది మేధావులు అరుదుగా వచ్చేటటువంటి లేక పైవర్గాలవారికి వచ్చే జబ్బులకు (గుండెజబ్బులు, గుండెమార్పిడి మొ॥) ఒకటో, అరో కొత్త చికిత్సలు కనిపెట్టడమే నన్న తప్పుడు భావనలు అమలులోపెట్టారు. అందువలన సాధారణ రోగాలు, మాన్పటానికి పరిశోధనా ఫలితాలు ఉపయోగపడకుండా పోయినాయి. సాంప్రదాయవైద్యరీతుల ఉపయోగానికి ఏవేవో కుంటిసాకులుచూపి అడ్డుపడ్డారు. పర్యవసానంగా చాలకాలం పల్లె ప్రాంతాల్లో వైద్యులు లేరు. మందులు లేవు. ఈవిధంగా ప్రజారోగ్య మంత్రిత్వశాఖ

'నగరవాసుల-ఉన్నతవర్గాల ఆరోగ్యశాఖగా' మారిందని ఛైర్మన్ మావో నిశితంగా విమర్శించారు. గ్రామీణప్రాంతాలపై దృష్టి కేంద్రీకరించమని, ప్రజాపంథాను అమలు పరచి అశేష సామాన్య ప్రజానీకానికి సేవచేయమని పిలుపిచ్చారు.

ఛైర్మన్ మావో పిలుపునందుకొని, గత రెండుమూడేళ్ళలోనే లక్షల మంది నగర వైద్యులు, వైద్య విద్యార్థులు, ప్రజాసేవ చేయటానికి, వారితోకలిసి పనిచేయటానికి పల్లెప్రాంతాలకు తరలి వెళ్ళారు. 1968 తర్వాత 7 లక్షల మంది వైద్యులుగల సంచారదళాలు పల్లెప్రాంతాలు దర్శించాయి. సుమారు 10 లక్షలమంది 'ప్రజావైద్యుల్ని' (బేర్‌ఫూట్ డాక్టర్స్) తర్ఫీదు చేశారు. ఈ వైద్యులు అటు పొలాల్లో, ఫ్యాక్టరీలలో పనిచేసేవారే. ఇటు వైద్యంలో ప్రాథమిక శిక్షణ పొందుతుంటారు. వీరంతా కమ్యూనుపొలాల్లో పనిచేసేవారే వీరు కాళ్ళకు జోళ్ళులేకుండా పనిచేసేవారు. వైద్యులుగా తర్ఫీదు పొందినపుడు ఈ 'ప్రజావైద్యులకు' 'వట్టికాళ్ళవైద్యులు'(Barefoot doctors) అనే మాట పుట్టింది. గ్రామీణప్రాంతాల్లో ఈ ప్రజావైద్యులను 'వట్టికాళ్ళవైద్యుల'ని, పట్టణాల్లో 'రెడ్‌గార్డు వైద్యులని' అంటూ వుంటారు. సామాన్యంగా రైతులు, గృహిణులు, ఫ్యాక్టరీ కార్మికులు ఈ ప్రజావైద్యులుగా వుంటారు. వీరిని ఆయాప్రాంత పార్టీ కమిటీలు నిర్ణయించి వైద్యశిక్షణకు సిఫారసుచేస్తారు. తమ శిక్షణ పూర్తికాగానే ఈ ప్రజావైద్యులు మరల తమ తమ ప్రాంతాలకు తిరిగి వచ్చి తమ పని చేసుకొంటూనే, ప్రజలకు వైద్యంచేస్తూ వుంటారు.

ఈ ప్రజావైద్యులు దేశమంతటా ప్రతి షాపులోనూ, ఉత్పత్తి జరిగే ప్రతిచోటా, గనుల్లోనూ, కమ్యూన్లలోనూ అంతటా మనకు తారసిల్లుతారు. వీరందరికి వైద్యశిక్షణలో చిన్నకోర్సు నేర్పుతారు. వీరు తమ తోటి రైతులతోనూ, కార్మికులతోనూ సన్నిహితంగావుంటూ వారి ఆరోగ్యంగురించి శ్రద్ధతీసుకోవాలి. వారికి అప్పగించబడిన ప్రతి ఒక్కని రోగనిరోధకశక్తి గురించి రికార్డులు వుంచాలి. తన పర్యవేక్షణలోవున్న ప్రతి స్త్రీ వుపయోగించే గర్భనిరోధక పద్ధతుల మంచిచెడులగురించి తెలుసుకొంటూవుండాలి. రోగుల పరిస్థితి తీవ్రమైతే వెంటనే సరియైన డాక్టరు దగ్గరకు పంపించాలి. ఇవి సాధారణంగా వీరు చూసే పనులు. వీరు తలనొప్పి, జలుబు, కడుపునొప్పి మొదలగు సాధారణ రోగాలకు మందులిస్తారు. చిన్న చిన్న గాయాలకు వెంటనే కట్లు కడతారు. చలికాలంలోనూ, వసంతంలోనూ 'ఫ్లూ'లాంటి అంటువ్యాధులు ప్రబలుతున్నపుడు 'ఆరోగ్య శాఖ' వారికి రోగనిరోధకమందులు పంచటంలో సహాయం చేస్తారు. జబ్బుల నివారణ కోసం (Prevention) మందులు తీసుకోడం గురించి కరపత్రాలద్వారా, షాపు మీటింగులద్వారా బాగా ప్రచారంలో పెడతారు. శుభ్రతగురించి కార్యక్రమాలు ప్రజావుద్యమాలుగా చేబడతారు,

గ్రామీణ ప్రాంతాల్లోని యీ ప్రజావైద్యుల ఆదర్శంగా తీసుకొని ఫ్యాక్టరీలలో "రెడ్‌గార్డ్ వైద్యులు" ప్రత్యక్షమయ్యారు. ఇందువలన చైనాలో ఆరోగ్య వైద్యరంగంలో ప్రజలకు సేవ చేయటానికి ముందుకు వచ్చిన యువతరాన్ని సమీకరించటానికి; ప్రజలకింకా బాగా సేవచేయటానికి, నివారణ పద్ధతుల మందుల వాడకాన్ని బాగా పెంచటానికి, ఆరోగ్య వైద్యశాస్త్రాలలో విజ్ఞానం పెంపొందించుకోటానికి వీలుపడింది. ఆయా ప్రాంతాలలోని ఫ్యాక్టరీలు, కమ్యూన్లు నిర్ణయించిన సభ్యులకు రెండువారాలు మొదలుకొని 3 నెలలవరకు శిక్షణ యిస్తారు. ఈ కాలంలో వారు ఆ కంపెనీ లేక కమ్యూన్ ఆస్పత్రిలలోని డాక్టర్లవద్ద మామూలు రోగాలను ఎలా నిర్ణయించాలి? గాయాలకు ఎలా కట్టుకట్టాలి? ఇంజెక్షను ఎలా ఇవ్వాలి? ప్రథమ చికిత్స, ఆక్యుపంక్చర్ మొదలైనవాటిగురించి వివరంగా నేర్చుకొంటారు. ఇంకా ఎక్కువ రోజులు శిక్షణ పొందే వాళ్ళు ఇవికాక కొంతవరకు శరీరనిర్మాణశాస్త్రం (anotqmy), శరీర(అంతర్)ధర్మశాస్త్రం (Phisiology) ఔషధ నిర్మాణశాస్త్రం (Pharmacology) కూడా చదువుతారు. వారి చదువులతర్వాత ఒక నెలపాటు హాస్పిటల్‌లో తర్ఫీదుకొరకు పంపబడతారు. వీరు తమ ఫ్యాక్టరీలలో, కమ్యూన్లలో పనులు చేసేటప్పుడేకాక ఇంటివద్దకూడ తమ చుట్టుపక్కల ప్రాంతాలలోకూడ వైద్యం చేస్తారు. వీరిలో ప్రతివారికి 'ఆక్యుపంక్చరు'లో ఉపయోగించే సూదులపెట్టె వుంటుంది. వీరు శిక్షణకేంద్రాల్లో నేర్చుకొన్నదేకాకుండా, ఆచరణ నుండి, అనుభవం నుండి కూడ నేర్చుకొంటారు. తమ తమ ప్రాంతాల్లో కుటుంబ నియంత్రణ గురించి, గర్భనిరోధక పద్ధతుల గురించి, శాస్త్రీయ విధానాలు ఓపికతో వివరిస్తారు.

నివారణ (Prevention)కు ప్రాధాన్యత నివ్వండని చైర్మన్ మావో యిచ్చిన పిలుపునందుకొని ఈ ప్రజావైద్యుల గత వసంతంలో ఒక ఫ్యాక్టరీలోని 2000 మంది కార్మికులకు ఫ్లూ నివారణ టీకాలను యివ్వాలని నిశ్చయించి 3 రోజుల్లో పూర్తి చేశారు. కేన్సరు, గుండెజబ్బు మొదలగు వ్యాధులురాకుండా వుండటానికి ప్రజల నిరోధకశక్తిని పెంచడంలో జాతీయ ఆరోగ్య వైద్య మంత్రిత్వశాఖకు సాయంచేశారు. అత్యధిక ఉష్ణోగ్రతలో పనిచేసే కార్మికులు, వంటగాళ్ళు మొదలగువారి రక్తపునమూనాలు సేకరించి కేన్సరులాంటి జబ్బుల నివారణకై వైద్యశాఖకు పంపారు. ఫ్యాక్టరీలోని ప్రతి వ్యక్తి ఆరోగ్యంగురించి శ్రద్ధతీసుకొంటూ రోగులగురించి వారం వారం ఫ్యాక్టరీకార్మికుల పరీక్ష చేయటానికివచ్చే వైద్యుల బృందానికి రిపోర్టు ఇస్తారు. ఫ్యాక్టరీలలోగాని, కమ్యూన్లలోగాని అంటువ్యాధులు ప్రబలితే మొదటి సమాచారం అందేదివీరికే. అంటువ్యాధుల నివారణలో, కుటుంబనియంత్రణ అమలులో శుభ్రత గురించి జరిగే ఉద్యమాలలో వీరే ప్రధానపాత్ర వహిస్తారు. నేటి చైనా వైద్య ఆరోగ్యశాఖకు మూలస్తంభాలు ఈ 'ప్రజావైద్యు'లే.

ఈ ప్రజావైద్యులకు ఆయా ప్రాంత పార్టీ కమిటీద్వారా రాజకీయంగానూ, వ్యక్తి రీత్యానూ శిక్షణ ఇవ్వబడుతుంది. నెలకొకపూట హాస్పిటళ్ళలోని డాక్టర్లు వీరికి బోధనా తరగతులు తీసుకొంటారు. అంతేగాక "ప్రజలకు సేవచేయండి"; "నార్మన్ బెతూన్ జ్ఞాపకార్థం"; "విధినిర్వహణలో పైకొచ్చే రివిజనిస్టు పద్ధతులకు వ్యతిరేకంగాపోరాటం" మొదలగు వ్యాసాలను చదివి ఎప్పటికప్పుడు తమ చైతన్యాన్ని, త్యాగశీలతను ప్రజా సేవాతత్పరతను, నిస్వార్థతను పెంపొందించుకొంటారు.

మిగిలిన కార్మికులవలె ఈప్రజావైద్యులుకూడ లిన్‌పియావో, కన్ఫ్యూషియస్‌ను విమర్శించటంలో తమ పాత్రనిర్వహించారు. లిన్‌పియావో ప్రచారంలోపెట్టిన "తనను తాను నిగ్రహించుకొని ఆచార వ్యవహారాలను కాపాడాలి" (Self Restraint and return to rites) అనే నినాదం శ్రామికవర్గ నియంతృత్వాన్ని కూలద్రోసి, పెట్టుబడి దారీ విధానం పునరుద్ధరించటానికీ, శ్రామిక ప్రజలను మరల చీకటిలోకి, దోపిడీ, అణచివేత, మారణహోమాల్లోకి తోయటానికీ చేసిన ప్రయత్నమని తీవ్రంగా వ్యతిరేకించారు. చీ-పెంగ్-మింగ్ అనే 48 ఏళ్ళ ఫ్యాక్టరీ కార్మికుడు తన జీవితానుభవాల్ని మిగిలినవారికి చెపుతూ— "జపాను సామ్రాజ్యవాదులచేతుల్లో ఈ ఫ్యాక్టరీ వున్నరోజుల్లో చేయితెగి తన తోటి కార్మికుడు మందు మాకుల్లేక చనిపోవటం కళ్ళారాచూశాను. ఈ కంపెనీకున్న చిన్న ఆస్పత్రిలో ఆ రోజుల్లో అధికారులకు, ఫోర్‌మన్‌లకే మందులు దొరికేవి. కాని కార్మికులగోడు వినేవాడే లేడు. చిన్న గాయానికి కట్టుకట్టేవాళ్ళుకూడా కాదు. కాని నేడు మన కంపెనీకి ఒక పెద్ద హాస్పిటలు, ఆరోగ్యకేంద్రం వుండటమే కాక అనేక మంది తోటిసోదరులు 'ప్రజావైద్యులుగా' శిక్షణపొందారు. పాతవ్యవస్థకు నేటి మన జీవితానికి ఎంత తేడా! "తనను తాను నిగ్రహించుకొని, ఆచారధర్మాలను పునరుద్ధరించా"లంటే అర్థం ప్రజలను మళ్ళీ ఆ దోపిడీ కౌగిళ్ళలోకి నెట్టడమే. మేము దీన్ని అంగీకరించం—"

లిన్ పియావో, కన్ఫ్యూషియస్‌ల అభివృద్ధి నిరోధక భావాలను వ్యతిరేకించి— "స్వార్థాన్ని విడనాడండి. ప్రజలకొరకై అంకితంకండి" అనే బెతూన్ ఆశయాన్ని స్వంతంచేసుకొని ఈ ప్రజావైద్యులు అవిరామంగా, నిజాయితీగా, ప్రజాసేవలోమునిగి పోయారు. అధ్యయనం. ఆచరణనుండి తమ వైద్యనిపుణతను అభివృద్ధిచేసుకొంటూ వైద్యరంగంలో విప్లవపంథాను ముందుకు తీసుకుపోటానికి అంకితమయ్యారు. మశూచి, ప్లేగు, కలరా మొదలైన వ్యాధులపట్ల ప్రత్యేకశ్రద్ధ వహించి చాలవరకు వాటిని అరికట్టారు, ఫ్లూ జ్వరం, మలేరియా, నులిపురుగులు, బోదకాళ్లవగైరా హెచ్చుగావున్న ప్రాంతాల్లో ప్రత్యేక పథకాలద్వారా వాటిని అదుపులోపెట్టారు. అంటువ్యాధులువ్యాపింప జేసే కీటకాలకు వ్యతిరేకంగా శుభ్రతకు గొప్ప ప్రాముఖ్యతనిచ్చి, ప్రజాఉద్యమాలు నడిపారు. సుఖరోగాలను పూర్తిగా నివారించారు. వ్యభిచారాన్ని తొలగించివేశారు.

ప్రజాసేవకై చైనా ప్రజలు ఎంత ఆతురతతోవున్నారో, వైద్యశిక్షణలో వచ్చే కష్టాలను ఎలా తట్టుకొంటున్నారో, నార్మన్ బెతూన్‌కు నిజమైన వారసులుగా తయారవటానికి వారెంత కుతూహలంతో వున్నారో ఈ క్రింది సంఘటనే తెలుపుతుంది.

టిబెట్ ప్రాంతంలో హూ-చాన్ అనే గృహిణి "ప్రజావైద్యురాలి"గా శిక్షణ పొందాలని నిర్ణయించబడింది. అది తెలియగానే కొందరు- "నీలాంటి వాళ్ల వైద్యులవ్వట మేమిటని" ఎగతాళిపట్టించారు. కాని పైమాటలు హాస్యానికి అన్నా, వారిలో స్త్రీలంటే తక్కువభావనే వుంది. వారి మనస్సులో స్త్రీలు యింటిపనులు చూసుకోటానికి, పిల్లలను పోషించటానికి, పాడిపశువులను, కోళ్ళను పెంచటానికి వుపయోగపడతారుగాని జబ్బులెట్లా నయంచేస్తారని అనుమానం పట్టుకొంది. కాని హూ-చాన్ వారిమాటను పట్టించుకోకుండా వైద్యురాలిగా చేరింది. మొదట్లో తన అధ్యయనంలో చాల కష్టాలు ఎదుర్కోవలసి వచ్చింది. కొద్దిగా చదువుకొన్న తనకు వైద్యశాస్త్ర పదాలు, ఆక్యుపంక్చర్ స్థానాలు గుర్తుంచుకోవటం చాల కష్టమైంది. అదీకాక ఆమె గ్రూపు నాయకురాలు అవటంవలన యింకా అనేక బాధ్యతలుండేవి. ప్రజలకు సేవచేయాలనే ఆకాంక్షతో, బెతూన్ ఆదర్శంతో యీ కష్టాలన్నీ ఓర్పుతో గట్టెక్కింది. రాత్రిపూట పడుకొనేటప్పుడుకూడ తన స్వంత శరీరంపై ఆక్యుపంక్చరు స్థానాలను గుర్తుచేసుకొనేది. తీరికవున్న ప్రతి క్షణాన్నీ వైద్యసాహిత్యం చదువుకోటానికి ఉపయోగించింది. ఫలితంగా కొద్దినెలల్లోనే అద్భుతమైన అభివృద్ధిని సాధించింది.

శిక్షణ కేంద్రంనుండి బయటకు వచ్చినప్పటినుండి తన తోటి కార్మికులకేకాక ఇంటి చుట్టుపక్కలవారికి, పక్కగ్రామాలకు వెళ్ళి వచ్చేది. తనకు చిన్నపిల్లలున్నప్పటికీ, ఇంటిపనులున్నప్పటికీ ఎవరైనా పిలువగానే (తాను నిద్రపోయిన తర్వాత ఎంత రాత్రప్పుడయినా) రోగిని చూడటానికే వెళ్ళిపోయేది. ఇంత నిస్వార్థతతో, దీక్షతో ప్రజాసేవకు అంకితమైనారు కనుకనే ప్రజలకు వారిపై అచంచల విశ్వాసం. అందుకే ఈ 'ప్రజావైద్యులను'- తమ 'ప్రాణంతో సమానులని' అభినందించుతారు ప్రజలు.

---

* ఆక్యుపంక్చర్ అంటే శరీరంలో వివిధనాడీ కేంద్రాలలో సన్నని సూదులు గుచ్చి వ్యాధి నయంచేసే ఒక చికిత్సావిధానం.

('చైనా రికన్స్‌ట్రక్ట్స్' ఆధారంగా)

"స్వార్థాన్ని ఓడించి రివిజనిజాన్ని విమర్శించడమే శ్రామిక జన సాంస్కృతిక మహావిప్లవంయొక్క ప్రధాన సైద్ధాంతిక కార్యక్రమం"

వ్యక్తిగత ఆస్తి — కమ్యూనిజం

[కమ్యూనిస్టు ప్రణాళిక నుండి]

జగత్తునంతటినీ సంస్కరించ దలచిన యే మహానుభావుడో సృష్టించో, ఆవిష్కరించో యిచ్చిన భావాలమీదనో, సూత్రాలమీదనో ఆధారపడవు కమ్యూనిస్టుల సిద్ధాంత నిర్ణయాలు.

ఈ నిర్ణయాలు చేసే పని యేమంటే: ప్రస్తుత వర్గపోరాటంనుండి- సాక్షాత్తుగా మనకండ్లముందు జరుగుతున్న ఒక చారిత్రిక పరిణామంనుండి- ఉత్పన్న మౌతున్న వాస్తవ సంబంధాలను స్థూలంగా వ్యక్తపరచడం మాత్రమే. అమల్లోవున్న ఆస్తి సంబంధాలను రద్దుచేయడమనేది కమ్యూనిజం యొక్క ప్రత్యేక లక్షణమేమీకాదు.

చారిత్రిక పరిస్థితులలో వచ్చిన మార్పుల ఫలితంగా, గతంలోకూడ, ఆస్తి సంబంధాలన్నీ నిరంతరం మారుతూనే వచ్చినాయి.

ఉదాహరణకు ఫ్రెంచి విప్లవం ఫ్యూడల్ ఆస్తిని రద్దుచేసి, బూర్జువా ఆస్తిని నిలబెట్టింది.

కమ్యూనిజం యొక్క ప్రత్యేక లక్షణం యే ఆస్తినయినా రద్దు పరచడంకాదు, బూర్జువా ఆస్తిని రద్దుపరచడం కానీ. వర్గవైరుధ్యాలమీద, అధిక సంఖ్యాకులను అల్ప సంఖ్యాకులు చేసే దోపిడిమీద ఆధారపడి వస్తుసంపదను ఉత్పత్తిచేసి సొంత పరుచుకునే వ్యవస్థయొక్క రూపాలలోకెల్ల ఆధునిక బూర్జువా వ్యక్తిగత ఆస్తి అనేది ఆఖరిదీ అత్యంత పరిపూర్ణమైనది.

ఈ అర్థంలో కమ్యూనిస్టుల సిద్ధాంతం ఒక్క వాక్యంలో చెప్పవచ్చు. వ్యక్తిగత ఆస్తిని రద్దుచేయడం.

* * * * *

కమ్యూనిస్టులకు తమ అభిప్రాయాలూ, లక్ష్యాలూ దాచుకోవడమంటే అసహ్యం. సమస్త వర్తమాన సాంఘిక పరిస్థితులను బలవంతంగా కూలదోయడంద్వారానే తమ లక్ష్యాలు సిద్ధించగలవని వాళ్ళు బహిరంగంగానే ప్రకటిస్తారు. కమ్యూనిస్టు విప్లవమంటే పాలకవర్గాలు గజగజవణకనీ. కార్మికులు పోగొట్టుకొనేదేమీలేదు, తమ శృంఖలాలు తప్ప. వాళ్ళు గెలుచుకోవలసింది ఒక ప్రపంచంవుంది.

సకలదేశ కార్మికులారా, ఏకంకండి।

* * * * *

బూర్జువా సమాజంలో గతం వర్తమానాన్ని శాసిస్తుంది. కమ్యూనిస్టు సమాజంలో వర్తమానం గతాన్ని శాసిస్తుంది

* * * * *

బూర్జువా దృష్టికి వర్గసంస్కృతి అదృశ్యం కావడం మొత్తం సంస్కృతి అంతా అదృశ్యం కావడంగా కనిపిస్తుంది.

సంస్కృత పూజ

భారత ప్రభుత్వం తెలివి తేటల్ని అంచనావేయడం చాల కష్టం. అది వేయి రకాల పనిచేస్తుంది. భారతీయ జనసంఘానికి, దానికి ఎలాంటి సంపర్కంలేదని ఎవరైనా అనుకుంటే వాళ్ళు చాల పొరపాటు పడుతున్నారు. చరిత్ర గురించి జన సంఘం చెప్పే రెండు విషయాలను భారత ప్రభుత్వం చాలబాగా అర్థం చేసుకొన్నది. (అంగీకరించిందికూడ) అవి ఏమంటే వ్యవస్థపట్ల విశ్వాసం-హిందూమతవాదం-యూగోస్లావియా పర్యటనకు పోయిన పార్లమెంటరీ బృందానికి యిచ్చిన ఒక విందులో అటల్ బిహారి వాజ్‌పాయ్ ఇందిరాగాంధీని బహుధా ప్రశంసించాడంటే ఆశ్చర్య పడాల్సిన అవసరం లేదు భారత-పాకిస్తాన్ యుద్ధకాలంలోకూడ ఆయన ఈ ప్రశంస గుమ్మరించాడు. ఇద్దరికీ ఈ వ్యవస్థపట్ల విశ్వాసం ఉండటమే అందుకు కారణం. ఇందిరాగాంధీయే దేశంకాదు, ఆమెను ప్రశంసించడానికి. కాలేజీలను బహిష్కరించమని జయప్రకాశ్ యిచ్చిన పిలుపును పునర్విచారించమని జనసంఘం అధ్యక్షుడు అద్వాని అంటున్న దానిలోకూడ యీ వ్యవస్థను కాపాడాలనే ఆదుర్దాఉన్నది. వీళ్ళు తనకు విరోధులు కాదన్న విషయం ఇందిరాగాంధీకి తెలుసు. వీళ్ళకెప్పుడైన కినుక కలిగితే వీళ్ళను బుజ్జగించటం కష్టంకాదని కూడ ఆమెకు బాగాతెలుసు. పాకిస్తాన్, నాగాలాండ్ మిజోరామ్ మున్నగు విషయాల్లో జనసంఘ ప్రభుత్వానికి ఎప్పుడూ సహకారం యిస్తుంది. పాకిస్తాన్ దిష్టి బొమ్మను చూపి జనసంఘాన్ని ఎప్పుడైనా చంక కెత్తుకోవచ్చని ఇందిరాగాంధీకి గట్టిగా తెలుసు. మన సైన్యాలు, సరిహద్దురక్షణదళాలు నాగాలాండ్‌లో చేస్తున్న పైశాచిక చర్యలను ఖండించే నైతికశక్తి మనకులేకపోతే దేశంలో ఇంకే చోట అవి సాగిస్తున్న దమననీతిని ఖండించినా ఆ ఖండనల్లో పసవుండదు. ఇవ్వాల్టి దాకా కాశ్మీర్‌లో "ఎన్నికలు" పేరుతో ఏం జరిగిందో ఏ ఒక్క ప్రతిపక్షమూ ప్రశ్నించ లేదు. ఫలితంగా ప్రభుత్వం దేశమంతటా అలాంటి ఎన్నికలే అమలు పరచింది.

ప్రభుత్వం ఐదవ పంచవర్ష ప్రణాళికలో సంస్కృతంకోసం 5 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టబోతున్నట్లు పత్రికల్లో వచ్చింది. ఇది వృధా ఖర్చు మాత్రమేకాదు- నేరం కూడ. భారత ప్రభుత్వం తన అధికారాన్ని గట్టిపరచజాలని ఏ పనినీ చేపట్టదు. జనసంఘాన్ని సంతోషపెట్టడమే యీ నిర్ణయంవెనుకఉన్న పుద్దేశం. ఆకాశవాణి సంస్కృతంలో వార్తలు చెప్తున్నది జనసంఘం 'ఆర్గనైజర్' దీనికి ఐదు నిమిషాలు చాలవు యింకా ఎక్కువ సమయం కావాలంటున్నారు. భారత ప్రభుత్వానికి యీకాలాన్ని యింకా పెంచడానికికూడ అభ్యంతరం ఉండదు. సంస్కృత అధ్యయనం వేరు, దాని ప్రచారం వేరు. సంస్కృతం ప్రజల భాషకాదు ఇవ్వాళ దాని ప్రచారం అవసరమేలేదు. ప్రజల భాషల ప్రచారం కావాలి. హిందూమతవాదులను, జనసంఘాన్ని సంతోషపెట్టడానికి ప్రభుత్వం యీ పనిని చేపట్టింది. ముస్లింలను మన గుండెల్లో భాగంగా, హరిజనులను మన సోదరులుగా భావించి వాళ్ళతో వివాహ సంబంధాలు, సహభోజనాలు పాటించడంలో భారతీయ సంస్కృతి వికాసమున్నది కాని సంస్కృత ఆరాధనలోకాదు.

[చౌరంగి వార్తా (హింది) 5-12 ఆగస్టు 74]

సమీక్ష :

చైనాపై అరుణతార

"నిద్రపోతున్న ఒక మహాశక్తి చైనా. అది మేల్కొన్ననాడు మొత్తం ప్రపంచాన్ని ఊపి పారేస్తుంద"ని ఏనాడో చెప్పాడు నెపోలియన్. చైనాలో ఎర్రచుక్క పొడిచింది. విప్లవ సూర్యుడు ఉదయిస్తాడు. జనచైనా పుట్టితీరుతుంది అంటూ 1937 లోనే పసికట్టినమేటి ఎడ్గార్ స్నో. ఇది జోస్యంకాదు, ఊహాగానంకాదు. ఎడ్గార్‌స్నో అమెరికా పాత్రికేయుడు చైనా వెళ్లాడు. అక్కడ ఏడు ఏళ్లు ఉన్నాడు. కాళ్ళు బల పాలు కట్టేలా తిరిగాడు. కళ్ళారా చూశాడు. ఎందరితోనో మాట్లాడాడు. ఎన్నో ఇక్కట్లుపడ్డాడు అన్నీ పలవరించాడు, వాటి అన్నిటి ఫలితమే యీ పుస్తకం. ఇందులోవి ఉత్త అక్షరాలుకావు, అవి రక్తాక్షరాలు. ఒట్టిమాటలుకాదు. అవి ఆరనిమంటలు.

మంటలతో మాట్లాడించి రక్తంతో రాగాలాపనచేస్తూ ప్రజలు రక్తాక్షరాలతో ప్రపంచ చరిత్ర రాస్తున్నరోజులవి. నాజీ జర్మనీ, ఫాసిస్టు ఇటలీలు అశ్వరథ అంటూ షోకు చేసుకుంటున్నాయి. రెండవ ప్రపంచయుద్ధానికి పూర్వరంగం తయారవుతున్నది. చుట్టూ పెట్టుబడిదారీ దేశాలు తోడేళ్ళలాగా పొంచి ఉన్నాగాని సోవియట్ రష్యా తువ్వాయిలా చెంగు చెంగున దూకుతోంది, రష్యాలో సోషలిజం స్థిరపడింది. ఒంటరిగా సోషలిస్టురాజ్యస్థాపన సాధ్యమని రుజువయింది, ప్రపంచపీడిత ప్రజలకు సోవియట్ రష్యా ఆశాజ్యోతిగా నిలబడింది. పసిబాలవయసులా పెరుగుతున్న సోవియట్ రష్యా మీదకు నాజీ హిట్లరును "ప్రజాస్వామ్య దేశాలు" ఉసిగొలుపు తున్నాయి, అయినా రష్యా నిబ్బరం చెక్కుచెదర లేదు. ఆనాటి రష్యా విజయాలను గురించి ఎందరెందరో వేనోళ్ళ పొగిడారు ప్రపంచానికి చాటారు. మరికొందరు కళ్ళల్లో నిప్పులుపోసుకున్నారనుకోండి. అది వేరే కథ.

స్పెయిన్‌లో అంతర్యుద్ధం సాగింది. కమ్యూనిస్టులను మట్టుపెట్టాలని ఫాసిస్టు ఫ్రాంకు మారణహోమం మొదలుపెట్టాడు. ఫ్రాంకుకు బాహాటంగా హిట్లర్, ముసోలినీలు మద్దత్తుయిస్తే 'తటస్థం'అనే మేలిముసుగులో 'ప్రజాస్వామ్య దేశాలు'కూడా వాడికే తోడ్పడ్డాయి. అంతర్యుద్ధంలో రాల్ఫ్, ఫ్రాంకు, క్రిస్టోఫర్, కాడ్వెల్ లాంటి మేధావులు స్వయంగా పాల్గొని అమరులైనారు. స్పెయిన్ అంతర్యుద్ధం గురించి వ్రాసిన పుస్తకాలు కొల్లలు.

రష్యాలో సోషలిజం, స్పెయిన్‌లో అంతర్యుద్ధం అందరికీ తెలిసిన సంగతులే. ఎందరో వాటిని గానంచేశారు. ఉత్తేజం పొందారు. ఉద్రేకపడ్డారు. ఉర్రూతలూగారు.

కాని చైనా అంతర్యుద్ధంగురించిగాని, మారుమూల రాష్ట్రం ఏనాన్‌లోని ఎర్ర రాజ్యంగురించిగాని బయటప్రపంచం బొత్తిగా పట్టించుకోలేదు. ఎవరికీ అంతగా తెలి

యదుకూడా. ఆ కథలు గాథలు దాచేస్తే దాగనిసత్యాలు, నివురుగప్పిన నిప్పులాంటి నిజాలు అన్నీ ప్రపంచానికి సాటిచెప్పిన సాహసవీరుడు ఎడ్గార్ స్నో ఒక్కడే. అదే అతని విశిష్టత. ఇవాళ అందరికీ తలలో నాలుకలా వున్న మహాప్రస్థానం (Long March). అందరూ కళ్ళప్పగించి చూసే ఎర్రప్రాంతం (Yenan Red Base). అందరినోళ్ళలో నానే దీర్ఘకాలిక యుద్ధం (Protracted War). ఇవాళ అందరూ ప్రేమిస్తున్న మావో (Mao Tse Tung) ఇవన్నీ మనకు కళ్ళకుకట్టాడు ఎడ్గార్ స్నో. ఒక్కొక్కటి మనం టెలివిజన్‌లో చూడవచ్చు.

మహాప్రస్థానం (LONG MARCH)

కొమింటాంగ్ ప్రభుత్వ కసాయి పాలనలో ఎందరో కమ్యూనిస్టులు బలైపోయారు. 1934 అక్టోబరులో మహాప్రస్థానం మొదలయింది. దారిపొడుగునా గుండె నెత్తురుల తర్పణచేస్తూ కదలిపోయారు కమ్యూనిస్టులు. నదీనదాలు, అడవులు, కొండలు దాటుతూ ఎడాదిపొడుగునా ఆరువేలమైళ్ళు ప్రయాణంసాగించారు. ఆధునిక కాలంలో సాటిలేని మహాయాత్ర అది. ఒళ్ళుగగుర్పొడిచే, వెంట్రుకలు నిక్కపొడిచే, నెత్తురు ఉడుకెత్తించే, గుండెలుపిండిచేసే సన్నివేశాలు దారిపొడుగునా ఎన్నోఉన్నాయి.

ఏనాన్ ఎర్రప్రాంతం (YENAN RED BASE)

మహాప్రస్థానం కొనసాగించి మరోప్రపంచం చేరుకున్నారు. కాదు, కాదు-ఏనాన్‌లో మరోప్రపంచం నిర్మించుకున్నారు. అదే ఎర్ర రాజ్యం. చైనా అంతటా స్వదేశీ భూస్వాములు, పెట్టుబడిదారులు, విదేశీ సామ్రాజ్యవాదులు కుమ్మక్కయి రాజ్యమేలుతుండగా మారుమూల రాష్ట్రమయిన ఏనాన్‌లు సోషలిజం నిర్మించగలగడం గొప్ప విశేషం. రష్యాలో ఒంటరిగా సోషలిజం నెలకొనడమే గొప్పనుకుంటే, ఒక దేశంలోని ఒక రాష్ట్రంలో సోషలిజం స్థాపించడం మరింతగొప్ప. ఏనాన్‌లో యంత్ర పరిశ్రమ ఏమీలేదు కనుక శాస్త్రీయసోషలిజం సాధ్యంకాదు. ఓరకంగా అది గ్రామీణ సమానత్వం. సైనిక-రాజకీయ 'పునాది' నిర్మించుకోడానికి ప్రయత్నించడమే కమ్యూనిస్టుల ప్రధాన కార్యక్రమం. అందుకే దాన్ని base- పునాది అన్నారు. ప్రజల్లో కమ్యూనిస్టులు పునాది ఏర్పరచుకొని వున్నారు. విప్లవ బీజాలు అక్కడ నాటారు. విజ్ఞానం కలిగించారు. ఉమ్మడి వ్యవసాయం అక్కడ అమలుపర్చారు. ఆర్థిక-రాజకీయ-సాంస్కృతిక ప్రయోజనాలే త్రివేణీ సంగమం. బిచ్చగత్తెలు, పడుపుకత్తెలు లేరు. ఏర్పాటు పెళ్ళిళ్ళు లేవు. పెళ్ళికి నూతనార్థం ఏర్పరచారు.

దీర్ఘకాలిక యుద్ధం (PROTRACTED WAR)

చిరిగిపోయిన బట్టలతో, అర్ధాకలితోబాధపడే కొన్ని వందలమంది యువకులతో మొదలయింది ఎర్రసేన నిర్మాణం. కమ్యూనిస్టులు ఎవరికీ అరచేతిలో వైకుంఠం

చూపించలేదు. విప్లవం ఎన్నో త్యాగాలజ్వాలలతో కూడి వుంటుందని ముందే చెప్పారు. అన్నిటికీ తెగించి పోరాడాలన్నారు. చాంగ్‌కై షేక్ దాదాపు 8 లక్షల సైన్యాన్ని సమీకరించాడు. 400 యుద్ధవిమానాల్ని సంపాదించాడు. ఒక ముట్టడిలో 60 వేలు ఎర్ర సైనికులు చనిపోయారు. దాదాపు 10 లక్షల ప్రజానీకం ఆకలితోనూ, పోరాటంతోను మరణించారు.

మావో సే టుంగ్ (MAO TSE TUNG)

మావోతో గోష్ఠి జరిపిన మొట్టమొదటి విదేశీ పాత్రికేయుడు ఎడ్గార్ స్నో. పుడుతూనే ఎవ్వరూ కమ్యూనిస్టులు, మార్క్సిస్టులు కాలేరు. ఈ మాట మావోపట్ల కూడ నిజం. సామాజిక ఆచరణలో, వర్గ సంఘర్షణలో రాటుతేలాకనే మావో కమ్యూనిస్టు అయ్యాడు. మార్క్సిజం ఆకాశంనుంచి ఊడిపడదు. ఎవరి బుర్రలోనూ పుట్టదు. నిత్యజీవిత సంఘర్షణ అనే అగ్నిసరస్సునుంచి వికసించిన వజ్రకుసుమమే మార్క్సిజం. మావో జీవితం పరిశీలిస్తే యివన్నీ మనకు తేటతెల్లమవుతాయి. ఎడ్గార్ స్నో యిందులో ముఖ్యంగా మావో జీవితకథ ధారాళంగా నోరూరగ చెవులుపుట్ట వర్ణించాడు. ఒక్కబిగిని ఆబగా చదవాలనిపిస్తుంది.

సైన్యాధిపతి ఛూటే కథకూడా యిందులో వస్తుంది. మొదట్లో ఛూటే ఉత్తి అవగుణాలకుప్ప. కాని మార్క్సిస్టు సిద్ధాంతాల చలనంతో, చైతన్యవంతుడై అతను కమ్యూనిస్టుగా మారాడు. ఛూటే కథలు, వీరగాథలు చాలా ఆసక్తికరంగా ఉంటాయి.

చాంగ్‌కై షేక్‌ను ఒకసారి పట్టుకొని వదలివేశారు. అందువల్ల ఏనాన్‌కుకొన్ని లాభాలు ఒనగూడాయి. తక్కిన చైనాతో సంబంధ బాంధవ్యాలు ఏర్పడ్డాయి. ఆరోజుల్లో విప్లవ విజయానికి అది చాలా అవసరం అనిపించింది. షరతులు మాట్లాడుకున్నారు. వాటిల్లో ఒకటి– షాంఘియా మొదలైనచోట్ల ఉన్న కమ్యూనిస్టులకు పుస్తకాలు పంపించడం. ఇక్కడ ఎడ్గార్ స్నో కోట్లకు విలువైనమాట అన్నాడు. "కమ్యూనిస్టులకు అన్నిటికంటే విలువైనవి పుస్తకాలు". కమ్యూనిస్టులకు సాహిత్యం, కళలు, కవిత్వం సంస్కృతి వీటిమీద ఎంత మక్కువ వుంటుందో యీ ఒక్క వాక్యం చదివితే తెలుస్తుంది. ఏమయినా చాంగ్‌కై షేక్‌ను అలా వదలివేయడం కొందరికి రుచించలా. పోనీ సింహం చిట్టెలుకను వదలివేసిందనుకుందాం.

చైనాలో రెండుకోట్ల ముస్లిం ప్రజానీకం వుంది. ఏరకమైన మతకల్లోలాలకు తావివ్వకుండా చాలా నేర్పుగా, ఓర్పుగా ముస్లిం ప్రజల్లో వర్గచైతన్యం రేకెత్తించి క్రమ క్రమంగా వారి మతం తాలూకు మూఢనమ్మకాలను వదలగొట్టారు.

ఎడ్గార్ స్నోకు ఆరోజులలో అన్నీ ప్రశ్నలే. ప్రశ్నలే. జవాబులు దొరకవు. దొరికినా సంతృప్తి నివ్వవు. చైనా కమ్యూనిస్టులకు విద్యాగంధం వుందా? అసలు వాళ్ల

మనుషులేనా ? 'కాపిటల్' గ్రంథం వాళ్లు చదివారా ? చాలామంది వాళ్ళను బందిపోటు దొంగలని పిలచేవారు. ఇవాళ నక్సలైట్లను అలాగే రివిజనిస్టులు, మార్క్సిస్టులు, చంబల్‌వాలీ దొంగలని, సి.ఐ.ఎ ఏజంట్లనీ పిలుస్తున్నారు. ఎందుకంటే అలాపిలవక పోతే వీళ్ళకు కమ్యూనిస్టుల ముద్రవేసి వేధించుకుతినేవారు. అయినా ఎడ్గార్ స్నో ఏమీ చెదరలేదు. ఎన్ని యిక్కట్లపాలయినా, ఎన్ని యిడుములు పడినా చైనానుంచి ఇంటికి వెళుతూ "నాకు యింటికి పోతున్నట్లుగా లేదు. ఇల్లు వదలిపెట్టి వెళ్తున్నట్లుగా వుంది" అని మన గుండెలను కరగించివేస్తాడు ఎడ్గార్ స్నో. అయినా ఎడ్గార్ స్నో నిజాయితీ, ధైర్యసాహసాలు సర్కారు కమ్యూనిస్టులకు, కుహనా మార్క్సిస్టులకు ఎక్కడివి.

అనువాదం :—

మక్కీకి మక్కీగా ఉందేగాని మూలానికి న్యాయం చేకూర్చలేదు. తెలుగు నుడికారపు సొంపులు యిందులో కనిపించవు. మూలంలోవున్న కావ్యగుణం కంచుకాగడా పెట్టి వెదికినా మనకు అనువాదంలో దొరకదు.

మచ్చుకు కొన్ని తప్పులు చూపిస్తా.

GREAT WALL అంటే గొప్ప గోడ కాదు— పెద్ద గోడ లేదా అడ్డుగోడ అనాలి.

దాడి వైఫల్యంగా ముగిసింది— దాడి విఫలమయింది.

ఎర్రసైన్యం ఏ ఒక్కదానిలో ఓడిపోయినా అది నిర్ణయాత్మక ఓటమేఔతుంది,

బాగా దెబ్బతిన్నట్టే— బలహీనపడ్డట్టే అంటే చాలు.

అక్కడి ప్రజలలో అతను చెప్పదగినంత శతృత్వం సంపాదించుకొని వున్నాడని స్పష్టమవుతుంది

అక్కడి ప్రజలలో పెద్దపెట్టున శతృత్వం తెచ్చి పెట్టుకొన్నాడు లేదా అక్కడి ప్రజలెందరినో అతను పగచేసుకొన్నాడు. ఆదిలోనే హంసపాదులాగా

RED STAR OVER CHINA అంటే చైనాపై అరుణతార అనేకన్నా 'చైనాలో అరుణతార' అంటే మరింత తెలుగుతనం వుంటుంది.

ఏది ఏమయినా యింత మంచి పుస్తకం ప్రజలకు తేలికధరలో అందించి జనతా ప్రచురణలు తమ పేరు సార్థకం చేసుకున్నారు.

— చలసాని ప్రసాద్

చైనాపై అరుణతార

మూలం : **RED STAR OVER CHINA**

ఎడ్గార్ స్నో

వెల : **10-50**

అనువాదం : జనతా ప్రచురణలు

6—3—628/13, ఖైరతాబాద్,

హైదరాబాద్—500 004

వార్తలు :

ఉత్తర ప్రదేశ్ జెయిళ్ళలో....

ఉత్తరప్రదేశ్ జెయిళ్ళలో చాలా మంది నక్సలైట్ ఖైదీలున్నారు. వాళ్ళలో చాలా మంది యావజ్జీవకారాగార శిక్షలు, దీర్ఘ కాలిక శిక్షలు అనుభవిస్తున్నవాళ్లున్నారు. యు పి. ప్రభుత్వం వీళ్ళను రాజకీయ ఖైదీలుగా గుర్తించడానికి నిరాకరిస్తున్నది. వాళ్లు చాలా ప్రమాదకరమైన రోగాలకు గురయ్యారు. కాని తగిన చికిత్సగాని వైద్యసదుపాయాలుగానీ లేవు. బయట వాళ్ళ కుటుంబ సభ్యుల్లోకూడ కొంత మంది రకరకాల జబ్బులతో బాధపడుతున్నారు. ప్రభుత్వం నక్సలైట్ అండర్ ట్రయల్స్‌కు కేసు నడపడంలో కాని, పెరోల్ యివ్వడంలో గాని జాప్యం చేయడమనే ఎత్తుగడను అనుసరిస్తున్నది.

రామచంద్రసింగ్ ప్రముఖ నక్సలైట్... రచయిత, కవి, ఫతేపుర్ సెంట్రల్ జెయిల్లో యావజ్జీవ కారాగారశిక్ష అనుభవిస్తున్నాడు. అతని తల్లి, కొడుకుకు పెరోల్ కోసం దరఖాస్తు పెట్టింది. కాని ఆ దరఖాస్తు అతీ గతీ ఏమయిందోకూడ ఆ మెకు తెలియదు.

ఉత్తరప్రదేశ్ విప్లవ రచయితల సంఘం అతన్ని వెంటనే విడుదల చేయాలని, అది ఒకవేళ సాధ్యంకాకపోతే కనీసం పెరోల్‌మీదనయినా విడుదలచేయాలని డిమాండ్ చేస్తున్నది.

— ముక్తికుమార్
నిర్వాహణ కార్యదర్శి, ఉత్తరప్రదేశ్ వి.ర.సం.

విశాఖ తీర్మానాలు :

విరసం రెండవ సాహిత్య పాఠశాల సంక్షిప్త నివేదిక

విరసం రెండవ సాహిత్య పాఠశాల విశాఖలో అక్టోబర్ 23, 24, 25 తేదీల్లో జరిగింది. 23 ఉ. గం. 9 లకు శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రి పతాకం ఎగురవేశారు. అమరవీరులకు జోహార్లు అర్పించారు. 10 గం లకు "ఎన్నెస్ ప్రకాశరావు" హాలులో పాఠశాల ప్రారంభమయింది. కాశీపట్నం రామారావుగారు స్వాగతం చెప్పుతూ విరసం తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొంటున్న సమయంలో అకుంఠిత దీక్షతో హాజరైన సభ్యులను, డెలిగేట్లను అభినందించారు "భారతీయ సంస్కృతి - వర్గదృక్పథం" అన్న విషయంపై శ్రీకొడవటిగంటి కుటుంబరావుగారి ప్రసంగ వ్యాసం చదివి వినిపించబడింది. మధ్యాహ్నం 3 గం.కు "తెలుగు ప్రజల చరిత్ర, సంస్కృతి, సాహిత్యం" అను విషయంపై శ్రీ కాశీపట్నం, చలసాని ప్రసాద్, సాంబశివరావుగారలు ప్రసంగించారు.

"భారత స్వాతంత్ర్యోద్యమం—జాతీయ పోరాటం"అనే విషయంపై శ్రీ కె. వి. రమణారెడ్డిగారు పాఠం చెప్పారు. ఆ సాయంత్రం 7 గం లకు 'పంచాది నిర్మలనగర్' లో మేరంగి యువజన నాట్యమండలివారు 'నాంది' నాటకం ప్రదర్శించారు. విశాఖ జన నాట్యమండలివారు వంగపండు ప్రసాదరావుగారి పాటలు పాడారు. అదే రాత్రి విరసం విస్తృత కార్యవర్గ సమావేశం జరిగింది.

25 న ఉ గం. 9½ నుండి మ. గం. 3 వరకు విరసం సర్వసభ్య సమావేశం జరిగింది. కాళీపట్నం రామారావుగారిని కార్యదర్శిగా యెన్నుకున్నారు. విరసం పై ప్రభుత్వం కుట్రను ఎదుర్కోడానికి సభలు- సమావేశాలు జరిపి మేధావులు తదితరవర్గాలచే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకరావడానికి ఉద్యమాలు నిర్వహించాలని, డిఫెన్స్ నిధి విరివిగా పోగుచేయాలని నిర్ణయించారు. విరసం సభ్యులందరూ ప్రతి నెలా కొంత డబ్బు డిఫెన్సు నిధికి కన్వీనర్లద్వారా అందజేయాలనిగూడా నిర్ణయించారు. మధ్యాహ్నం 3 గం.కు శ్రీ శ్రీ మాట్లాడుతూ నన్నయనుండి నేటివరకూ తెలుగు సాహిత్య చరిత్రను మార్క్సిస్టు దృక్పథంనుండి పరిశీలించాల్సిన అవసరం వివరించారు.తర్వాత" తెలుగులో సంస్కరణ ఉద్యమాలు"అనే 'గవేషి' వ్యాసం CSR ప్రసాద్‌గారు చదివారు. సాయంకాలం పత్రికాగోష్ఠి జరిగింది.

సాయంత్రం 6 గం.కు 'హవా మహల్' నుండి 'ఎన్. జి. ఓ. క్లబ్' వరకు పెద్ద ఊరేగింపు జరిగింది. నినాదాలు, పాటలు, నృత్యాలతో అత్యంత ఉత్సాహపూరితంగా సాగిపోయింది. 'పంచాది నిర్మలా నగర్'లో శ్రీ రా. వి. శాస్త్రి అధ్యక్షతన గొప్ప బహిరంగసభ జరిగింది. వంగపండు ప్రసాద్‌గారి "ఏరువాక" పోరాటపాటల సంకలనాన్ని, భూషణంగారి నవల 'కొండగాలి'ని శ్రీ శ్రీ ఆవిష్కరించారు. మిన్నుముట్టే కరతాళ ధ్వనులమధ్య శ్రీ కాళీపట్నం రామారావుగారు 'యజ్ఞం' కథల సంపుటానికి ఆం.ప్ర. సాహిత్య అకాడెమీ యివ్వదలచిన 1,116/- రూ.ల అవార్డును తిరస్కరిస్తున్నట్టు ప్రకటించారు. శ్రీ శ్రీ, రా.వి. శాస్త్రి, కాళీపట్నం, రమణిగార్లు ఉపన్యసించారు. హైదరాబాద్ జననాట్య మండలివారు తమ సాంస్కృతిక ప్రదర్శనద్వారా ప్రజలను ఉర్రూతలూగించారు.

తీర్మానాలు

(25-10-'74 సర్వసభ్య సమావేశంలో ఆమోదింపబడినవి.)

1) విరసం పై ప్రభుత్వ దమనకాండను తిప్పి కొట్టండి :— విరసాన్ని మొగ్గలోనే తుంచేయాలని బెదిరింపులు, పుస్తకాల నిషేధాలు, ఆ.భ. చట్టాలు మొ॥వాటితోవిరుచుకు పడిన ఈ "ప్రజాస్వామ్య" ప్రభుత్వం తన ప్రయత్నాలన్నీ నీళ్లుకారిపోగా విరసం కార్య

దర్శితోసహా 5 గురి సభ్యులపై "సికింద్రాబాద్ కుట్రకేసు" బనాయించి యేండ్లతరబడి జైళ్ళలో మగ్గబెట్టాలని కుట్రపన్నింది. ఇదిచాలక సెప్టెంబర్ 7 న విరసం తాత్కాలిక కార్యదర్శి భూమన్ తదితరులపై "తిరుపతి కుట్రకేసు" రుద్దింది. విరసం కార్యవర్గ సభ్యుడు జీవన్ ఇంటిపై దాడిచేసి పోలీసులు నానారకాలుగా బాధించారు. ఇవన్నీ విరసం పై ఈ దోపిడీ ప్రభుత్వపు కుట్రకు సంబంధించిన నీచపు ఎత్తుగడలే. నిర్బంధం విరసాన్ని నీళ్లగార్చలేదు. విప్లవ ప్రజలే విరసాన్ని అన్నివిధాల కాపాడుకొని యీ దాడులను తిప్పికొట్టాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

2) 'కుట్ర' కేసుల కుట్ర :— కుట్రకేసులలో దొంగ సాక్ష్యాలు సేకరించడానికి విద్యార్థులను, రైతులను కిరాయి పోలీసులు చిత్రహింసలు పెట్టారు. వారినికూడా కుట్రకేసుల్లో యిరికిస్తామని బెదిరించారు. తాము చెప్పినట్లు వింటే పరీక్షల్లో కాపీలు అందించడం మొదలు ఎన్నో సహాయాలుచేసి, పెళ్లిళ్లుచేసి ఉద్యోగాలిప్పిస్తామని యువకుల్ని ప్రలోభపెట్టారు. విరసం సభ్యులైన అధ్యాపకులు శాంతి భద్రతలకు భంగకరమైన విషయాలు క్లాసుల్లో విద్యార్థులకు చెప్తున్నట్లు సాక్ష్యంగా బూటకపు 'నోట్సులు' సృష్టించడానికి తంటాలు పడుతున్నారు. మరోపక్క విరసం సభ్యులకు బెయిలు నిరాకరించడం, జైళ్ళలో సోదాలు మొ॥నీచమైన ఎత్తుగడలద్వారా కోర్టులు, జైళ్లు తమవర్గ స్వభావాన్ని బయట కక్కుకుంటున్నాయి. కుట్ర కేసులను, విచారణతంతును కనిపెట్టి వీటన్నింటినీ దెబ్బకొట్టాలని విరసం ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నది.

3) విరసం సభ్యులపై తప్పుడు కేసులు :— అనంతపురం జిల్లా ధర్మవరం తా॥లో పేదరైతులు భూస్వాములు ఆక్రమించిన బంజర్లను స్వాధీనం చేసుకున్న సందర్భంలో ఆ వూరికిచెందిన విరసం కార్యవర్గ సభ్యుడు పరిటాల శ్రీరాములుగారిని పోలీసులు 8 తప్పుడుకేసుల్లో ఇరికించారు. నాటుబాంబులున్నాయనే మిషతో 'వారంటు'లనాలేకుండా ఇంటిపైన, పొలంపైన దాడిచేసి సోదా నిష్ఫలంకాగా శ్రీరాములుగారిని దుర్భాషలాడిపోయారు. అక్కడి ప్రజలను తీవ్ర నిర్బంధానికి గురిచేస్తున్నారు. ప్రభుత్వపు యీ దుర్మార్గాన్ని, పోలీసులద్వారా చేయించే భూస్వాముల దౌర్జన్యాన్ని విరసం తీవ్రంగా నిరసిస్తున్నది.

4) భూమయ్య, కిష్టాగౌడ్‌ల ఉరిశిక్షలు రద్దుచేయాలి :— తమ సర్వస్వాన్నీ త్యాగంచేసి ప్రజాపోరాటాలు నడుపుతూ ప్రజాసేవకు అంకితమైపోయిన వీరులు కామ్రేడ్స్ భూమయ్య, కిష్టాగౌడ్‌లను ఉరిశిక్ష పేర చట్టబద్ధంగా హత్యచేయాలని ఐ.రా.స. నియమాల్ని ఉల్లంఘిస్తూ విధించిన ఉరిశిక్షలను రద్దుచేయాలని విరసం డిమాండు చేస్తున్నది. ప్రగతిశీల ప్రజాతంత్రవాదులందరూ పెద్ద ఎత్తున ఆందోళన లేవదీయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

5) భారతదేశంలో జైళ్లు :— జైళ్ళను క్రిక్కిరిసిన ఖైదీలతో నింపి ఏళ్ళతరబడి విచారణలేకుండా ఏవిధంగా అమానుషమైన హింసలకు అవమానాలకూ గురిచేస్తున్నదో ఇటీవలే 'అంతర్జాతీయ క్షమా సంస్థ' ప్రపంచదృష్టికి తెచ్చింది. ఏదో ఒక నెపంతో లాఠీచార్జీలు చేయడం, నిరాయుధులైన ఖైదీలను కాల్చేయడంవంటి ఘోర చర్యలకు గూడ పాల్పడుతున్నది- రేషన్ల దోపిడీ, వైద్య సౌకర్యాలు నిరాకరించడం, సంవత్సరాలతరబడి బేడీలువేసి ఉంచడం మొదలగు రాక్షసచర్యలద్వారా జైళ్ళను నరకకూపాలుగా మార్చింది. ఖైదీలపై ముఖ్యంగా నక్సలైట్ ఖైదీలపై ప్రభుత్వం సాగించే హింసాకాండను విరసం తీవ్రంగా ఖండిస్తోంది. ఈ అమానుష పరిస్థితులు కొనసాగించడం తన పతనాన్ని దగ్గరచేసుకోవడమేనని హెచ్చరిస్తున్నది.

6) విద్యార్థి ఉద్యమాలపై ప్రభుత్వ దమనకాండ :— ఉస్మానియా యూనివర్సిటీ ఆవరణలో ఇటీవల మతశక్తులకూ, ప్రగతిశీల శక్తులకూ మధ్య జరిగిన సంఘర్షణనూ పురస్కరించుకొని ప్రభుత్వం 13 మంది రాడికల్ స్టూడెంట్స్‌నూ, మరికొందరు ప్రగతిశీల విద్యార్థులనూ అరెస్టుచేసి దొంగ కేసుల్లో యిరికిస్తున్నది. ఈ దమన చర్యలను విరసం తీవ్రంగా ఖండిస్తూ యువశక్తిముందు ఏ ప్రభుత్వమూ నిలువలేదని హెచ్చరిస్తున్నది.

7) బీహార్ ఆందోళన :— కరువు కాటకాలు, నిరుద్యోగం, అధిక ధరలు, ఆకలి చావులకుగురై తీవ్రమైన అసంతృప్తితో బీహారు పీడిత ప్రజానీకం ప్రభుత్వ వ్యతిరేక ఆందోళన లేవదీసింది. అక్కడ జయప్రకాశ్ నారాయణ్ లాంటివారు పెట్టే పరిమితమైన డిమాండ్లవల్ల ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు రాదు బీహార్ విద్యార్థులు, యువజనులు, కార్మికులు, కర్షకులు యీ నిజాన్ని గ్రహించి పైపై మార్పులకోసంకాక నిజమైన ప్రజాతంత్ర నిర్మాణానికి దేశంలో కొనసాగుతున్న సాయుధ రైతాంగ పోరాటాల్లో భాగంగా తమ పోరాటాన్ని సంలీనంచేయాలని విరసం విజ్ఞప్తి చేస్తూంది.

8) అడుక్కుంటే ఆకలి తీరదు :— నెలంతరబడి జీతాలు అందక సామర్లకోట మున్సిపల్ పాఠశాల ఉపాధ్యాయులు ఆగస్టు 15న వీధుల్లోపడి బిచ్చమెత్తారట. మన స్వాతంత్ర్యం బండారం ఇది బయటపెడుతోంది. మేధావివర్గం అని చెప్పుకోబడే ఉపాధ్యాయులు తమ సమస్యల పరిష్కారానికి అడుక్కోవడంవంటి మార్గం చేపట్టడం శోచనీయం. ఉపాధ్యాయుల సమస్యలపట్ల విరసం గాఢసానుభూతిని ప్రకటిస్తూనే వారి సమస్యల పరిష్కారానికి 'భిక్షాటన'కానీ 'ఉపాధ్యాయదినం', 'నిరసనదినం'గా ప్రకటించుకోడంగానీ మార్గంకాదని సాయుధ పోరాటాలద్వారానే మనం మన అన్ని సమస్యలను సాధించుకోగలుగుతామని గుర్తు చేస్తున్నది.

9) 'స్మగ్లర్ల వేట' తమాషా :— దేశం రాజకీయ ఆర్థిక సంక్షోభంలో రోజురోజుకీ లోతుగా కూరుకుపోతున్న యీ దశలో ప్రభుత్వం, తాజా దేశవాళీ చిట్కాలతో చావు తెలివిని ప్రదర్శిస్తున్నది. పీడిత ప్రజల దృష్టిని వారి ఆందోళనలను నిజమైన సమస్యల నుండి మళ్ళించి పరిష్కారాలను తప్పుడు తోవలు పట్టించి యింకా కొంతకాలం పబ్బం గడుపుకుందామనే తాపత్రయమే ఈ స్మగ్లర్లవేట 'సోదికి పాతరంకులు బైటపడ్డాయట।' అలాగే యీ మధ్య స్మగ్లర్లతో రాజకీయ నాయకులకున్న సంబంధాన్ని బయటపెడు తున్నది. పై చిట్కాలు అసలు రంగును తెలుసుకొని ప్రజలు అప్రమత్తులై భ్రమ లకులోనుగాకుండా తమ పోరాటదీక్షను పదునుపెట్టుకోవాలని విరసం విజ్ఞప్తి చేస్తున్నది.

10) ఆకలిచావులు :— 27 ఏళ్ల స్వాతంత్ర్యం ఫలితంగా బెంగాల్ రాష్ట్రంలో రోజుకి 20 మందికి ఆకలికి అహుతి అవుతున్నట్లు చూస్తున్నాం. ఆకలి చావులకూ ఏ రాష్ట్రం మినహాయింపుకాదు. ఆత్మహత్యలు, కుటుంబం యావత్తు విషం పుచ్చుకోడం లాంటి ఉదంతాలు రోజు రోజుకి పెరిగిపోతున్నాయి—ఇంకా వెలుగులోకిరాని ఆకలి చావులెన్నో! దారిద్ర్యం, ధరలు, దొంగడబ్బు, నోట్లముమ్మరం విపరీతంగా పెరిగిపోతున్నాయి. రూపాయివిలువ లేకుండాపోయింది ఈ తీవ్ర సంక్షోభపు ఊబినుండి, సుడిగుండం నుండి ప్రభుత్వం బయటపడలేదు. అందుకే ఈ ప్రభుత్వం తిరగపడ్డ వాళ్లను తిండికిబదులు తూటాలను తినమంటోంది. ప్రజల్ని పిట్టల్లా కాల్చివేసి ప్రజాఉద్యమాల్ని రాక్షసంగా అణిచివేస్తోంది, ఈ అభివృద్ధినిరోధక, దళారీ నిరంకుశ ప్రభుత్వాన్ని, ఈ దోపిడీ వ్యవస్థను కూకటివేళ్లతోసహా కూల్చివేసినపుడే ప్రజలకు నిజమైన మనుగడ ఏర్పడు తుంది. అందుకే "ఆకలితో చావడంకన్నా పోరాటంలో మరణించడంమేలు" అని విరసం ప్రజలకుగుర్తు చేస్తోంది.

11) భారత ప్రభుత్వ విస్తరణవాంఛకు 'సిక్కిం' బలి :— అనుబంధ రాష్ట్ర ప్రతిపత్తి ముసుగుతో సిక్కిం స్వాతంత్ర్యాన్ని హరించిదాన్ని తన గుప్పిట్లో ఇరికించు కోడం భారత ప్రజల ప్రయోజనాలకు భిన్నంగా, రష్యన్ సోషల్ సామ్రాజ్యవాదుల జనచైనా వ్యతిరేక దిగ్బంధనా వ్యూహంలో భాగమని విరసం భావిస్తోంది. సిక్కిం ప్రజల అభిప్రాయాలను కాలరాచి అత్యంత హేయంగా భారత ప్రభుత్వం చేసిన విస్తరణ చర్యను విరసం ఖండిస్తోంది.

12) 25వ విప్లవ విజయోత్సవం జరుపుకుంటున్న జనచైనాకు జేజేలు :— మార్క్సిజం-లెనినిజం, మావో ఆలోచనా విధానం మార్గంలో మహత్తరచైనా కమ్యూ నిస్టుపార్టీ నాయకత్వాన ప్రపంచ పీడితప్రజల విప్లవ కేంద్రంగా అలరారుతున్న జనచైనా 25వ వార్షికోత్సవం సందర్భంగా అక్కడి ప్రజలకు విరసం జేజేలు.

గత 25 ఏళ్లుగా యింటా బయటా అనేక రూపాలలో తలెత్తుతున్న రివిజనిస్టు ధోరణులను ప్రతిఘటిస్తూ రష్యన్ సోషల్ సామ్రాజ్యవాదుల, అమెరికన్ సామ్రాజ్యవాదుల కుటిల రాజకీయాలను భగ్నంచేస్తూ సర్వతోముఖంగా బ్రహ్మాండమైన అభివృద్ధిని సాధించిన జనచైనాకు విరసం జేజేలు.

కన్ఫ్యూషియనిజం వంటి బానిస, అభివృద్ధి నిరోధక సాంస్కృతిక ధోరణుల అవశేషాలను నిర్మూలించి స్వచ్ఛమైన శ్రామికవర్గ సంస్కృతిని పటిష్టంచేసేందుకు జనచైనా ప్రజలు నిర్వహిస్తున్న సాంస్కృతిక పోరాటాలను విరసం హార్దికంగా అభినందిస్తున్నది.

13) రష్యన్ అక్టోబర్ విప్లవం:— ప్రపంచ విప్లవ నాయకులు లెనిన్, స్టాలిన్‌లు కార్మికుల నెత్తురు త్యాగాలతో రష్యాలో నిర్మించిన ప్రపంచ ప్రథమ సోషలిస్టువ్యవస్థను వెన్నుపోటు పొడిచిన కృశ్చేవ్ రివిజనిస్టుల ముఠా దాని వారసులైన బ్రెజ్నేవ్ విప్లవ విద్రోహులు 'శాంతి-సహజీవనం' పేరిట అంతర్జాతీయ కార్మికోద్యమానికి ద్రోహంచేసి, ఆసియా, ఆఫ్రికా, లాటినమెరికా దేశాలలో ప్రజావిముక్తి పోరాటాలను నీరుగార్చుతూ ప్రపంచ విప్లవ కేంద్రంగా ముందుకొచ్చిన జనచైనాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ కుట్రలు పన్నుతున్నారు. రంగుమార్చకుండానే దిక్కుమార్చిన రష్యన్ రివిజనిస్టుల అంతర్జాతీయ విప్లవ విద్రోహాన్ని, సోషల్ సామ్రాజ్యవాదాన్ని విరసం తీవ్రంగా గర్హిస్తున్నది.

ఈ సోషల్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా రష్యాలోనూ, ప్రపంచ దేశాలలోనూ జరుగుతున్న మిలిటెంట్ విప్లవ పోరాటాలు విజయవంతంకాక తప్పదనే చారిత్రక సత్యాన్ని గుర్తిస్తూ, ఆ పోరాటాలునడిపే విప్లవ కార్మిక యోధులను రష్యన్ అక్టోబర్ విప్లవ 57 వ వార్షికోత్సవ సందర్భంలో విరసం అభినందిస్తున్నది.

14) జ్వాలాముఖి, నిఖిలేశ్వర్‌ల పైఖరిపట్ల నిరసన :— విరసం పుట్టుకలో, దానితొలి నిర్మాణ దశల్లో చురుకైన పాత్ర నిర్వహించి చొరవతో ముందుకు దూసుకుపోయిన మన కామ్రేడ్స్ జ్వాలాముఖి, నిఖిలేశ్వర్‌లు యిటీవలి కాలంలో తమ పాత్రనుతామే వమ్ముచేసుకునే విధంగా విరసం కార్యకలాపాలలో అలసత్వం వహించడం విచారకరం అంతేకాక రానురాను విరసం సమిష్టి కార్యాచరణకు ప్రతిబంధకంగా కూడా తయారుకావడం మరింత శోచనీయం-ప్రాథమికంగా ఈ కామ్రేడ్స్ స్థానిక యూనిట్‌తో సహకరించకుండా వ్యక్తిగత పోకడలు పోయారు. ప్రాథమిక నిర్మాణానికి కట్టుబడకుండా క్రమశిక్షణను కాలరాచి సంస్థను నిర్మాణాత్మకంగా బలహీనపరచాలని ఉద్దేశపూర్వకంగా ప్రయత్నించారు. ఈ విషయంలో కార్యవర్గం పలుసార్లు చేసిన విజ్ఞప్తులను

పెడచెవిని పెట్టారు- భిన్నాభిప్రాయాలుగల సభ్యుల మధ్య ఐక్యతకోసం నిరంతరం చిత్తశుద్ధితో కృషిచేస్తూ విరసాన్ని కంటికి రెప్పలా కాపాడుకోకపోగా వ్యక్తిగత నిందారోపణలకు దూషణలకు పాల్పడి సంస్థలో అనైక్యతను ప్రజలలో గందరగోళాన్ని సృష్టించడానికి ప్రయత్నించారు. ముఖ్యంగా, కామ్రేడ్ జ్వాలాముఖి యిటీవలి ఉపన్యాసాలలో యీ ధోరణి ప్రబలింది-అలాగే విరసం కార్యకర్తలు ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో పాల్గొని విరసం ప్రతిష్ఠకు భంగకరంగా ప్రవర్తించి విరసం బయట, విరసం పైన, విరసం సభ్యులపైన వ్యక్తి గతంగానూ విచ్ఛిన్నకరధోరణిలోనూ ప్రచ్ఛన్న ప్రచారం సాగిస్తున్నట్లుకూడ సమాచారం విరివిగా అందుతున్నది- విరసం తీవ్ర నిర్బంధానికి గురిఅవుతున్న ఈక్లిష్ట సమయంలో సంస్థను సజీవంగా కాపాడే ప్రయత్నానికి మారు విరోధి ధోరణిలో విరసం కార్యక్రమాలను నీరుగార్చే పద్ధతి అవలంబించారు. అంతేగాక, నిర్బంధానికి గురిఅయిన విరసం సభ్యులపై ప్రభుత్వం చేసే నీచమైన అబద్ధపు ఆరోపణలను ఖండించడంబదులు వాటికి మద్దతునిచ్చే విధంగా ఆ సభ్యుల బంధుమిత్రులతో మాట్లాడి అపప్రథలను సృష్టించడం భయోత్పాతాలు కలిగించే ప్రయత్నాలు చేయడం మరింత గర్హనీయం మనం చేసిన విజ్ఞప్తులు హెచ్చరికలు పెడచెవినిపెట్టి నానాటికీ క్రమశిక్షణగాలికి వదిలివేస్తున్నారు-జ్వాలాముఖి "తెలుగు ప్రజల చరిత్ర, సంస్కృతిసాహిత్యం"పై పాఠం చెప్పాలని కార్యవర్గం ఎంతో ముందుగా చెప్పింది. జ్వాలాముఖి ఆ బాధ్యతను స్వీకరించి కూడా విశాఖ సాహిత్యపాఠశాలకు సాంతం ఎగ్గొట్టేశాడు. కనీసం వ్యాసం కూడా పంపలేదు. విరసాన్ని, దాని కార్యకలాపాలను కావాలని వెన్నుపోటు పొడిచినట్లు కనబడుతూంది. జ్వాలాముఖిగారు యిలాంటి పనులకు ఒడిగట్టడం ఏరకంగానూ సమర్థనీయంకాదు.

పై విషయాలనన్నిట్నీ పరిశీలించి యీ సర్వసభ్య సమావేశం కా॥ జ్వాలాముఖి, నిఖిలేశ్వర్‌లను వారి యీ ప్రవర్తనను తీవ్రంగా నిరసిస్తున్నది. నిజమైన మార్క్సిస్టులుగా బోల్షివిక్ స్పిరిట్‌తో వారు ఆత్మవిమర్శ చేసుకొని, అలసత్వాన్ని విడనాడి, విరసం పుట్టినప్పుడు ఎలా చురుగ్గావున్నారో అలాగే మళ్లీ యిప్పుడు విరసం పెంపుదలకు తమ పాత్రను ద్విగుణీకృతోత్సాహంతో కొనసాగించాలని కోరుతున్నాం,

కాశీపట్నం రామారావు, కార్యదర్శి
విప్లవ రచయితల సంఘం, ఆం.ప్ర.

భీమిరెడ్డి గుండాలచే విప్లవ వీరుడు కామ్రేడ్ వెల్లు జానయ్య హత్య

తనకు వ్యతిరేకమైన విప్లవ పార్టీ సిద్ధాంతాలను ఆచరిస్తున్నాడనే కక్షమీద భీమిరెడ్డి నర్సింహారెడ్డి, M. P., అతని గుండాలు కామ్రేడ్ వెల్లు జానయ్యను నవంబర్

5 న అతని స్వగ్రామమైన సూర్యాపేట తాలూకా కర్విరాల గ్రామంలో యింటి నుండి దౌర్జన్యంగాలాగి గొడ్డండ్లతో, గడ్డకొయ్యలతో కొట్టి చంపినారు. అతని కుటుంబ సభ్యులను తీవ్రంగా గాయపర్చినారు. అతని అన్న యింటినుండి రూ. 300/- దొంగిలించారు. అతని కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో ప్రమాదస్థితిలో వున్నారు. కామ్రేడ్ జానయ్య కర్విరాల రైతు కూలీ సంఘం నాయకుడు. అతడు రహస్య కామ్రేడ్లకు రక్షణ యిస్తున్నాడని, తన హత్యకు కుట్రచేస్తున్నాడని పుకార్లులేవదీసి అతన్ని గ్రామం వదిలి వెళ్లేటట్టుచేశాడు భీమిరెడ్డి నర్సింహారెడ్డి. తర్వాత ఆయనను నమ్మించి ఊర్లోకి రానిచ్చి యీ హత్య చేశాడు. కామ్రేడ్ జానయ్య శవాన్ని రైతుకూలీ సంఘం నాయకత్వాన ఊరేగించి దహనం చేశారు.

పై ఘోర సంఘటన ప్రజల దృష్టినుంచి మరల్చటానికి 17-11-74 'ప్రజాశక్తి'లో జానయ్య పాలివాండ్ల ఘర్షణలో చనిపోయినట్లు కొందరు గాయపడినట్లు ఒక అబద్ధపువార్త వేయించారు- కాని విప్లవ విద్రోహి భీమిరెడ్డి ముఠా ప్రజలనుండి తప్పించుకోవడం అసాధ్యం- ఈ ఘటన పాలివాండ్లదని ప్రజలలో బహిరంగ విచారణలో రుజువు చేయాలని సవాల్ చేస్తున్నాం.

వై. స్వామి, కార్యదర్శి
సూర్యాపేట రైతు కూలీ సంఘం.

ప్రజాసాహితి సెంటరు

సృజన, పిలుపు, ఉదయం, విమోచన, ఎర్రగడ్డ వెలుగు మొదలగు విప్లవ సాహితీ పత్రికలు, మార్క్స్, లెనిన్, స్టాలిన్ మావో విప్లవ రచనలు దొరుకును.

టి. వెంకటనారాయణ
ప్రజాసాహితి సెంటర్
మెయిన్‌రోడ్, నర్సారావుపేట.

మనవి

మీరు 'సృజన' చందాదారులుగ చేరండి- మీ మిత్రులను చేర్పించండి- సృజనకు చందాలు చేర్పించడం ఒక ఉద్యమంగా చేపట్టండి-

విప్లవ రచయితలను విడుదలచెయ్యాలి - గుంటూరు పౌరహక్కులసభ డిమాండ్ :

27-10-74 న 4వ తరగతి ఉద్యోగుల కార్యాలయం గుంటూరులో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీ సాంబిరెడ్డిగారి అధ్యక్షతని పౌరహక్కుల సభ జరిగింది. సుమారు 300 మంది సభకు హాజరైనారు.

శ్రీ సాంబిరెడ్డి, గుంటూరుజిల్లా పౌరహక్కుల సంఘ అధ్యక్షులు శ్రీ ఎన్. వి. ఎల్. నరసింహారావు, ఆర్గనైజేషన్ కాంగ్రెస్ నాయకులు, అడ్వకేట్ శ్రీ బి. హెచ్. సుబ్బారెడ్డి, ప్రముఖ న్యాయవాది శ్రీ జొన్నలగడ్డ జోషి సోషలిస్టుపార్టీ నాయకులు, అడ్వొకేటు శ్రీ పాపిరెడ్డి, రిపబ్లికన్‌పార్టీ నాయకులు శ్రీ దేవిడ్, కార్మిక నాయకులు శ్రీ కె. ప్రసాద్, విప్లవ కమ్యూనిస్టుపార్టీ నాయకులు శ్రీ మాదాల నారాయణస్వామి గారలు మాట్లాడుతూ ప్రభుత్వం విప్లవ రచయితలపై విప్లవకారులపై సాగిస్తున్న నిర్బంధాలనూ, హత్యాకాండనూ తీవ్రంగా ఖండించారు- ప్రజల పౌరహక్కులు రక్షింపబడాలంటే వర్గరహిత సమాజ స్థాపన అవసరమనీ అది వర్గపోరాటం, విప్లవం ద్వారానే సాధ్యమనీ కొందరు వ్యక్తులు ఉద్బోధించారు. ప్రజలకొరకు పోరాడుతున్న వారికి ప్రజలే అండనిలవాలని కోరారు.

శ్రీ వెంకటేశ్వరరావు ప్రవేశపెట్టిన యీ దిగువ తీర్మానాలు ఆమోదించబడ్డాయి

❶ అరెస్టుచేసిన విప్లవ రచయితలను వెంటనే విడుదల చెయ్యాలి. ❷ రాజకీయ కుట్రకేసులన్నిటిని ఎత్తి వేయాలి ❸ నక్సలైటు ఖైదీలను రాజకీయ ఖైదీలుగా గుర్తించాలి ❹ సంఘర్షణలలో చనిపోయారంటూ నక్సలైట్లనూ, విప్లవ కమ్యూనిస్టులనూ పోలీసులు చంపిన అన్ని సందర్భాలలోనూ న్యాయవిచారణ జరిపించాలి ❺ శ్రీకాకుళం, ఖమ్మం, వరంగల్లు, కరీంనగరుజిల్లాలలో కొన్ని ప్రాంతాలను కల్లోలితాలుగా ప్రకటించటాన్ని ఎత్తివేయాలి ❻ రైల్వేకార్మిక సమ్మెసందర్భంగా పనినుండి తొలగించిన కార్మికులను వెంటనే పనిలో చేర్చుకోవాలి ❼ పనినుండి తీసివేసిన నెల్లిమర్ల జూట్ కార్మికులను పనిలో చేర్చుకోవాలి ❽ హిందూస్తాన్‌టైమ్స్ సంపాదకుడు శ్రీ వర్గీస్‌ను పనినుండి తొలగించటం అక్రమం అయనను తిరిగి పనిలోనికి జేర్చు కోవాలి.

గుంటూరుజిల్లా పౌరహక్కుల సంఘకార్యదర్శి అడ్వకేటు శ్రీ గణేశుని కోటేశ్వరరావుగారి వందన సమర్పణతో-సభ ముగిసింది.

సభానంతరం "విప్లవ రచయితలను విడుదలచెయ్యాలి" 'కుట్రకేసులుఎత్తి వేయాలి' మొదలగు నినాదాలుఇస్తూ సుమారు 200 మంది పట్టణ వీధులలో వూరేగింపుజరిపారు.

(సం.) జి. కోటేశ్వరరావు
1/4 బ్రాడీపేట గుంటూరు.

జైళ్ళలో రాజకీయ ఖైదీల హత్యలు–
అఖిలభారత పౌరహక్కుల సమావేశం ఖండన :

అలహాబాదు: ఇక్కడ అక్టోబర్ 20, 21 తేదీల్లో రెండురోజులు జరిగిన అఖిల భారత పౌరహక్కుల సమావేశం జెయిళ్ళలో, పోలీసు లాకప్‌లలో జరిగిన వేలాది మంది రాజకీయ ఖయిదీల హత్యలకు ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని, యీ నీచ మయిన చర్యలకు బాధ్యులయిన వారందరినీ శిక్షించాలని డిమాండ్ చేసింది, నలభై వేల మందికిపైగా నక్సలైట్ ఖయిదీలు అమానుషమైన హింసలకు గురిఅవుతున్నారని పత్రి కలలో వస్తున్న వార్తలపట్ల చాలామందివ్యక్తులు తీవ్రమయిన వ్యగ్రతను వ్యక్తం చేసారు. ఎంతోకాలంగా వీళ్ళను జెయిళ్ళలో మగ్గజేస్తూఉండడాన్ని నిరసిస్తూ వీళ్ళను ఏ షరతులులేకుండా వెంటనే వదిలివేయాలని డిమాండ్ చేసారు, రాజకీయ కారణాల కొరకు అరెస్టయిన వ్యక్తులను రాజకీయఖయిదీలుగా గుర్తించాలని ఏకగ్రీవంగా మరో తీర్మానంలో డిమాండ్ చేసారు. వీళ్ళను విచారించి శిక్షలువేసేదాకా లేదా వదిలేసేదాకా వీరిపట్ల మానవతా దృక్పథంతోనూ, నాగరికంగానూ వ్యవహరించవలసిందిగా డిమాండ్ చేసారు–

ఈ సమావేశాన్ని ఢిల్లీకిచెందిన సుప్రసిద్ధ రచయిత హన్స్‌రాజ్ రహబార్ ప్రారంభించారు. పశ్చిమ బెంగాల్ న్యాయ సహాయక సంఘం కార్యదర్శి శ్రీమతి జయశ్రీ రాణా అధ్యక్షత వహించారు.

* * *

రాష్ట్ర పౌరహక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి –
శ్రీ పత్తిపాటి వెంకటేశ్వర్లుగారి ప్రకటనలు :

పార్లమెంటు, శాసనసభ్యులూ, వివిధ పార్టీల నాయకులూ, కార్మిక తదితర ప్రజా సంఘాలూ, యువజన, విద్యార్థి సంఘాలూ ప్రతినిధుల టెలిగ్రాంల పంపించడం ద్వారా, పెద్దఎత్తున ప్రదర్శనలద్వారా దేశభక్తులైన శ్రీయుతులు భీమయ్య, కిష్టాగౌడ్ లపై విధించిన ఉరిశిక్షల రద్దుకై ప్రభుత్వాన్ని డిమాండ్ చేయవలసిందిగా, వారిప్రాణాల రక్షణకై పోరాడవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

* * *

బెల్లంపల్లి, మందమర్రి, రామగుండం, రామకృష్ణాపురం బొగ్గుగనులలోని మెజారిటీ కార్మికులకు సింగరేణికాలరీ యాజమాన్యం క్వార్టర్లను (గృహవసతి) కట్టించలేదు. ప్రతివారు 7, 8 మైళ్ళనడచి రావాల్సివస్తోంది. ఒక నిమిషం ఆలస్య

మైనా, జరిమానాక్రింద రెండురోజుల దాకా పనినుండి తీసివేస్తున్నారు. ఆర్. టి. సి. బస్సులు రామకృష్ణాపురం వరకేవున్నాయి. తర్వాత 3 మైళ్ళు కంట్రాక్టర్ల లారీలలో ప్రతిఒక్కడూ 25 పైసలిచ్చి పోతూంటారు. ఈ మధ్య గనుల ఆఫీసర్లు కాంట్రాక్టర్ల నుండి మామూళ్ళు ఎక్కువ వసూలుచేయటంతో, ఈ కంట్రాక్టర్లు లారీ ఛార్జిని 25 నుండి 50 పైసలకు పెంచారు. ఈ విధంగా తమకు నష్టంలేకుండా చేసుకొన్నారు కంట్రాక్టర్లు. ఈ దారుణానికి వ్యతిరేకంగా కార్మికులు ఆందోళనచేసి, లారీలను ఆపిన సందర్భంలో 29–7–74 న పోలీసులు ఏడుగురిని అరెస్టుచేసి, చిత్రహింసలపాల్జేసి, బెయిలుమీద వదిలిపెట్టారు. యాజమాన్యం 4 గురిని ఉద్యోగాలనుండి తొలగించింది. రాష్ట్ర పౌరహక్కుల సంఘం యజమానుల కంట్రాక్టర్ల నిరంకుశదోపిడీ పద్ధతుల్ని ఖండించుతోంది. తొలగింపబడిన కార్మికులను వెంటనే పనిలోకి తీసుకోవాలని, కార్మికులకు గృహవసతి కల్పించాలని లేదా గనులవరకు బస్సులను నడపాలని డిమాండు చేస్తోంది.

* * *

రాజమండ్రి సెంట్రల్ జెయిలులో నక్సలైట్ ఖైదీలు నేతగాని రాఘవయ్య, పీరయ్య, బసవరాజుగార్లు 4–10–74 నుండి, పి. ఆర్. మోహన్‌రావు, బండయ్యగార్లు 10–10–74 నుండి నిరాహారదీక్ష చేస్తున్నారు. పగలు లాకప్‌లో ఉంచడాన్ని ఎత్తివేయాలని, వారిని కన్‌డెమ్న్‌డ్ సెల్స్‌లో ఉంచగూడదని, జైలు అధికారులు స్వాధీనం చేసుకున్న సాహిత్యం తిరిగి ఇచ్చివేయాలని, ఉల్లిపాయలు, గుడ్డలు, పళ్ళాలు, గ్లాసులు మొదలయినవాటిని ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. వీరి ఆరోగ్యపరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉంది. పశ్చిమబెంగాల్ జైళ్ళనే మరపిస్తున్న ఈ జైలు అధికారుల నిరంకుశ విధానాల్ని ప్రజాస్వామిక శక్తులన్నీ ఖండించవలసిందిగా కోరుతున్నాం.

"విద్యుద్ఘాతంవలన హుజూరాబాద్ రాడికల్ విద్యార్థి మృతి"

విద్యుత్‌షాక్‌వలన హుజూరాబాద్ తాలూకా మడిపెల్లి గ్రామానికిచెందిన రాడికల్ విద్యార్థి నాయకుడు శ్రీ ఎం. తిరుపతి మరణించారు. ఆయన వయస్సు 25 సంవత్సరాలు. ఎన్నో సాహితీ, సాంస్కృతిక సంస్థలతో సంబంధమున్న శ్రీ తిరుపతి మంచి వక్త. యువ కథారచయిత.

స్థానిక జనసాహితి సాహిత్య సంస్థ, హుజూరాబాదు తాలూకా రాడికల్ విద్యార్థి సంఘం, తాలూకాలోని కొన్ని యువజన సంఘాలు శ్రీ తిరుపతి మృతిపట్ల గాఢమైన తమ సంతాపాన్ని తెలుపుతూ తీర్మానాలు చేశాయి.

1974 అక్టోబరు 13 న హైద్రాబాదుపోలీసులు రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ విద్యార్థుల సభను విచ్ఛిన్నంచేసి, వారి నాయకులను అరెస్టుచేయటాన్ని గుంటూరు జిల్లా పౌరహక్కుల సంఘం ఖండిస్తోంది. వీరిపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండు చేస్తోంది.

జి. కోటేశ్వరరావు, సెక్రటరి

రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ విద్యార్థులపై హైద్రాబాదు పోలీసుల నిర్బంధ కాండను 'ప్రత్యక్షసాక్షి' సంకేత్‌గారుకూడా ఖండించారు.

* * *

నవంబర్ 4, 5 తేదీల్లో హైద్రాబాదులో సమావేశమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తంతి-తపాలా ఉద్యోగుల సదస్సు.

నెల్లిమర్ల జూట్ మిల్ కార్మికులపైన, హైద్రాబాదు ఉషా ఇంజినీరింగ్ కార్మికులపైన, నిమ్మపల్లి రైతాంగంపైన ప్రభుత్వం అనుసరిస్తోన్న కార్మిక వ్యతిరేక, అణచివేత, ప్రతీకారచర్యలపట్ల తీవ్ర సంతాపాన్ని తెలియచేస్తోంది: ఉరిశిక్షల్ని ఏ ప్రజాస్వామిక ప్రభుత్వము అమలుపర్చకూడదన్న ఐక్యరాజ్యసమితి తీర్మానానికి వ్యతిరేకంగా ఈ ఫాసిస్టు ప్రభుత్వం, శ్రమజీవులపక్షాన నిలబడి పోరాడుతున్న కామ్రేడ్స్ కిష్టగౌడ్ భూమయ్యలపై ఉరిశిక్షల్ని విధించింది. అలాగే ప్రజాపోరాటాల్ని కీర్తిస్తున్నారన్న కారణంగా విప్లవరచయితలైన కామ్రేడ్స్ ఎం.టి. ఖాన్, వరవరరావు, చెరబండరాజు, రంగనాథం వగైరాలపై కల్పిత కుట్రకేసులు బనాయించబడ్డాయి. ఇవన్నీ ఇందిరా గాంధి ప్రభుత్వపు సోషలిజం ముసుగులో సాగిపోతున్నాయి.

కాబట్టి వెంటనే కామ్రేడ్స్‌పై విధించబడ్డ ఉరిశిక్షలు రద్దుచేయాలని మిగిలిన కా॥ అందరిపై కొనసాగించబడుతున్న అన్నిరకాల నిర్బంధాలను వెంటనే బేషరతుగా ఎత్తివేయాలని యీ సదస్సు డిమాండ్ చేస్తున్నది.

ఆం.ప్ర. తంతి-తపాలా ఉద్యోగుల సదస్సు
హైదరాబాదు.

తిరుపతి కుట్రకేసు - మరికొన్ని అరెస్టులు

తిరుపతిలో మరొక విరసం సభ్యుడు కవి కె. రాఘవులుగారికోసం రాడికల్ స్టూడెంట్లుగా గత సంవత్సరం ఉన్న శ్రీయుతులు డి. రామమూర్తి, M.A. బి కోటేశ్వరరావు M.A. గార్లకోసం పోలీసులు గాలిస్తూ మొన్ననే డి. రామమూర్తిని అరెస్టు చేశారు. రెండురోజులక్రితం కామ్రేడ్ గురప్ప (M.L)ను అరెస్టుచేసి ఈ కుట్రకేసులో యిరికించారు. శ్రీకాకుళంజిల్లా పలుకూరులో మా-లె నాయకులైన శ్రీ తిరుమలసెట్టి పాండు, కె. మాలకొండయ్య అనేవారిని అరెస్టుచేసినట్లు పేపర్లు ప్రకటించాయి. పాలక

వర్గాల ఈ దమనకాండను ఖండించి విప్లవ రచయితలను విప్లవకారులను విడుదల చేయించుకోవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం.

చిత్తూరుజిల్లా పౌరహక్కుల సంఘం, చిత్తూరు.

కరీంనగర్ జిల్లా సిరిసిల్ల తా॥ నిమ్మపల్లి గ్రామ హరిజనులు, ఇతర కులస్తులు, గ్రామ సంఘ సభ్యులు తమ న్యాయమైన భూమిని భూస్వామి ఆక్రమించుకున్నందుకు వ్యతిరేకంగా నిలిచి తగిన బుద్ధిచెప్పారు. భూస్వామి సాయుధదళాలుదింపి భయానక వాతావరణం సృష్టించాడు. ప్రజలంతా దీన్ని ఖండించాలని కోరుతున్నాం.

— కార్యదర్శి, తా॥ రైతు కూలీ సంఘం, సిరిసిల్లా

దళిత పాంథర్స్:

కుల, మత, వర్ణవ్యవస్థను రూపుమాపేందుకు, సమాజంలో సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అణగదొక్కబడి, దోపిడీచేయబడుతున్న దళిత ప్రజానీకాన్ని సంఘటితపరచి, చైతన్యంచేసే వుద్దేశంతో "దళితపాంథర్స్" (ఆంధ్రప్రదేశ్) తెనాలిలో (వహాబ్‌రోడ్డు) అక్టోబరు 20 న ఏర్పడింది. రాష్ట్రి కన్వెన్షను జనవరి 75 తెనాలిలో జరుగుతుంది. వర్ణాంతర, మతాంతర వివాహాలు ప్రోత్సహించటానికి అవసరమైన సహాయసహకారాలు అందించటానికి 'దళిత పాంథర్స్ మేరేజి బ్యూరో' ఏర్పడింది.

— పి.ఆర్. రావు, కార్యదర్శి

*   *   *

ఆదిలాబాద్ సాయుధ రైతాంగవీరులు, త్యాగధనులు అయిన భూమయ్య, కిష్టాగౌడ్ కామ్రేడ్లపై విధించిన ఉరిశిక్షలు రద్దుచేయాలని వరంగల్ విరసంశాఖ డిమాండ్ చేస్తున్నది.

*   *   *

ప్రజాహృదయాలతో చీకట్లో దాగి
ప్రజలకోసం పలికే ప్రజాకంఠాలే నిజమైన న్యాయస్థానాలు
పునాదిరాళ్ళకై పోరాటం చేసేవాళ్ళను ఉరితీయాలని
సామాన్యుని కోసం రాసే వాళ్ళను నిర్బంధించాలని
ఏర్పరచిన రాజ్యాంగం నిర్ణయించిన కోర్టులు ప్రజలవికావు
ఎవరు కాదన్నా ఒకనాటికి ఇవే చరిత్రలో నిలిచే సత్యాలు. — చంద్రం

మార్క్స్ ప్రకారం, వర్గపాలనకు రాజ్యాంగ యంత్రం (State) పనిముట్టు. ఒక వర్గాన్ని యింకో వర్గం అణచివేయడానికి సాధనం. వర్గాలమధ్య సంఘర్షణ తీవ్రతను తగ్గించి యీ అణచివేతను చట్టబద్ధంచేసి, శాశ్వతం చేయడంకోసం సృష్టించబడ్డ విధానం (Order) యిది.

(లెనిన్— రాజ్యాంగయంత్రం— విప్లవం నుండి)

జైలు డాక్టర్లు - ఖైదీలు

విశాఖపట్నం సెంట్రల్ జెయిల్లో డాక్టర్ రోగులను ముఖ్యంగా నక్సలైట్ ఖయిదీలను సరిగా చూసేవాడుకాదట. ఒకసారి నక్సలైట్ ఖయిదీలు ఆయనతో "డాక్టర్, మాలోకూడ డాక్టర్లు వున్నారు. వాళ్ల ప్రజలకోసం ప్రాణాలిచ్చిన డాక్టర్ చాంగటీ భాస్కరరావు, డాక్టర్ దేవినేని మల్లికార్జునుడు యింకా అలాంటి వాళ్ళు— మిమ్ములను మేమేమీ ప్రజల కోసం ప్రాణాలు ఇవ్వమని అడగడంలేదు. కాని కనీసం డాక్టర్‌గా రోగుల ప్రాణాలు కాపాడే మీ విధినైనా నిర్వహించండి" అని అన్నారట. అప్పటినుంచీ ఆ డాక్టర్ వీళ్ళతో సరిగా ప్రవర్తిస్తున్నాడట.

* * *

ఇక సికింద్రాబాద్ (ముషీరాబాద్) జైలు డాక్టర్‌ది వేరే ధోరణి— "ఇక్కడి ఖయిదీలకు శుభ్రంగా ఆరోగ్యంగా ఉండాలనే జ్ఞానమేలేదు- అసలు ఈ దేశంలో దేన్నీ మార్చలేం-" అంటాడట. అక్కడున్న ఖయిదీలు ఆయనతో "డాక్టర్‌గారూ, మీరు కేవలం వైద్యం సైకాలజీని మాత్రమే నేర్చుకుని ఖయిదీల మనస్తత్వాలను యీవ్యవస్థ నుంచి వేరుచేసి చూస్తున్నారు- ఈ అన్నింటికీ కేంద్రమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రాతిపదికను అధ్యయనం చేయాల్సిన అవసరాన్ని గుర్తించకపోవటం వల్ల మీరిట్లా సినికల్ (చిరుబురులాడే మానవద్వేషి)గా తయారయారు- ఒక్కసారి నార్మన్ బెతూన్ జీవితం చదవండి- దీర్ఘకాలికమైన నిరంతర పోరాటంవల్ల యీ సమాజాన్నే మార్చగలిగినప్పుడు కొందరు వ్యక్తులను, అందులోనూ పేదవర్గీయులైన ఖయిదీలను మార్చలేమా ?" అంటారట-

Now Available

'The Scalpel, The Sword'

by

Sydney Gorden & Ted Allen

Price : Rs. 33-57

For Copies : New Book Centre
CALCUTTA.

రక్తాశ్రువులు

డా॥ నార్మన్ బెతూన్ అమరగాథ

ప్రచురణ : జనతా ప్రచురణలు
6-3-628/13, ఖైరతాబాద్,
హైదరాబాద్ - 500 004.

వెల : 3-20

విప్లవ మేధావి

డా॥ చాగంటి భాస్కర్రావు

డాక్టర్ చాగంటి భాస్కరరావు శ్రీకాకుళం జిల్లా సాయుధ రైతాంగ విముక్తి పోరాటంలో ప్రముఖ పాత్రను నిర్వహించిన విప్లవ మేధావి. ఆయన శ్రీకాకుళం జిల్లాకు నార్మన్ బెతూన్. కా॥ పంచాది అమరుడైన తర్వాత కా॥ భాస్కరరావు సోంపేట తాలూకా రైతాంగ బాధ్యతలను నిర్వహించాడు. టెక్కలి, సోంపేట, ఇచ్ఛాపురం తాలూకాలకు సోంపేట కేంద్రంగా వున్నది. కా॥ పంచాది లోటును భర్తీ చేశాడు.

కామ్రేడ్ భాస్కరరావు గుంటూరు జిల్లా పర్చూరు గ్రామంలో ధనిక రైతు కుటుంబంలో పుట్టాడు. విద్యార్థి ఉద్యమంలో కమ్యూనిస్టు ఉద్యమం వైపు ఆకర్షింపబడ్డాడు. గుంటూరు పట్టణంలో వైద్య విద్య అభ్యసిస్తూ జిల్లా విద్యార్థినాయకుడుగా ముందుకొచ్చాడు. 1966 లో గుంటూరులో హోటల్ యజమానుల స్వార్థపరత్వానికీ అధిక ధరలకూ వ్యతిరేకంగా విద్యార్థి ఆందోళనమూ, ఉక్కు ఉద్యమాన్ని రూపొందించాడు ఇందుకు ఆయనపై ప్రభుత్వం కేసు బనాయించింది. కా॥ భాస్కరరావు యం. బి. బి. యస్. పరీక్షలో మంచి మార్కులతో ఉత్తీర్ణుడై డిగ్రీ పొందాడు.

కా॥ భాస్కరరావు విప్లవకారుడు. తాను నమ్మిన సిద్ధాంతమైన మార్క్సిజం-లెనినిజం - మావో ఆలోచనావిధానంపై ఆయనకు అచంచలమైన విశ్వాసము. రివిజనిజానికి, నయా రివిజనిజానికి వ్యతిరేకంగా విప్లవ సిద్ధాంతంకొరకు ఆయన జిల్లా విద్యార్థి లోకములో పెద్దఎత్తున సంచలనం కల్గించాడు. నక్సల్బరీ రైతాంగ విముక్తి పోరాటమును గురించి పెద్దఎత్తున ప్రచారం గావించాడు. మావో మిలటరీ రచనలలో మొదటి భాగమును తర్జుమాచేసి ప్రచురించి విప్లవకారులకు అందజేశాడు. 'రణభేరి' అనే వ్రాతపత్రికను తయారుచేసి జిల్లాలో విప్లవ విద్యార్థులకు, విప్లవ కార్యకర్తలకు అందించాడు. గుంటూరు జిల్లాలో జరిగిన రాష్ట్ర మహిళా రాజకీయ పాఠశాలలో తత్త్వశాస్త్రం బోధించాడు పీకింగు రేడియో ప్రసారం చేసిన వార్తలను, వ్యాసములను ప్రచురించాడు. గుంటూరు జిల్లాలోనేగాక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో విద్యార్థి యువజన లోకానికి రాజకీయ చైతన్యం కలిగించి విముక్తి పోరాటాల నుత్తేజపరచుటకు అవిరామ కృషి చేశాడు. పార్టీ బాధ్యుల ప్రోత్సాహముతో కామ్రేడ్ భాస్కరరావు 1968 లో ఒంగోలులో ప్రజా వైద్యశాలను ఆదర్శప్రాయముగా పేదప్రజలకు ప్రయోజనకరంగా నడప

టములో పాలుపంచుకున్నాడు. ఆయనకు ఇది సంతృప్తి కరము అయినదికాదు. పేద లను పీడించే వ్యాధులన్నింటికి ఆధారభూతమైన దోపిడీవ్యవస్థను రూపుమాపటము ప్రధానమని భావించేవాడు. డాక్టరు భాస్కరరావు ప్రజావైద్యశాలకు స్వస్తి చెప్పి ప్రియమైన తల్లితండ్రులను భార్యాబిడ్డలను వదిలి, శ్రీకాకుళం జిల్లా కామ్రేడ్స్‌తో కలిసి రాష్ట్రంలో రైతాంగ విముక్తి పోరాటమును ప్రారంభించుటకు బయలుదేరాడు. విప్లవ మేధావి డాక్టరు భాస్కరరావు.

కామ్రేడ్ భాస్కరరావు ప్రథమశ్రేణికి చెందిన కమ్యూనిస్టు. ఆయన చేసే ప్రతి పని విప్లవ సిద్ధాంతంమీద ఆధారపడే రూపొందాలి- అమలుజరగాలి. చైర్మన్ మావో బోధించిన మరువరాని మూడు వ్యాసములు, మావో సూక్తులు, మావో మిలటరీ రచనలు, ఎక్కడకు వెళ్ళినా తనవెంట ఉండవలసినదే విరామసమయంలో అవసర మైనప్పుడు, ప్రతిరోజు వాటిని అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని అధ్యయనము చేయ వలసినదే. నిద్రించే సమయంలో కూడా ప్రక్కన తుపాకి ఉండవలసినదే.

కామ్రేడ్ భాస్కరరావు శ్రీకాకుళం జిల్లా ప్రవేశించగానే ఒరిస్సా సరిహద్దులలో యున్న మహేంద్రగిరి ప్రాంతములో (ఏజన్సీ) తన కృషిని ప్రారంభించాడు. ఆ తరు వాత ఇతర ప్రాంతములకు విస్తరించాడు. అధ్యక్షుడు మావో ప్రబోధము ప్రకారము ఆ ఏజన్సీ గ్రామములన్నింట ఆర్థిక పరిస్థితులను సర్వేచేశాడు. రైతాంగంతో సంబంధము కావటానికి ఒరియా భాషయొక్క అవసరాన్ని ఆ కామ్రేడ్ గమనించాడు. ఒక్క నెలలో ఒరియా చదువుట, రాయుట, మాట్లాడుట నేర్చుకున్నాడు. కష్టతరమైన ప్రయాణములను సంతోషపూర్వకముగా చేయుట, రైతులు ఇచ్చిన గంజితిని, సంతోషము వ్యక్తపరచటం కా॥ భాస్కరరావుకు మామూలు. గ్రామ గ్రామానికి తిరిగి ఇంటింట వర్గరాజకీయాలను బోధించాడు. గ్రామాలకు ఏ గెరిల్లా దళం వెళ్ళినా పిల్లల నుండి పెద్దలదాకా, రైతాంగం స్త్రీపురుష భేదంలేకుండ దళంచుట్టూమూగి 'కా॥ డాక్టరు బాబు ఆసిల్లా' (డాక్టరుబాబు వచ్చారు) అని మొట్టమొదటిగా ప్రశ్నలవర్షం కురిపించే వారు. ఆయనంటే రైతాంగానికి అపారమైన ప్రేమాభిమానం.

డాక్టరు భాస్కరరావు నిరాడంబర జీవి. ఒక చొక్కా, ఒక పేంటు, లుంగీ మాత్రమే ఆయనకున్న గుడ్డలు లుంగీ కట్టుకొని ఆయన తన గుడ్డలను స్వయంగా ఉతుక్కునేవాడు. ఒకరోజు ఆయన తన లాగును విడిచి లుంగీని ధరించి బైటకు వెళ్ళాడు ఆయన తిరిగి వచ్చేటప్పటికి అక్కడవున్న మహిళా కార్యకర్త, ఆ లాగు మురికిగా ఉండటము చూచి తీసుకొనివెళ్ళి ఉతకటము ప్రారంభించింది. ఇది చూచి కా॥ భాస్కరరావు ఆమెను మందలించి తానే స్వయంగా ఉతుక్కున్నాడు. ఆయన ఏజన్సీకి

వెళ్ళేముందు బర్కిలీ సిగరెట్టు త్రాగేవాడు. అచ్చట క్రమంగా చార్మినార్‌కు, బీడీలకు మారాడు. దళానికి బీడీలుపంచే బాధ్యుడైన కామ్రేడ్ తనకొకసారి అదనంగా కొన్ని బీడీలు ఇవ్వటం గమనించి, ఇంకెవ్వరికి అదనంగా ఇస్తున్నారో బైటకులాగి కా॥ భాస్కరరావు ఆయనను, ఆయనతోపాటు అదనంగా తీసుకొంటూన్నవారిని సమావేశములో బయటపెట్టి మందలించాడు.

కామ్రేడ్ భాస్కరరావు జీవితం క్రమశిక్షణగల ఆదర్శప్రాయమైనది. ఆయన మితభాషి. తన కాలమును ఒక్క నిమిషముకూడా వృధాకానివ్వడు. బాతకానీయంటే ఆయనకు మహాఅసహ్యం. దళములకు వర్గరాజకీయములను చెప్పటం, చర్చలు, ప్రజలమధ్య కృషి మిగిలిన కాలములో మహారచనల అధ్యయనము, ఆయన నిత్యకృత్యాలు. దళములలో ఎవరు అనారోగ్యమునకు గురైనా ముందు ధైర్యం చెప్పి తరువాత ఏదైనా మందువుంటే యిచ్చేవాడు. ఆయన గొప్ప బోధనాశక్తి కలవాడు. ఒక్క క్లాసులోపల ఇంజెక్షన్ ఎలా యివ్వాలో, దెబ్బతగిలిన వారికి ఎలా చికిత్స చెయ్యాలో, తూటా దెబ్బలకు ఎలా చికిత్సచెయ్యాలో దళాలకు బోధించాడు. ఇక్కడ దళ సభ్యులు తమంతటతాము ఇంజెక్షన్‌లను యివ్వటము మొదలుపెట్టినారు. పోరాటములో నిబ్బరంగా, ధైర్యంగా వ్యవహరించటమెలాగో కామ్రేడ్ భాస్కరరావు వద్దనుండి నేర్చుకోవలసిందే 1969 ఏప్రిల్‌లో ఇద్దరు దళసభ్యులను వెంటపెట్టుకొని డాక్టరు భాస్కరరావు రొంపా అనే గ్రామము వెళ్ళి తిరిగి వస్తుండగా కొండచాటు ఒకమలుపులో 12 మంది సాయుధపోలీసులు హటాత్తుగా దగ్గరకు ఎదురయ్యారు. డాక్టరు భాస్కరరావు చేతనున్న తుపాకిని గురిపెట్టి నిలబడ్డాడు పోలీసులు ఇంగుతిని ఏజంట్లను ముందుకు త్రోసి కాళ్ళకు బుద్ధిచెప్పారు. ఆ సందర్భంలో ముళ్ళచెట్లను దాటి రక్షణ తీసుకొనుచుండగా ముళ్ళు కంటికి గుచ్చుకొని చర్మాన్ని లాగివేశాయి. కన్నురెప్ప చీల్చుకుపోయింది. గుడ్డలు రక్తసిక్తమైనాయి స్థావరం చేరగానే అచ్చటి కామ్రేడ్స్ డాక్టరుగారి కన్నుపోయింది అని ఆందోళనచెంది కంటతడిపెట్టారు ఆయన ఫరవాలేదు అని వారికి నిబ్బరము చెప్పి, అద్దముచూసి తనకుతాను చికిత్స చేసుకున్నాడు. తనవద్ద మిగిలియున్న కంటి ఆపరేషన్‌పరికరాలను అమ్మి పోరాటం కొరకు ఖర్చుపెట్టాడు. కామ్రేడ్ భాస్కరరావుతో పాటు దళాలలోయున్న కామ్రేడ్స్‌కు ఆదర్శప్రాయమైన ఆయన జీవితమే క్రమశిక్షణను నిబ్బరాన్ని, ధైర్యాన్ని బోధించింది.

కామ్రేడ్ భాస్కరరావు మైదానప్రాంతమైన సోంపేట ఏరియాలో 1 సం॥ కాలం రైతాంగ విముక్తి పోరాటానికి నాయకత్వం వహించాడు విప్లవకారుని, వారి నిజాయితీని అంచనాకట్టడములో ఆయన నేర్పరి. నిజాయితీపరులయిన విప్లవకారులను వారి

అనుభవము ఐక్యంచేస్తుందని ఆయన ప్రగాఢమైన అభిప్రాయం. కా॥ భాస్కరరావు
ఏ విషయంలో అయినా సమగ్రంగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చేవాడు. ఒక నిర్ణ
యానికి వచ్చినతర్వాత ఎన్ని ఆటంకాలువచ్చినా వాటిని అధిగమించి ముందుకు పోవల
సిందే. కా॥ భాస్కరరావు పోరాటరంగంలో వుండగా ఒకసారివచ్చి కనబడివెళ్లమని
అతని తల్లి ఒక మిత్రునిద్వారా వార్త పంపింది. ఆ వార్త విని దాని నందించిన మిత్రు
నికి ఒక చిరునవ్వు పడవైచి వూరుకున్నాడు. కా॥ భాస్కరరావుకి ఆయన భార్యాబిడ్డలు
ఉత్తరం వ్రాసినా అదే సమాధానం. పీడిత ప్రపంచమే ఆయన కుటుంబం.

కా॥ భాస్కరరావు 1969 నవంబరులో మత్తెపేటవద్ద కా॥ గణపతి మరి యిరు
వురు కామ్రేడ్స్‌తో శత్రువుచేతబడ్డాడు. కా॥ భాస్కరరావు గణపతిగార్లను శ్రీకాకుళం
తీసుకొనివెళ్ళి చేతులకు బేడీలువేసి నిలబెట్టి వారిని, వారి రాజకీయాలను అగౌరవ
పరుస్తూ వాగడం మొదలెట్టారు. బొందిలో ప్రాణంవుండగా యిట్టివి సహించేవారు
కారు. ఆ విప్లవకారులు వెంటనే— కా॥ భాస్కరరావు బేడీలతోనే తన చేతులెత్తి ఆ
తుంటరి నెత్తిన కొట్టాడు— కా॥ గణపతి మరొక దెబ్బతీసాడు. వాడు హడలిపో
యాడు. తనచేత జిక్కిన విప్లవ యోధులను నాటి రాష్ట్రహోంమంత్రి ఆజ్ఞప్రకారం
పోలీసు అధికారులు తుపాకిగుండ్ల కెరజేశారు. శ్రీకాకుళం జిల్లాలో పోరాటశక్తులకు
రూపురేఖలు దిద్దిన మహావిప్లవకారుడు, విప్లవ మేధావి కా॥ భాస్కరరావు ఆయన
చేసిన రక్తదానం విప్లవ ప్రతీఘాతక పాలకవర్గాలను దహించివేయక మానదు.

['అమరవీరుల జీవితచరిత్రలు' నుండి]

కాలం పురోగమిస్తోంది— ఆగదు
విప్లవం జ్వలిస్తోంది— చావదు
ఉద్యమం నెలబాలుడు
పెరిగి పెద్దవాడై
వినూత్న జీవిత మహాకావ్యాన్ని రచిస్తాడు— తప్పదు.

ఆం.ప్ర. సాహిత్య అకాడమీ అవార్డు తిరస్కృతి :
శ్రీ కాళీపట్నం రామారావు ప్రకటన.

లోగడనేను రాసిన కొన్నికథలు "యజ్ఞం" అనేపేరుతో ఓ సంపుటిగా వెలువడ్డాయి. ఈ సంపుటిని ఉత్తమ కథలుగా నిర్ణయించి అందుకు వెయ్యినూట పదహార్లు బహుమతిగా యివ్వ నిశ్చయించినట్టు ఆం॥ప్ర॥ సాహిత్య అకాడమీవారు నాకు తెలియజేసేరు. పత్రికాముఖంగా మీకూ తెలియజేసేరు.

వారి నిర్ణయం మనచేతుల్లో లేకపోయినా వారిస్తామనే బహుమానం తీసుకోవడమా మానడమా అనేది మనచేతుల్లోనేఉంది. ఈ ఆం॥ ప్ర॥ సాహిత్య అకాడమీ ప్రజాసంస్థకాదు. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్థాపించిన సంస్థ. ఒక సెక్రటరీ లెవెల్ ప్రభుత్వోద్యోగి దీనిపనులు నిర్వహిస్తారు. ఓ మంత్రిగారి పర్యవేక్షణకింద దీని కార్యకలాపాలు సాగుతాయి. కవులూ పండితులూ (అభ్యుదయ భావాలుకలవారుకూడ) ఎందరున్నప్పటికీ దీనిమీద హయాం మాత్రం ప్రభుత్వంవారిదే- ఈ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎవరిదైనా కావచ్చుకాని కష్టించి పనిచేసే పేదలదిమాత్రం కాదు. అందుకు నిదర్శనం ఈ ప్రభుత్వంలోకూడా పరాయి పాలనలోలాగే నూటికి తొంభైమంది నిరుపేదలుగానే మిగిలిపోవడంతో మేం ఎందుకిలావుండాలని ప్రశ్నించే ఆ పేదవారిని కిక్కురు కక్కురుమనకుండా కాల్చేస్తున్న ఈ ప్రభుత్వం పేదలమీది ప్రభుత్వమేగాని పేదల ప్రభుత్వం కాదు, ఎన్నటికీ కాజాలదు.

కొన్నివేల జనాన్ని తుపాకులతో కాల్చిచంపి, తుపాకులమీదేతప్ప మరింకే దేనిలోనూ తనకి నమ్మకంలేదని ఈ ప్రభుత్వం రూఢీచేసింది. ఈ ప్రభుత్వపు ఉచ్చుల్లోంచి బయటపడాలంటే పేదజనంకూడా తుపాకుల ఉపయోగంమీదే నమ్మకంపెట్టుకోవాలి తప్ప ఎలక్షన్ల ఎండమావులమీద ఆశలుంచుకుని లాభంలేదు. ఇది గమనించిన మా విప్లవరచయితలు ఆ నిజాన్ని జనానికి చెబుతున్నందుకు ఈ ప్రభుత్వం జైళ్ళలో పెట్టించడమేకాక యింకా అనేకవిధాల దాడులుచేసి వారిని యిబ్బందిపెట్టి హింసిస్తూంది.

ఈ ప్రభుత్వ సాహిత్య అకాడమీ బహుమానం వడ్డీవ్యాపారులు ఏటా పండుగలకి పేదలకి చేసే అన్నసంతర్పణలాంటిదని తెలిసినవారంతాను. ఈ బహుమతి నేను తీసుకుని ఏ జనంకోసమైతే 'యజ్ఞం' కథ రాసేనో వారికి ద్రోహం చేయదల్చుకోలేదని ఈ వేళ ఈ జనంమధ్య నిల్చొని ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారికి అవసరంగానూ స్పష్టంగానూ తెలియజేస్తున్నాను.

కాళీపట్నం రామారావు, విశాఖ.

25-10-74

SRJANA Telugu Monthly Dec. '74 H/WL-
Regd. No. with Registrar of News Papers 10953/67

కామ్రేడ్స్ భూమయ్య, కిష్టాగౌడ్‌లు యీ ఫాసిస్టు ప్రభుత్వ ఉరికంబాలకు బలైపోవాలా?

తమ సర్వస్వాన్ని త్యాగంచేసి ప్రజాసేవయే ఊపిరిగా సమసమాజ స్థా
ధ్యేయంగా సాయుధ పోరాటబాటలో పయనించిన ఆదిలాబాద్ రైతు గెరిల్లా యోధు
కామ్రేడ్స్ భూమయ్య. కిష్టాగౌడ్‌లు యివ్వాళ ఉరికంబాలమీద నిలబడివున్నారు. య
ధనస్వామ్య దోపిడీ ప్రభుత్వపు ఉరితాళ్లు ఏ క్షణంలోనైనా మన కామ్రేడ్స్ ప్రాణాల
లాగేయవచ్చు- అయినా వారి పెదాలపై చిరునవ్వును యివి చెరిపేయలేకపోతున్నా
కళ్ళలో ఎర్రని భవిష్యత్తుపై ఆశను. అచంచల విశ్వాసాన్ని తుడిచేయలేకపో
న్నాయి. వీరికి తెలుసు 'ప్రజలకోసం ప్రాణాలర్పించడం హిమాలయంకన్నా గంభీ
మైందని'- "ఉరికంబాలమీద నిలిచి యీ వీరులు విప్లవోజ్వల గీతాలు పాడుతున్నారు
ఈ దేశంలో కోట్లాది ప్రజల దైన్యానికి. ఆకలిచావులకు. ఆత్మహత్యలకు. అవమా
నాలకు. నికృష్ట జీవితాలకు కారకులైన భూస్వాముల. దళారీల బ్లాక్‌మార్కెటీ
స్మగ్లర్లను శిక్షించకుండా వారికి అనేక రక్షణలు. సౌకర్యాలు కల్పిస్తుంది ప్రభుత్వ
కాని పీడిత ప్రజల విముక్తికోసం పోరాడే త్యాగధనుల గుట్టుచప్పుడు కాకుండా కా
చంపుతుంది- ఇదీ దీని వర్గస్వభావం- ఇక ఇక్కడి న్యాయస్థానాలుకూడా యీ ధ
స్వామ్య పాలకవర్గాల ప్రయోజనాలు కాపాడడానికే నియమించబడ్డాయి- డబ్బూ. అ
కారమూ ఉంటేచాలు- ప్రజల పచ్చినెత్తురుతాగుతూ, హత్యలుచేస్తూకూడా సగర్వం
గౌరవంగా కాలరెత్తుకొని తిరగొచ్చు- ఈ బూర్జువా కోర్టులే చెప్పుతున్నట్లు వీ
కళ్ళులేవు- నేరమొకచోట. విచారణా. శిక్షా యింకొకచోట- అంతా సాక్ష్యం మీద
మరి సాక్ష్యం సృష్టించేదీ. లేకుండాచేసేదీ పోలీసులూ. డబ్బూ. అందుకే ప్రభుత్వ
కోర్టులూ, శాసనసభలూ వేరు వేరు అనుకోవడం పొరపాటు- ఆ మూడూ దో
వర్గాల ప్రయోజనాలకోసం రాయబడ్డ రాజ్యాంగంలోనుంచి ఉద్భవించినవే.

అందుకే అన్ని అనర్థాలకూ మూలంగావున్న వర్గసమాజం నాశనంకానిదే ద
ఉపరినిర్మాణం. యీ కోర్టులూ, చట్టాలూ కూలిపోవు- అందుకే వర్గరహిత సమా
కోసం సాయుధ పోరాటం ఉధృతంగా కొనసాగవలసిందే-

మన ప్రియతమ రైతు గెరిల్లాలు కామ్రేడ్స్ భూమయ్య, కిష్టాగౌడ్‌ల ఉరిశి
రద్దుకై మేధావులు, కార్మిక కర్షకులూ, విద్యార్థి యువజనులూ పెద్ద ఎత్తున ఆందో
కొనసాగించాలి-

విప్లవం వర్ధిల్లాలి. బూర్జువా కోర్టులు నశించాలి. ప్రజాకోర్టులు రావాలి.

SRJANA
Hanamkonda
Warangal 506001
Rs. 1-